اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 5 సంచిక 2 సెప్టెంబర్ 2013 రూ.20/-



## ముస్లిములంతా ఐక్యంగా ఉండాలి

ప్రత్యేక వ్యాసం

మరియు స్థిరంగా పట్టుకోండి
అందరూ కలిసి
అల్లాహ్ త్రాడును
మరియు విడిపోకండి ...
(ఖుర్'ఆన్ 3:103)

ఖబ్బాబ్(రజి)వారి అసాధారణ దాతృత్వం

ఈ లోకంలో జన్మించిన ప్రతీ మనిషి అల్లాహ్ నిర్దేశించినంత కాలం జీవిస్తాడు. ఆ తరువాత మరణిస్తాడు. ఈ విధంగా పుట్టిన ప్రతీ మనిషి మరణిస్తాడు. విశ్వానికి కూడా ఒక గడువు ఉంది. ఆ గడువు పూర్తవగానే, ఈ లోకం కూడా నాశనం అవుతుంది. ఈ సృష్టిలో జీవించి మరియు మరణించిన వారందరూ పునరుత్థాన దినమున అల్లాహ్ చే తిరిగి లేపబడతారు. ఆ విధంగా అల్లాహ్ అందరినీ సమావేశ పరుస్తాడు. ప్రతీ ఒక్కరి విషయంలో తీర్పు నిస్తాడు.

శాశ్వత స్వర్గమా? లేక శాశ్వత నరకమా?

మరణించినప్పటి నుండి తిరిగి లేపబడేవరకూ మరొక జన్మ ఉండదు.

رَبَّنَآ اِنَّکَ جَامِعُ النَّاسِ لِیَوۡمٍ لَّا رَیۡبَ فِیۡهِ اِنَّ اللّٰهَ لَا یُخۡلِفُ الۡمِیۡعَادَ

సృష్టికర్త

الله

అల్లాహ్

అల్-జామి'ఉ

اَلۡجَامِعُ

(తీర్పు దినమున)

అందరినీ సమావేశ పరిచేవాడు

THE GATHERER

**Our Lord! Surely You will gather the people on a Day about whcih there is no doubt. Verily ALLAH does not go back on His promise. (Qur'an 3:9)**

ఓ మా ప్రభూ! నిశ్చయంగా నీవే ఆ దినమున మానవులందరినీ సమావేశ పరుస్తావు. సందేహం లేదు దానిలో. నిశ్చయంగా, అల్లాహ్ భంగం చేయడు తన వాగ్దానాన్ని (ఖుర్'ఆన్ 3:9)

# శాంతిబాట


**మాసపత్రిక** రూ.20/-

సంపుటి 5 సంచిక 2 సెప్టెంబర్, 2013

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

**www.saanthibaata.net**

**www.saanthibaata.com**



Email:velugubaata@gmail.com

**Cell : 9491103017**



**ముఖ్య గమనిక : శాంతిబాట లోగో రిజిష్టర్ చేయబడింది.** *శాంతిబాట పేరుకు దగ్గరగా ఉండే విధంగా శాంతిబాటను అనుకరిస్తూ, శాంతిబాటతో సంబంధం ఉందని ప్రజలు బావించే విధంగా ఎవరైనా శాంతిబాట వ్యాసాలను గాని, మా సొసైటీచే ప్రచురించబడిన పుస్తకాలలోని విషయాలను గాని పబ్లిష్ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.* ***మా దగ్గర నుండి వ్రాతపూర్వకంగా అనుమతి లేకుండా, వీటిలోని ఏదైనా భాగాన్ని ఎవరైనా ప్రచురించడం లేదా జెరాక్స్ కాపీలు తీసి అమ్మడం చేస్తే ఇన్షా అల్లాహ్ వారి పైకూడా చట్టపరంగా ప్రొసీడ్ కావడం జరుగుతుంది.*** *మా వెబ్‌సైట్ నుండి శాంతిబాట సంచికలు ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని ఎవరైనా చదువుకునే అవకాశాన్ని మాత్రమే కల్పించాముగాని, వీటిలోని విషయాలను* ***ప్రచురించు కోవడానికి ఎవరికీ ఎటువంటి హక్కులు ఇవ్వలేదు.*** *ఈ రాష్ట్రంలోనే కాదు, ఇండియాలోని ఏ రాష్ట్రంలోని ఏ పబ్లిషర్స్‌తోనూ మాకు ఎటువంటి సంబంధాలు లేవు. ఒకవేళ మా పాఠకులు అటువంటి ప్రచురణలను చూడటం జరిగితే, వెంటనే* ***మాకు తెలియజేయమని మనవి.*** *శాంతిబాటలో ప్రచురించబడుతున్న శీర్షికలను ఇన్షా అల్లాహ్ పుస్తకాలుగా* ***తెలుగు, English, ఉర్దూ****లో విడుదల చేయడానికి ప్రయత్నిస్తాము.*



**ఎడిటర్:**

ఎమ్‌డి. అతహరుల్లా

**ఎడ్వయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు

ఎమ్‌డి. అఫ్ఘాన్ ఉమ్రీ

**Editor**

Md. Athaharullah

**Advisory Board**

Dr. Salim Pasha

Dr. Nagireddi Srinivasa Rao

Md. Affan Omri

**Printed by**

Md. Athaharullah

**Published by**

Md. Athaharullah

**Owned by**

Velugubaata Educational Society

(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**

Saanthibaata Publishing House,

19-1-447, Hanuman Statue Center

Samalkot - 533440

and

**Published at**

2-8-31, Kota Bazar, Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah

Phone : 9347046090,

Email: velugubaata@gmail.com

RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**

T. Srinivasa Rao

(Zakir)


## సెప్టెంబర్' 2013 (షవ్వాల్ - జిల్ ఖాఇదా, హి. 1434)


5 **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం:** ఖుర్'ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ అల్-బఖరా తఫ్సీర్ : 67 - 77 ఆయత్‌లు ...

7 **తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). నవముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం- **ఖబ్బాబ్ బిన్ అరత్త్**(రజి)

16 **ముస్లిములంతా ఐక్యంగా ఉండాలి ...**

32 **ముస్లిమ్ మహిళ :** మెట్టినింటిలోని పరిస్థితులకు అనుగుణంగా ...

35 **బాలబాలికలకు ప్రత్యేకం :** పాంపై పట్టణం ...

38 **ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్'ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని... (మార్చి, 2013 సంచికతో పూర్తయ్యాయి)


**సంవత్సర చందా :**

**రూ. 240/-**


**(వివరాలకు పేజీ నెం. 40 చూడండి)**



**Velugubaata**
**Educational Society**
D.No. 2-8-31, Kota Bazar
SAMALKOT - 533440
**East Godavari District**


మీ ఎడ్రస్ మారినా లేక ఫోన్ నంబర్ మారినా మీరు కాల్ చేయవలసిన నంబర్ : **9491103017**

**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.*

**(ముహమ్మద్ అబ్దుల్ కరీమ్ )**

ప్రతీరోజూ మధ్యాహ్నం 3 గం. నుండి సాయంత్రం 5 గం. వరకు

లేదా పై నంబర్‌కి **SMS** ద్వారా తెలియజేయండి

**విమర్శలు, అభిప్రాయాలు, సందేహాలు**




**వాటిని మీ పూర్తి ఎడ్రస్‌తో సహా లెటర్‌లో వ్రాసి పంపవలెను.**

***We don't accept any funds from within India or from abroad except from our team members and close friends who have Taqwa and whose money is earned in Halaal way as instructed by Our Holy Prophet Muhammad(s). We don't ask financial help from anybody at any time, except from ALLAH. If anybody wants to help us, they can try to increase our subscribers by joining their friends and relatives or can buy a fixed number of copies every month.***

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# మన దేశంలో జ్ఞానానికి ఇచ్చిన ప్రాధాన్యత

సైన్స్ (science)ని అరబీలో ఇల్మ్ అంటారు. స్పేస్ సైన్స్‌ని 'ఉలూముల్ ఫజాఅ' అంటారు. కొన్ని రోజుల క్రితం మార్స్ గ్రహంపై పరిశోధనలు జరపడానికి మన ఇస్రో(ISRO) రాకెట్ పంపింది. దీని కొరకు దాదాపు 450 కోట్ల రూపాయలు ఖర్చయింది. మార్స్ గ్రహాన్ని చేరు కోవడానికి 40 కోట్ల కిలోమీటర్ల దూరాన్ని 300 రోజుల పాటు కక్ష్యలో ప్రయాణించ వలసి ఉంది. భూమి మీద నుండి ఇచ్చే ఆదేశాల ద్వారా ఆ రాకెట్ దారి తప్పకుండా మార్స్‌ని చేరుకుంటుంది, ఇన్షా అల్లాహ్! మన కంటే ముందు 3 దేశాలు ముందుగానే ఈ కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించాయి. ఇప్పుడు మనదేశం ఈ విషయంలో **4వ స్థానంలో ఉంది**. అంతరిక్ష పరిశోధనలలో మన శాస్త్రవేత్తలు కూడా రాకెట్‌లా దూసుకెళ్తున్నారు. ఒకప్పుడు మన దేశంలోని ఏదైనా ప్రాంతానికి ఉపగ్రహ ఛాయాచిత్రం కోసం ఇతర దేశాలపై ఆధారపడవలసి వచ్చేది. కాని నేడు మంచి రిజల్యూషన్‌లో ఛాయా చిత్రాలను మన దేశ ఉపగ్రహాలే అందించ గలుగు తున్నాయి. మంచి కమ్యూనికేషన్ వ్యవస్థ మనకుంది. మనమంతా గర్వించే స్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే ఆ శాస్త్రవేత్తలకు మనం ఏ స్థాయిని కల్పించాము? మన దేశంలో క్రికెట్‌కు ఎంత విలువిస్తారో చెప్పనవసరం లేదు. మన దేశం తరపున ఆడే ఆటగాళ్ళు గెలిస్తే ఎన్నో కంపెనీలు వారి మీద నోట్ల వర్షం కురిపిస్తాయి. కొన్ని రాష్ట్రప్రభుత్వాలు మరియు అదే విధంగా కేంద్రప్రభుత్వం కూడా విలువైన బహుమతులిచ్చి వారిని నెత్తిన పెట్టుకుంటాయి.


కాని ఏ దేశప్రతిష్ఠనైనా ఉన్నత స్థాయిలో ఉంచేవి ఆ దేశంలో అమలులో ఉన్న మానవతా విలువలు మరియు సైన్స్ అండ్ టెక్నాలజీలో జరిగే అభివృద్ధి. ఒక కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించినప్పుడో లేక ఓ అంతరిక్ష పరిశోధన విజయవంతమైప్పుడో సైంటిస్ట్‌లకు అభినందనలు తెలుపుతారు. **అంతే!** కాని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా వారికి ప్రత్యేక బహుమతులు ప్రకటించదు. ఆ రోజు మనవారికి ఓ పండుగలా అనిపించదు. అత్యధిక ప్రాధాన్యత క్రికెట్‌కు ఇస్తున్నారు. కొన్ని న్యూస్ పేపర్లలో రెండు పేజీలు ప్రత్యేకంగా క్రీడలకే కేటాయిస్తున్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి, దాని ఫలాలు ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో ఆ వైనం గురించి మరియు ఆ అభివృద్ధిలో శాస్త్రవేత్తల కృషి గురించి రిపోర్ట్ చేయడానికి మాత్రం ఆసక్తి ఉండదు.

సైంటిస్ట్ సి.యన్.ఆర్. రావు గారికి మరియు క్రికెటర్ సచిన్‌కు భారతరత్న ఇచ్చారు. మీడియా కవరేజి గమనించే ఉంటారు. ఏదైనా ఓ నవలకు విదేశీ పురస్కారం అందితే మీడియాలో సాధారణంగా విపరీతమైన కవరేజీ ఉంటుంది. నోబెల్ బహుమతితో సమానమైన 10 లక్షల డాలర్ల డాన్ డేవిడ్ ప్రైజ్ 2005లో సి.యన్.ఆర్.రావు గారికి లభించినా, ఎవరూ మాట్లాడలేదని ఆయనే ప్రెస్‌మీట్‌లో చెప్పారు. కాని మరోదేశంలో నయితే ఇదే అవార్డు ఎవరికైనా వచ్చి ఉంటే గొప్పగా చెప్పుకునేవారన్నారు. క్రీడలు, పోలీస్, సైన్యం లేదా ఇతరులకు ఇచ్చే ప్రాధాన్యం శాస్త్రవేత్తలకు ఇవ్వడం లేదని చెబుతూ, దేశంలో విలువలు, ప్రాధాన్యతలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. **"నా దేశం నన్ను గుర్తించింది. ఇది విజ్ఞానానికి లభించిన గుర్తింపు"** అని అన్నారు. వాస్తవానికి దేశ ప్రతిష్ఠను పెంచే అసలైన ఆటగాళ్ళు శాస్త్రవేత్తలే. ప్రపంచ వ్యాప్తంగా సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో అభివృద్ధి శరవేగంతో జరుగుతుంది. ఆ పోటీ తీవ్రంగా ఉంది. ఆ రేస్‌లో మన శాస్త్రవేత్తలు స్థిరంగా ఉత్సాహంగా ముందుకెళుతున్నారు. మామూలు ఆటగాళ్ళకు లభించేటంత విలువ కూడా మన శాస్త్రవేత్తలకు దక్కడం లేదు. శాస్త్రవేత్తలకు పెద్దపీట వేయాలి. **అది మన విద్యార్థులకు ఉత్తేజాన్నిస్తుంది.** ఇన్నోవేషన్‌లో **140** దేశాల జాబితాలో మన దేశం యొక్క స్థానం కేవలం **66.**

దేశం యొక్క ప్రతిష్ఠను దిగజార్చేవాటిని నిరోధించాలి. నిర్భయ ఘటన జరిగిన తరువాత, ఎన్నడూ లేనంత స్థాయిలో మానభంగాలు దేశమంతా జరుగుతున్నాయి. దానికి కారణాలు తెలుసుకోలేనంత అజ్ఞానంలో లేదు మన సమాజం. లక్షల కోట్ల కుంభకోణాలు బయట పడుతున్నాయి. మనదేశంలో అవినీతి రాకెట్ స్పీడును కూడా మించిపోయింది. ఈ అవినీతి, దౌర్జన్యాన్ని సైన్స్ అండ్ టెక్నాలజీ ఎంతమాత్రం ఆపలేదు. కాని ఒక సైన్స్ మాత్రం చాలా మేర ఇన్షా అల్లాహ్ నిరోధించ గలదు. అదే మోరల్ సైన్స్.

కాబట్టి ఈ సైన్స్ అండ్ టెక్నాలజీతో పాటు అనుబంధంగా మోరల్ సైన్స్ ఎల్లప్పుడూ ఉండాలి. మోరల్ సైన్స్‌కి తొలి ప్రాధాన్యత నిచ్చి, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో అంకిత భావంతో పనిచేసే శాస్త్రవేత్తలకు సముచిత స్థానాన్ని కల్పించాలి. **ఇవి జరిగిననాడు మన దేశం అభివృద్ధి చెందిన దేశాలలో ఒకటి అవుతుంది**, ఇన్షా అల్లాహ్! పాఠశాలలు, కాలేజీలు మరియు యూనివర్శిటీలలో విద్య నభ్యసించి విద్యావంతులైన తరువాత, జ్ఞానాన్వేషణ మొదలవుతుంది. 1000 సంవత్సరాల క్రితం ఈ విధంగా జ్ఞానాన్వేషణ చేసిన ఇమామ్‌లే ఆనాటి ప్రజలకు సెలబ్రిటీలు. **వారికి ఉన్నత స్థానాన్ని ఇచ్చేవారు.** ఉదాహరణకు ఒకసారి బుఖారీ(ర)వారు నైసాపూర్‌కి ఆహ్వానించబడినప్పుడు, ప్రజలు కిలోమీటర్ల దూరం బారులుతీరి నిలుచున్నారు ఆయనను ఆహ్వానించడానికి. అది ఆనాడు జ్ఞానులకు (పరిశోధకులకు) లభించిన గుర్తింపు.

జ్ఞానాన్ని పొందమని మన ప్రవక్త ముహమ్మద్(స)వారు ప్రజలను ఎంతగానో ప్రోత్సహించేవారు. జ్ఞానాన్ని ముస్లిమ్ పోగొట్టుకున్న సొత్తు అని, అది ఎక్కడ దొరికినా దానిని తీసుకుంటాడని చెప్పారు. ఆల్-జీబ్రా పితామహుడు అల్-ఖ్వారిజ్మీ ఖుర్‌ఆన్ మరియు హదీస్ జ్ఞానంలో ప్రావీణ్యం గలవారే. ఆప్టిక్స్ పితామహుడు, ఇంజినీర్ మరియు మెడికల్ డాక్టర్ అయిన ఇబ్నె అల్-హైతమ్ కూడా ఖుర్‌ఆన్ మరియు హదీస్ విజ్ఞానంలో ప్రావీణ్యం గలవారే. **ప్రజలు మాత్రమే కాదు పాలకులు కూడా జ్ఞానానికి అత్యున్నత స్థానాన్ని కేటాయించారు.** ఫలితంగా 7వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం వరకూ గల కాలం **ముస్లిముల స్వర్ణయుగం అయింది.** పరిశోధనతో కూడిన ఆధునిక సైన్స్ ఆవిర్భవించింది. ***- శాంతిబాట టీమ్***



# అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

32

## ఖుర్'ఆన్ తఫ్సీర్

البقرة

2. సూరహ్ అల్-బఖరా

( గత సంచిక తరువాయి )

(67వ ఆయత్ నుండి 77వ ఆయత్ వరకు ...)

**హత్య గావించబడిన ఓ ఇస్రాయీలీ మరియు ఒక ఆవు వృత్తాంతం:**

తఫ్సీర్ ఇబ్నె కసీర్‌లో ఇచ్చిన వివరణను ఇక్కడ అందిస్తున్నాము.

ఉబైదహ్ అస్-సల్మానీ చెప్పగా ఇబ్నె అబీహాతిమ్ తెలియజేశారు.

ఇస్రాయీల్ సంతానంలో ఒక వ్యక్తి ఉండేవాడు. అతనిలో పురుషత్వం లేదు (కాబట్టి అతనికి వారసులు లేరు). అతని దగ్గర చాలా సంపద ఉంది. మరియు ఒక మేనల్లుడు ఉన్నాడు. అతనికి వారసత్వం లభిస్తుంది. కాబట్టి అతని మేనల్లుడు అతనిని హత్య చేసాడు మరియు అతని శరీరాన్ని (శవాన్ని) రాత్రివేళ తీసుకు వెళ్ళి, ఒక వ్యక్తి గుమ్మం దగ్గర ఉంచాడు. (అంటే ప్రజలు ఆ ఇంటిలోని వ్యక్తే చంపేసాడని ప్రజలు అనుకోవాలని.)

తరువాయి రోజు ఉదయం, ఆ మేనల్లుడు ప్రతీకారం కోసం అరిచాడు. మరియు ప్రజలు తమ ఆయుధాలను తీసుకున్నారు మరియు దాదాపుగా పరస్పరం పోట్లాడుకోబోయారు. వారిలోని వివేకం గలవారు అన్నారు : "మీరెందుకు పరస్పరం చంపుకుంటారు, ఇంకనూ మీ మధ్యలో అల్లాహ్ యొక్క సందేశహరుడు ఉండగనే?"

కాబట్టి వారు మూసా(అ)వారి వద్దకు వెళ్ళి ఆయన దగ్గర ఈ విషయాన్ని ప్రస్తావించారు. మరియు మూసా(అ)వారు అన్నారు :

> **మరియు మూసా తన జాతివారితో** (ఇలా) **అన్నప్పుడు : నిశ్చయంగా అల్లాహ్ మిమ్మల్ని ఆదేశిస్తున్నాడు - "ఒక ఆవును జిబహ్ చేయండి అని".** (వారు) **అన్నారు : "నీవు మాతో పరిహాసం చేస్తున్నావా?"** (మూసా) **అన్నాడు : "నేను అల్లాహ్ శరణు వేడుకుంటున్నాను అజ్ఞానులలో నేను (ఒకడిని) అయిపోకుండా."** (ఖుర్'ఆన్ 2:67)

వారు వాదులాడకుండా ఉండి ఉంటే, ఏదో ఒక ఆవును జిబహ్ చేసేస్తే వారికి సరిపోయి ఉండేది. అయితే వారు వాదులాడారు మరియు వ్యవహారం వారికి చాలా కష్టతరంగా తయారైంది ఒక ప్రత్యేకమైన ఆవును వెతకడం పూర్తయ్యేవరకూ.

తరువాత దానిని జిబహ్ చేయమని వారు ఆదేశించబడ్డారు. అటువంటి ఆవు ఓ వ్యక్తి దగ్గర ఉందని తెలుసుకున్నారు. అతడే ఆ ఆవు యజమాని. అతడు చెప్పాడు, **"అల్లాహ్ సాక్షి! నేను దీనిని దీని చర్మం నిండుగా పట్టేటంత బంగారానికి మాత్రమే అమ్ముతాను."**

కాబట్టి వారు ఆవు చర్మం పట్టేటంత బంగారాన్ని చెల్లించి దానిని కొన్నారు. దానిని జిబహ్ చేశారు మరియు దానిలోని (ఆవు లోని) ఒక భాగంతో మరణించిన వ్యక్తిని కొట్టారు. అతడు లేచాడు మరియు వారు అతనిని అడిగారు, **"నిన్ను ఎవరు చంపారు?"** అతడు చెప్పాడు, **"అతడే"** మరియు తన మేనల్లుడి వంక చూపాడు. అతడు మరలా చనిపోయాడు మరియు అతని మేనల్లుడికి వారసత్వపు అనుమతి నివ్వలేదు.

దాని తరువాత, ఎవరైనా ఒకరి వారసత్వం పొందడానికి హత్యకు పాల్పడినప్పుడు అతడు వారసత్వం పొందడానికి అనుమతించబడడు. ఆవును జిబహ్ చేయమని చెప్పినప్పుడు ఏదో ఒక ఆవును జిబహ్ చేయకుండా మూర్ఖపు పట్టుదలతో ఏ విధంగా అనవసరమైన ప్రశ్నలు అడిగారో క్రింది ఖుర్'ఆన్ ఆయత్‌లలో చూడండి.

> **(వారు) అన్నారు : "మా కొరకు నీ ప్రభువును ప్రార్థించు. అది ఏమిటో మాకు స్పష్టం చేయుమని." (మూసా) అన్నాడు: "నిశ్చయంగా ఆయన చెబుతున్నారు నిస్సందేహంగా అది ఒక ఆవు, ముసలిది కాదు, చిన్నదానికి మధ్యవయస్సు గల దానికి మధ్యలో అది (ఉంటుంది)." కాబట్టి మీరు ఏదైతే ఆదేశించ బడ్డారో (అది) చేయండి.**

(వారు) చెప్పారు : "మా కొరకు నీ ప్రభువును ప్రార్థించు. దాని రంగు ఏమిటో మాకు స్పష్టం చేయమని." (మూసా) చెప్పాడు: "నిశ్చయంగా ఆయన చెబుతున్నాడు, అది నిస్సందేహంగా ఓ ఆవు, మెరిసే పసుపురంగు కలది. దాని రంగు మనోహరంగా ఉంటుంది చూసేవారికి."
(వారు) అన్నారు : మా కొరకు నీ ప్రభువును ప్రార్థించు. స్పష్టం చేయమని. వాస్తవానికి ఆ ఆవులు మాకు ఒకే విధంగా ఉన్నాయి (సందేహం కలుగుతుంది). మరియు నిశ్చయంగా అల్లాహ్ కోరితే మేము మార్గదర్శకత్వం పొందుతాము"
(మూసా) చెప్పాడు : "నిశ్చయంగా ఆయన అంటున్నాడు : అది నిస్సందేహంగా ఓ ఆవు భూమి దున్నడానికి మరియు పొలానికి నీరు పెట్టడానికి (శిక్షణ పొందినది కాదు). సరియైనది. లోపం ఉండదు దానిలో." (వారు) అన్నారు : "ఇప్పుడు నీవు వచ్చావు సత్యంతో" కాబట్టి వారు దానిని జిబహ్ చేశారు మరియు వారు దాదాపు(దానిని) చేసి ఉండేవారు కాదు." (ఖుర్ఆన్ 2:68-71)

**ఆవుకు సంబంధించి యూదుల మూర్ఖపు పట్టుదల కారణంగా అల్లాహ్ వారి కొరకు వ్యవహారాన్ని కష్టతరం చేశారు.**

అల్లాహ్ ఇస్రాయీల్ సంతానం యొక్క మూర్ఖపు పట్టుదలను మరియు వారు తమ ప్రవక్తలను అడిగిన ఎన్నో అనవసర ప్రశ్నలను ప్రస్తావించారు. వారి మూర్ఖపు పట్టుదల కారణంగానే, అల్లాహ్ నిర్ణయాలను వారి కొరకు కష్టతరం చేసారు.

ఇబ్నె అబ్బాస్(రజి)వారు మరియు ఉబైదా గారు చెప్పినట్లుగా, వారు ఒక ఆవును జిబహ్ చేసి ఉండి ఉంటే, అది ఏ ఆవు అయినా, అది వారి కొరకు సరిపోయి ఉండేది.

**"వారు దాదాపు (జిబహ్) చేసి ఉండేవారు కాదు."** అనే విషయంలో అద్-దహ్హాక్ మరియు ఇబ్నె అబ్బాస్(రజి)వారు ఇలా చెప్పారు : "దానిని జిబహ్ చేయడాన్ని వారు కోరలేదు.'' వారు మొండివైఖరే అవలంబించాలని అనుకున్నారు. జిబహ్ చేయడం వారికి ఇష్టం లేదు. వారు చాలా సొమ్ము వెచ్చించి దానిని కొనవలసి వచ్చింది.

## 72వ ఆయత్ నుండి 77వ ఆయత్ వరకూ

72.మరియు మీరు ఒక వ్యక్తిని చంపి ఆ నిందను ఒకరిపై నొకరు మోపుకోసాగారు. కాని మీరు దాస్తున్న దానిని అల్లాహ్ బయట పెట్టాడు

| فِيْهَا | فَادّٰرَءْتُمْ | نَفْسًا | قَتَلْتُمْ | وَاِذْ |
|---|---|---|---|---|
| దానికి సంబంధించి | కాని మీరు వాదులాడారు | ఒక వ్యక్తి | మీరు చంపారు | మరియు అప్పుడు |

| ۚ (٧٢) | تَكْتُمُوْنَ | كُنْتُمْ | مَّا | مُخْرِجٌ | وَاللّٰهُ |
|---|---|---|---|---|---|
| (72) | దాచేవారు | మీరున్నారు | ఏమిటి | బయట పెట్టినవాడు | కాని అల్లాహ్ |

73.కనుక మేము : "దానిని, ఆ ఆవు యొక్క ఒక భాగంతో కొట్టండి. అని ఆజ్ఞాపించాము. ఈ విధంగా అల్లాహ్ మృతులను బ్రతికించి, తన సూచనలను మీకు చూపుతున్నాడు, బహుశా మీరు అర్థం చేసుకుంటారేమోనని!

| الْمَوْتٰى ۙ | يُحْيِ اللّٰهُ | كَذٰلِكَ | بِبَعْضِهَا ۭ | اضْرِبُوْهُ | فَقُلْنَا |
|---|---|---|---|---|---|
| ఆ మరణించిన వాడు | అల్లాహ్ లేపుతాడు | ఇటువంటి | దాని ఒక భాగంతో | అతనిని కొట్టండి | కాబట్టి మేము చెప్పాము |

| (٧٣) | تَعْقِلُوْنَ | لَعَلَّكُمْ | اٰيٰتِهٖ | وَيُرِيْكُمْ |
|---|---|---|---|---|
| (73) | వివేకాన్ని ఉపయోగిస్తారు | బహుశా మీరు (కావచ్చు) | ఆయన సూచనలు | మరియు మీకు చూపుతాడు |

74.కాని దీని తరువాత కూడా మీ హృదయాలు కఠినమై పోయాయి. అవి రాళ్ళ మాదిరిగా కాదు. వాటికంటే కూడా కఠినంగా అయిపోయాయి. ఎందుకంటే వాస్తవానికి రాళ్ళలో కొన్ని బ్రద్దలైనప్పుడు వాటి నుండి సెలయేళ్ళు ప్రవహిస్తాయి.

| اَوْ | كَالْحِجَارَةِ | فَهِيَ | ذٰلِكَ | مِّنْۢ بَعْدِ | قُلُوْبُكُمْ | ثُمَّ قَسَتْ |
|---|---|---|---|---|---|---|
| లేక | రాళ్ళ వలే అయిపోయాయి | కాబట్టి వీరు | అది | తరువాత | మీ హృదయాలు | తరువాత కఠినం చేశాడు |

మరియు నిశ్చయంగా, వాటిలో కొన్ని చీలిపోయి వాటి నుండి నీళ్ళు బయటకి వస్తాయి. మరియు వాస్తవానికి వాటిలో మరికొన్ని అల్లాహ్ భయం వల్ల పడిపోతాయి. మరియు అల్లాహ్ మీ కర్మల పట్ల నిర్లక్ష్యంగా లేడు.

75. వారు మీ సందేశాన్ని విశ్వసిస్తారని ఆశిస్తున్నారా ఏమిటి? మరియు వాస్తవానికి వారిలో ఒక వర్గం వారు అల్లాహ్ ప్రవచనం విని, అర్థం చేసుకుని కూడా, బుద్ధి పూర్వకంగా దానిని తారుమారు చేసేవారు కదా!

76. మరియు వారు విశ్వాసులను కలిసినప్పుడు, “మేము విశ్వసించాము” అని అంటారు. కాని వారు ఏకాంతంలో ఒకరినొకరు కలుసుకున్నప్పుడు : “ఏమీ? అల్లాహ్ మీకు తెలిపింది వారికి తెలువుతారా? దానితో వారు (ముస్లిములు) మీ ప్రభువు ముందు మీతో వాదులాడ టానికి?

اَشَدُّ قَسْوَةً ۚ وَاِنَّ مِنَ الْحِجَارَةِ لَمَا

| | | | | | |
|---|---|---|---|---|---|
| నిశ్చయంగా అవి (వాటిలో కొన్ని) | రాళ్ళు | నుండి | మరియు నిశ్చయంగా | కఠినత్వం (లో) | బలమైనది |

يَتَفَجَّرُ مِنْهُ الْاَنْهٰرُ ۚ وَاِنَّ مِنْهَا لَمَا

| | | | | | |
|---|---|---|---|---|---|
| నిశ్చయంగా అవి (వాటిలో కొన్ని) | వాటి నుండి | మరియు నిశ్చయంగా | (ఆ) నదులు | దాని నుండి | వరదలా ప్రవహిస్తాయి |

يَشَّقَّقُ فَيَخْرُجُ مِنْهُ الْمَآءُ ۚ وَاِنَّ مِنْهَا

| | | | | | |
|---|---|---|---|---|---|
| వాటి నుండి | మరియు నిశ్చయంగా | నీరు | దాని నుండి | కాబట్టి బయటకి వస్తాయి | చీలి పోతాయి |

لَمَا يَهْبِطُ مِنْ خَشْيَةِ اللّٰهِ ۗ وَمَا اللّٰهُ

| | | | | |
|---|---|---|---|---|
| మరియు అల్లాహ్ ఉండరు | అల్లాహ్ పట్ల భయంతో | నుండి | క్రింద పడతాయి | నిశ్చయంగా అవి (వాటిలో కొన్ని) |

بِغَافِلٍ عَمَّا تَعْمَلُوْنَ ﴿٧٤﴾ اَفَتَطْمَعُوْنَ اَنْ يُّؤْمِنُوْا

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| వారు విశ్వసిస్తారు | అది | మీరు ఆశిస్తున్నారా | 74 | మీరు చేస్తారు | ఏమి | తెలియని వాడుగా |

لَكُمْ وَقَدْ كَانَ فَرِيْقٌ مِّنْهُمْ يَسْمَعُوْنَ

| | | | | |
|---|---|---|---|---|
| వింటున్నారు | వారిలో | ఒక వర్గం | మరి నిశ్చయంగా ఉంటారు | మీ కొరకు |

كَلٰمَ اللّٰهِ ثُمَّ يُحَرِّفُوْنَهٗ مِنْ بَعْدِ مَا عَقَلُوْهُ

| | | | | | |
|---|---|---|---|---|---|
| వారు దానిని అర్థం చేసుకున్నారు | ఏమిటి | తరువాత | వారు దానిని వక్రీకరిస్తారు | తరువాత | అల్లాహ్ వచనాలు |

وَهُمْ يَعْلَمُوْنَ ﴿٧٥﴾ وَاِذَا لَقُوا الَّذِيْنَ اٰمَنُوْا

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| విశ్వసించారు | ఎవరైతే | వారు కలుస్తారు | మరియు అప్పుడు | 75 | తెలుసు కుంటారు | వారు ఉండగా |

قَالُوْٓا اٰمَنَّا ۚ وَاِذَا خَلَا بَعْضُهُمْ

| | | | | |
|---|---|---|---|---|
| వారిలో కొందరు | ఏకాంతం | మరియు అప్పుడు | మేము విశ్వసించాము | వారు చెప్పారు |

| | | | | | |
|---|---|---|---|---|---|
| عَلَيْكُمْ | فَتَحَ اللّٰهُ | بِمَا | اَتُحَدِّثُوْنَهُمْ | قَالُوْٓا | اِلٰى بَعْضٍ |
| మీపై | అల్లాహ్ అవతరింప జేశాడు | ఏమిటి | మీరు వారికి చెబుతారు | వారు చెప్పారు | (మరి) కొందరితో |

| | | | | |
|---|---|---|---|---|
| اَفَلَا | رَبِّكُمْ | عِنْدَ | بِهٖ | لِيُحَآجُّوْكُمْ |
| మీరు కారా | మీ ప్రభువు | ముందు | దానితో | మీతో వారు వాదించే విధంగా |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| مَا | يَعْلَمُ | اللّٰهَ | اَنَّ | يَعْلَمُوْنَ | اَوَلَا | ٧٦ | تَعْقِلُوْنَ |
| ఏమిటి | తెలుస్తుంది | అల్లాహ్ | అది | వారు తెలుసు కుంటారు | లేదు | 76 | అర్థం చేసుకుంటారు |

| | | | |
|---|---|---|---|
| ٧٧ | يُعْلِنُوْنَ | وَمَا | يُسِرُّوْنَ |
| 77 | వారు ప్రకటిస్తారు | మరియు ఏది | వారు దాస్తున్నారు |

77. ఏమీ? వారికి తెలియదా? వారు (యూదులు) దాచేది మరియు వెలిబుచ్చేది, అంతా అల్లాహ్‌కు బాగా తెలుసని?

## సూరహ్ అల్-బఖరా (72 నుండి 77 ఆయత్‌లలో వచ్చిన అరబీ) పదాల అర్థాలు

| | |
|---|---|
| 544. మీరు చంపారు | قَتَلْتُمْ (ق ت ل) |
| 545. మీరు వివాదంలో పడ్డారు | اِدَّارَءْتُمْ (د ر ء) |
| 546. బయట పెట్టినవాడు | مُخْرِجٌ |
| 547. మీరు దాస్తారు | تَكْتُمُوْنَ |
| 548. దానిలోని కొంతభాగంతో | بِبَعْضِهَا |
| 549. కాబట్టి ఈ మార్గంలో | كَذٰلِكَ |
| 550. ప్రాణం తెస్తాడు | يُحْيِ |
| 551. చనిపోయారు | مَوْتٰى |
| 552. మీకు చూపుతాడు | يُرِيْكُمْ (ر ء ي) |
| 553. సూచనలు | اٰيَاتْ |
| 554. మీరు అర్థం చేసుకుంటారు | تَعْقِلُوْنَ |
| 555. తరువాత | ثُمَّ |
| 556. గట్టిగా అయ్యాయి | قَسَتْ |
| 557. హృదయాలు | قُلُوْبْ |
| 558. కాబట్టి | فَ |
| 559. ఆమె (హృదయాలను సూచిస్తూ వాడబడిన పదం) | هِيَ |
| 560. వలే | كَ |
| 561. రాళ్ళు | حِجَارَةٌ |
| 562. లేక | أَوْ |
| 563. చాలా తీవ్రం, చెడ్డ | أَشَدُّ |
| 564. గట్టిది | قَسْوَةٌ (ق س و) |
| 565. వాస్తవానికి | لَمَا |
| 566. బయటకి వరదలా ప్రవహిస్తుంది | يَتَفَجَّرُ |
| 567. నదులు | أَنْهَار |
| 568. చీలిపోతుంది | يَشَّقَّقُ (ش ق ق) |
| 569. క్రింద పడుతుంది | يَهْبِطُ (ه ب ط) |
| 570. అల్లాహ్ యందు భయం | خَشْيَةُ اللّٰهِ |
| 571. అయినా మీరు ఆశిస్తున్నారు | أَ فَتَطْمَعُوْنَ (ط م ع) |

22

# తిరిగి గూటికి

ఇస్లామ్ అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం వంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా మానవులు ఆచరించ వలసిన ధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో అల్లాహ్ ధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా 'ఇస్లామ్'లోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒకేసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా వారికి కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవన విధానంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి వారిలో కొందరికి మరికొంత సమయం పట్టవచ్చు. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకమైన అవస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్'ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది, ఇన్షా అల్లాహ్.

### నవ ముస్లిమ్? | New Muslim?

*అబూబక్ర్ సిద్దీఖ్(రజి), ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి), ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి), అలీ బిన్ అబీ తాలిబ్(రజి) మొదలైన విశ్వాసులంతా ఇస్లామ్ స్వీకరించిన వారే! వీరిని నవముస్లిములుగా ఎవరూ పరిచయం చేయలేదు. నమాజ్ చేయడం నేర్చుకునే వరకో లేక మస్జిద్ అలవాటు అయ్యే కొన్ని రోజుల వరకో తోటి ముస్లిములకు తెలియడానికై 'నవముస్లిమ్' అనే పదాన్ని వారి కొరకు ఉపయోగించవచ్చు. కాని వారికి ఇస్లామ్ ధర్మంపై పూర్తి అవగాహన ఏర్పడి ఇస్లామ్ ప్రకారం వారి ఆచరణ ఉన్నప్పుడు, ఎన్ని సంవత్సరాలైనా సరే వారిని 'నవ ముస్లిములు'గా పరిగణించడం సరికాదు.*

### ఏ భాష అయినా ఒక్కటే! | అంతా సమానమే!

ఖుర్'ఆన్ అరబీ భాషలో అవతరించింది. అరబీ భాష ముస్లిములకు అతి ముఖ్యమైన మరియు నేర్చుకోవలసిన భాష. 'ఉర్దూ' భాష భారతీయ భాషలలో ఒక భాష మాత్రమే. 'ఉర్దూ' అంటే మార్కెట్ అని అర్థం. ఇది అరబ్బులు మరియు భారతీయుల మధ్య వ్యాపార లావాదేవీల కొరకు తయారైన భాష. అరబీ భాష కాకుండా, ఇతర ఏ భాష అయినా ముస్లిములకు ఒక్కటే! ఇస్లామ్‌లో రంగు, తెగ, లేమి, కలిమి, భాష, ప్రాంతం మొ॥న వాటిని బట్టి ఎటువంటి ప్రాముఖ్యతా లేదు. అందరూ సమానమే! కేవలం ధర్మ పరాయణత మాత్రమే ముస్లిముల స్థాయిని నిర్దేశించే కొలమానం. తెలుగు మాట్లాడేవారి కొరకు ఒక మస్జిద్, వేరే భాష మాట్లాడేవారికి మరొక మస్జిద్ ఏర్పాటు చేయాలని చేసే ఏ ప్రయత్నమైనా సున్నత్‌కి వ్యతిరేకమైనదే! అందరినీ కలిపి ఉంచే ధర్మమే ఇస్లామ్ (శాంతి).

*శాంతిబాట మొదటి సంవత్సరంలో విదేశాలలో ఇస్లామ్ స్వీకరించిన ఏడుగురు సోదరీమణుల గురించి తెలియజేయడం జరిగింది. ద్వితీయ సంవత్సరం తొలి సంచికయైన ఆగష్టు'10 సంచికలో నవముస్లిములు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఓ సోదరుడు ఆవేదన వ్యక్తం చేస్తూ వ్రాసిన లేఖను అందించాము.* ***ఆ సమస్యలకు ఖుర్‌ఆన్ మరియు సున్నత్ విధానంలో పరిష్కార మార్గాన్ని ఇన్షా అల్లాహ్ తరువాయి సంచికలలో అందిస్తామని చెప్పడం జరిగింది.*** తరువాయి సంచికలలో కొన్నింటికి ఖుర్‌ఆన్ మరియు సున్నత్ వెలుగులో పరిష్కారం అందించాము. వాస్తవ సంఘటనల ద్వారా సమస్యల పరిష్కారాన్ని తెలియజేసే ఉద్దేశ్యంతో ముహమ్మద్(స)వారి అనుచరులైన **బిలాల్**(రజి), **అబూజర్**(రజి), **సల్మాన్ ఫార్సీ** (రజి), **అబూ ఉబైదా**(రజి), **సాద్ బిన్ అబీ వఖ్ఖాస్**(రజి), **అమ్ర్ బిన్ ఆస్**(రజి) మరియు **సుమయ్యా**(రజి), **ఖదీజా**(రజి), **ఉమ్మె అయ్‌మన్**(రజి), **ఉమ్మె సులైమ్**(రజి), **ఉమ్మె అమ్మారహ్**(రజి), **అస్మా** (రజి), **ఫాతిమా బిన్త్ అసద్**(రజి)వారి జీవితచరిత్రలను క్లుప్తంగా అందించడం జరిగింది. ఇవన్నీ చదివితే ఎవరికైనా తమ సమస్యలు, పైన వివరించిన విశ్వాస పురుషులు మరియు విశ్వాస స్త్రీ సమస్యల కంటే చాలా చిన్నవిగా కనిపిస్తాయి. సులువుగా తమ సమస్యలను పరిష్కరించుకో గలమనే మనో ధైర్యం వారిలో ఏర్పడుతుంది. ఇన్షా అల్లాహ్, ముఖ్య సహాబీల జీవితచరిత్రలను క్లుప్తంగా ఈ శీర్షికలో అందిస్తాము.

# ఖబ్బాబ్ బిన్ అరత్త్ (రజి)

**• ఇస్లామ్ స్వీకరించిన తొలి పదిమందిలో ఒకరు • త్యాగానికి ఒక ఉదాహరణ • ఖడ్గాల తయారీలో ప్రావీణ్యులు • పేదలు మరియు అవసరంలో ఉన్నవారు ఏ సమయంలోనైనా తన అనుమతి లేకుండానే తీసుకునే విధంగా ఐశ్వర్యాన్ని వారి కోసం ఒక చోట ఉంచేవారు.**

*ఈ విశిష్ఠ దాసుని స్థిరమైన విశ్వాసం విషయంలో ఖుర్‌ఆన్ ఆయత్‌లు అవతరించబడ్డాయి.*

**అల్లాహ్ పైన స్థిరమైన విశ్వాసంతో ఘోరమైన శారీరక హింసలను సైతం సహించారు.**
**ఇస్లామ్‌లో గౌరవనీయమైన స్థానాన్ని పొందారు. ఎల్లప్పుడూ పరలోక ప్రతిఫలం గురించే పరితపించేవారు.**
**ముహమ్మద్(స)వారి ఆదేశాల పట్ల హితబోధ పట్ల అత్యంత విధేయత చూపారు."**

ఖబ్బాబ్(రజి)వారు నజ్ద్ తెగకు చెందిన అరబ్. ఈయన బనీ తమీమ్ వంశంలో జన్మించారు. ఒకరోజు వారిపై ఓ అరబ్ తెగ దాడిచేసింది. వారి పశువులు, స్త్రీలు మరియు పిల్లలు వశపరచు కోబడ్డారు. వారిలోని **ఒక బాలుడు - ఖబ్బాబ్(రజి).** ఈయన బానిసగా ఒకరి నుండి మరొకరికి చేతులు మారుతూ, చివరకు మక్కాలో బానిసగా అమ్మబడ్డారు. యుక్త వయస్సుకు చేరువలో ఉన్న ఆయనను ఉమ్మె అమ్మార్ ఖరీదు చేసి, కత్తులను తయారు చేసే కంసాలి దగ్గర ఆయనను పనిలో పెట్టింది.

అనతికాలంలోనే ఖబ్బాబ్(రజి)వారు మంచి ఖడ్గాలను తయారు చేయగల నైపుణ్యాన్ని సాధించారు. ఉమ్మె అమ్మార్ తన బానిస యువకునికి ఒక కమ్మరిశాల (వర్క్ షాప్) ఏర్పాటు చేసింది. అవసరమైన పనిముట్లను సమకూర్చింది. ఆమె ఇదంతా దయతో చేయలేదు. ఆయన సంపాదించినది ఆమెకే వెళుతుంది. ఖబ్బాబ్(రజి) వారు కపటం లేకుండా నిజాయితీగా వ్యవహరించేవారు.

ముహమ్మద్(స)వారి పిలుపు ఈయన చెవిన కూడా పడింది. అప్పటికి ఇస్లామ్ స్వీకరించినవారు 5 గురు. ఆ విధంగా ఈయన ఇస్లామ్ స్వీకరించిన 6వ ముస్లిమ్. అందుకనే ఈయనను 'సాదిసుల్ -ఇస్లామ్' అని పిలిచేవారు. కాబట్టి ఈయన సాబిఖూనల్ అవ్వలూన్‌లో (ఇస్లామ్ స్వీకరించిన తొలి ముస్లిములలో ఒకరు) అయ్యారు.

ఇప్పటికే పలుమార్లు ఇదే శీర్షికలో మక్కా వాసులు పెట్టిన హింసలకు లోనై, కష్టాలుపడిన ఎంతోమంది సహాబాల గురించి చదివారు. మక్కాలో ఖబ్బాబ్ (రజి)వారికి మద్దతు ఇచ్చే తెగగాని లేదా ఇతర బంధువులుగాని లేరు. అయినప్పటికీ ఆయన భయపడలేదు. అంటే ఎవరైనా ఈయనపై దాడిచేసి, హాని చేస్తే మద్దతు నివ్వడానికి ఈయనకు మక్కాలో ఎవరూ లేరు.

## అల్లాహ్‌కు తప్ప ఇతరులకు ఆయన ఎన్నడూ భయపడలేదు

ఇస్లామ్ స్వీకరించిన విషయాన్ని ఆయన రహస్యంగా ఉంచలేదు. ముస్లిమ్ అయ్యారని తెలియగానే ఆయనపై దాడులు చేసారు. వారి చేతులలో మానవచరిత్రలో చాలా అరుదుగా కనిపించే హింసకు ఆయన లోనయ్యారు. ఖబ్బాబ్(రజి)వారి చొక్కా విప్పదీసి ఎర్రటి

నిప్పులపై పడుకోబెట్టి, ఆయన ఛాతీపై బరువైన బండరాయిని ఉంచేవారు లేక కొన్ని సార్లు ఓ ధృడకాయుడు ఆయన ఛాతీపై కూర్చునేవాడు, నిప్పుల నుండి రక్షించు కునేలా ఆయన ఎటువైపూ కదలకుండా ఉండేందుకు.

నిస్సహాయంగా ఆయన అలాగే ఉండిపోయి అల్లాహ్‌ను స్మరించే వారు. ఆయన చూపిన ధైర్యం, సహనం ఇతర విశ్వాసులపై కూడా ప్రభావాన్ని చూపింది. చాలా కాలం పాటు ఎన్నో విధాలుగా ఆయనను హింసించారు.

అతని యజమానురాలు కూడా క్రూరత్వంలో ఎవరికీ తీసిపోలేదు. ఒకసారి ఖబ్బాబ్(రజి)వారు తన వర్క్ షాప్ వద్ద ముహమ్మద్(స) వారితో మాట్లాడటాన్ని ఆమె చూసింది. ఇక అప్పటి నుండి ఆయన నెత్తిపై కొలిమి నుండి ఎర్రగా కాలిన ఇనుప చువ్వను తీసి వాతలు పెట్టడం మొదలెట్టింది. ఆ హింసలను భరించలేక స్పృహ తప్పి పడిపోయేవారు. ఖబ్బాబ్(రజి)వారికి ఇనుప కవచం తొడిగించి మిట్ట మధ్యాహ్నం ఎడారి ఇసుకలో పరుండ బెట్టించేది.

బాధితులు ఎవరితో తమ బాధలను మొరపెట్టుకుంటారు? సకల లోకాలకు కారుణ్యంగా పంపబడిన ముహమ్మద్(స) వారితో!

ఒకరోజు ఖబ్బాబ్(రజి)వారు ముహమ్మద్(స)వారి దగ్గరకు వెళ్ళారు. ఆ సమయానికి ఆయన కాబా వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ముందుగా ఇక్కడ ఓ ఆయత్ గురించి చెప్పుకోవాలి.

**"ఏమీ? మీరు స్వర్గంలో ప్రవేశించగలమని భావిస్తున్నారా? మీ పూర్వీకులు సహించి నటువంటివి మీరూ సహించనిదే! వారిపై దురవస్థలు, రోగ బాధలు విరుచుకు పడ్డాయి మరియు వారు కుదిపేయబడ్డారు. చివరకు అప్పటి సందేశహరుడు మరియు విశ్వాసులైన అతని సహచరులు : "అల్లాహ్ సహాయం ఇంకా ఎప్పుడొస్తుంది?" అని వాపోయారు. అదిగో! నిశ్చయంగా, అల్లాహ్ సహాయం సమీపంలోనే ఉంది!** (ఖుర్ఆన్ 2:214)

పై ఆయత్‌కు సంబంధించి ఇబ్నె కసీర్‌గారి తఫ్సీర్‌లో **ఖబ్బాబ్** (రజి) వారు ఉల్లేఖించిన ఒక ఉల్లేఖనం ఉంది.

"మేము అన్నాము, '**ఓ రసూలల్లాహ్(స)! మాకు సహాయం చేయమని మీరు ఎందుకు అల్లాహ్‌ను అర్థించరూ? మా కొరకు మీరు ఎందుకు అల్లాహ్‌ను ప్రార్థించరూ?**"

ఆయన(స) అన్నారు : "మీకు పూర్వం విశ్వసించిన వారిలో ఒకరి తల మధ్య భాగాన రంపం ఉంచబడేది మరియు అతడు తన పాదాల వరకూ కోయబడేవాడు. మరియు ఇనుప దువ్వెనలతో అతని శరీరం మరియు ఎముకల మధ్య దువ్వబడేవాడు. అయినప్పటికీ, అది అతని ధర్మాన్ని మార్చుకునేలా చేయలేక పోయింది."

ఆయన(స) తరువాత అన్నారు : "అల్లాహ్ సాక్షి! ఈ విషయం (అంటే ధర్మం) అల్లాహ్‌చే వ్యాపించ బడుతుంది, ఒక ప్రయాణీకుడు 'సనా'ను వదిలి హద్రామౌత్‌కు కేవలం అల్లాహ్‌కు మాత్రమే భయపడుతూ చేరేవరకూ (అంటే మరొక భయమేమీ ఉండదు) మరియు ఒక తోడేలు అతని గొఱ్ఱెలను తింటుందేమోనని భయం తప్ప. కాని మీరు తొందరపడే మనుష్యులు (ఆత్రం గలవారు)."

పై విషయం సహీహ్ బుఖారీలో కూడా గ్రంథస్థం చేయబడింది.

ఖబ్బాబ్(రజి)వారి ఉల్లేఖనం. నేను ప్రవక్త(స)వారి వద్దకు వచ్చాను, ఆయన తన దుప్పటిని ఆనుకుని కాబా నీడలో ఉండగా. మేము విగ్రహారాధకుల వలన ఆ రోజులలో చాలా బాధలు పడ్డాము. నేను అన్నాను, "మీరు అల్లాహ్‌ను అర్థించరూ మా కోసం?" ఆయన కూర్చుని ఎర్రటి వదనంతో అన్నారు : మీకు ముందు గతించిన వారు ఇనుప దువ్వెనలతో దువ్వబడేవారు మాంసపు కండ లేక నరాలు ఎముకలపై మిగలకుండా. అయినప్పటికీ అది అతని ధర్మాన్ని ఎన్నడూ వదల నివ్వలేదు. ఒక రంపం అతని తలపై ఉంచబడేది అది దానిని రెండు భాగాలుగా చీల్చడానికి, అయినప్పటికీ అవన్నీ అతనిని ఎన్నడూ తన ధర్మాన్ని వదలనివ్వలేదు. నిశ్చయంగా అల్లాహ్ ఈ ధర్మాన్ని పరిపూర్ణం చేస్తారు, ఏ విధంగా అంటే ఒక ప్రయాణీకుడు సనా నుండి హద్‌రమౌత్‌కు (చేసే ప్రయాణంలో) ఎవరికీ భయపడడు, అల్లాహ్‌కుతప్ప. [ఉల్లేఖకులలో ఒకరు అదనంగా చెప్పారు, "మరియు ఒక తోడేలు అది అతని గొఱ్ఱెలను తింటుందేమోననే (భయం తప్ప)] **(సహీహ్ బుఖారీ, 3852, పుస్తకం 63 - మనాఖిబిల్ అన్‌సార్, అధ్యా. 29, సంపుటి 5)**

**ముహమ్మద్(స)వారు పలికిన మాటలు ఖబ్బాబ్(రజి)వారిలోని విశ్వాసాన్ని మరింత ధృడం చేశాయి.**

ఖబ్బాబ్ పట్ల జరుగుతున్న ఈ ఘోర హింసలను విని ముహమ్మద్(స)వారు బాధపడేవారు. మరియు ఆయనను ఓదార్చేవారు. ప్రవక్త(స) ఆయనని ఓదార్చడం చూస్తే, ఆమె మరింత ఘోరంగా హింసించేది.

ఆ హింసలు హద్దులు దాటిపోవడంతో, ఒకరోజు ఖబ్బాబ్(రజి)వారు ముహమ్మద్(స)వారి వద్దకు వచ్చి బానిసత్వం నుండి స్వేచ్ఛ కొరకు అల్లాహ్‌ను ప్రార్థించమని మనవి చేశారు. ముహమ్మద్(స)వారు అల్లాహ్‌ను ప్రార్థించారు : **"ఓ అల్లాహ్! ఖబ్బాబ్‌కు సహాయం చెయ్యండి."**

చరిత్రకారుల ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, ముహమ్మద్(స)వారి దు'ఆ తరువాత, ఉమ్మె అమ్మార్‌కు చాలా తీవ్రమైన తలనొప్పి వచ్చింది. అది ఎంత ఎక్కువయ్యేది అంటే ఆమె ఆడ కుక్కలా మొరగడం ప్రారంభించేది. అది నయం కావడానికి వైద్యులు ఇచ్చిన ఒకే ఒక సలహా ఏమిటంటే, ఆమె తలపై ఎర్రగా కాలిన ఇనుప

చువ్వతో వాత పెట్టడం. ఆ వాత కూడా చేసేది లేక నిస్సహాయస్థితిలో ఖబ్బాబ్(రజి) వారి చేతి తోనే పెట్టించుకుంది. కాని ఆ చికిత్స ఏ విధంగానూ ఆమెకు మేలు చేయలేదు మరియు చివరికి ఆమె విశ్రాంతికి వీలులేని స్థితిలోనే మరణించింది.

విశ్వాసిని తీవ్రంగా హింసించింది. సత్యతిరస్కారిగానే మరణించింది. పరలోకంలో శిక్ష ఎలాగూ ఉంటుంది. అయితే ఇహలోకంలో ప్రశాంతంగా మరణించ లేదు. ఏ విధంగా తన బానిసను బాధించిందో, అటువంటి బాధను అనుభవిస్తూ మరణించింది. **విశ్వాసులను శారీరకంగా, మానసికంగా హింసించేవారికి కీడే లభిస్తుంది, ఇన్నా అల్లాహ్!**

## ఖుర్'ఆన్ ఆయత్ అవతరణ

ఖబ్బాబ్(రజి)వారిని కేవలం భౌతికంగా హింసించడంతోనే సత్య తిరస్కారులకు తృప్తి కలగలేదు. ఆయనను **ఆర్ధికంగానూ నష్టపరిచారు.** ఈయన దగ్గర పని చేయించుకుని డబ్బు బాకీ ఉన్నవారు, ఆ డబ్బు చెల్లించ లేదు. ఖబ్బాబ్ (రజి)వారు ఉల్లేఖించిన ఒక హదీస్ సహీహ్ బుఖారీలో ఉంది. దానిని దిగువున ఇస్తున్నాము.

నేను ఒక కంసాలిని మరియు 'ఆస్ బిన్ వా'ఇల్ నాకు ఋణపడి ఉన్నాడు, కాబట్టి నేను అతని దగ్గరకి వెళ్ళాను, దానిని ఇవ్వమని అడగటానికి. అతడు నాతో అన్నాడు, **"నేను నీకు చెల్లించను నీవు ముహమ్మద్(స)వారి పట్ల తిరస్కారాన్ని చూపనంతవరకూ."**

నేను అన్నాను, **"నేను ముహమ్మద్(స)వారి పట్ల తిరస్కారం చూపను, నీవు చనిపోయి మరలా లేపబడేవరకూ."** అతడు అన్నాడు, "నేను తిరిగి లేపబడతానా, నేను మరణించిన తరువాత? అలా అయితే నేను నీకు చెల్లిస్తాను, (అక్కడ) నేను ఐశ్వర్యాన్ని మరియు సంతానాన్ని పొందితే." కాబట్టి (ఖుర్'ఆన్ ఆయత్) అవతరించింది :

> ఏమీ? మా సూచనలను తిరస్కరించి, "నిశ్చయంగా, నాకు ధన సంపదలూ మరియు సంతానం ఇవ్వబడుతూనే ఉంటాయి." అని పలికే వానిని నీవు చూశావా? ఏమీ అతడు అగోచరాన్ని చూశాడా? లేదా అనంత కరుణామయుని వాగ్దానం పొందాడా? అలా కాదు! అతడు చెప్పేది, మేము వ్రాసి పెట్టగలము. మరియు అతడి శిక్షను మరింత పెంచగలము మరియు అతడు చెప్పే వస్తువులకు మేమే వారసుల మవుతాము మరియు అతడు ఒంటరిగానే మా వద్దకు వస్తాడు. (ఖుర్'ఆన్ 19:77-80) **(సహీహ్ బుఖారీ, 4735, 65వ పుస్తకం - కితాబుత్తఫ్సీర్, అధ్యా.6, సంపుటి 6)**

అవతరణ ప్రారంభం నుండి ఖబ్బాబ్(రజి) ఖుర్'ఆన్‌ను నేర్చుకున్నారు. కొత్తగా ఇస్లామ్ స్వీకరించినవారికి ఖుర్'ఆన్ నేర్పుతుండే వారు. అప్పటికి ఖుర్'ఆన్ ఆయత్‌లు తక్కువే అవతరించాయి. ఖబ్బాబ్(రజి)వారు ఆ విధంగా **ఖుర్'ఆన్ టీచర్** అయ్యారు. ఈ సందర్భంగా ఉమర్(రజి) ఇస్లామ్ స్వీకరణ ఉదంతం గురించి ఒకసారి గుర్తు చేసుకుందాం!

తీవ్రమైన ఎండలో ఓ రోజు మధ్యాహ్నం వరలేని ఖడ్గంతో ఉమర్ గారు బయలు దేరారు. దారిలో ఉమర్ గారికి ను'ఐమ్ బిన్ అబ్దుల్లాహ్ అన్-నహ్హామ్(రజి)వారు ఎదురయ్యారు. ఉమర్ గారు రసూలుల్లాహ్ (స)కి హాని కలిగించడానికే వెళుతున్నారని ను'ఐమ్(రజి) వారు ముందుగా ఊహించారు. అది నిజమని ఉమర్ గారి ద్వారా తెలుసుకున్నారు. ఇద్దరి మధ్య వాదన జరిగింది. చివరకు ను'ఐమ్ (రజి)వారు ఇలా చెప్పారు : **"నేను నీకు ఇది చెబుతున్నాను. నీ కుటుంబం మరియు నీ బావగారి కుటుంబం ఇస్లామ్ స్వీకరించింది. మరియు తప్పుడు మార్గంలో లక్ష్యం లేకుండా తిరగడానికి నిన్ను వారు వదిలేశారు"**

అతని సోదరి మరియు భర్త ఇస్లామ్ స్వీకరించారని తెలిసిన తరువాత, ఉమర్ గారు ఒక్కసారిగా రెచ్చిపోయారు. ఆయన దృష్టి ప్రవక్త(స)వారి నుండి తప్పింది.

ఉమర్ గారు తిన్నగా తన సోదరి ఇంటివైపు బయలుదేరారు. తలుపు తట్టారు. ఉమర్ గారి సోదరి **ఫాతిమా**(రజి), ఆమె భర్త **స'ఈద్**(రజి) మరియు వారి ఖుర్'ఆన్ టీచర్ **ఖబ్బాబ్**(రజి) - ఈ ముగ్గురూ లోపల ఉన్నారు, ఖుర్'ఆన్ చదవడంలో నిమగ్నమై ఉన్నారు. కాని ఉమర్ గారి కంఠస్వరం కోపంతో ఉండడాన్ని విని, వారు చేస్తున్న పని ఆపేశారు. ఖబ్బాబ్(రజి) దాక్కోవడానికి స్థలాన్ని చూసుకున్నారు. ఆ సమయంలో ఉమర్ గారు లోనికి ప్రవేశించారు.

ఫాతిమా(రజి) ఎలాంటి పరిస్థితికైనా సిద్ధపడిపోయారు. ఆమె వెంటనే సోదరుని ముఖంపై ఉన్న భావాన్ని అర్థం చేసుకున్నారు.

"నేను విన్నాను, మీరు రహస్యంగా మాట్లాడుకోవడం. మీరు ఏం చెబుతున్నారు?" ఉమర్ గారు నిలదీశారు. వారు ఖుర్'ఆన్‌లోని 'తా-హా' సూరహ్ చదువుతున్నారు.

"మేము మామూలుగా సంభాషించుకుంటున్నాము" ఫాతిమా అన్నారు.

"మీరిద్దరూ మీ ధర్మాన్ని వదులుకుని ఉండవచ్చు" అన్నారు ఉమర్.

స'ఈద్(రజి) అన్నారు, **"ఓ ఉమర్! సత్యం నీ ధర్మంలో కాకుండా మరో దానిలో ఉందనుకో".**

ఉమర్ గారు అకస్మాత్తుగా ముందుకు దూకి స'ఈద్ (రజి) గడ్డం పట్టుకు లాగారు. కాస్సేపు ఇద్దరూ పెనుగులాడారు. కాని ఆయన కంటే ఉమర్ గారు బలవంతుడు. ఆయనను క్రిందవేసి గుండెలపై కూర్చున్నారు.

ఫాతిమా(రజి)వచ్చి తన భర్తపైనుండి ఉమర్ గారిని తోయడానికి ప్రయత్నించారు. కాని ఉమర్ గారు ఆమె ముఖంపై కొట్టారు. దాని ఫలితంగా ఆమె ముఖం నుండి రక్తం కారింది. తీవ్ర స్వరంలో ఫాతిమా(రజి) అన్నారు, **"ఓ అల్లాహ్ యొక్క శత్రువా! అల్లాహ్ ఏకత్వాన్ని నేను నమ్మినంత మాత్రానికే నీవు నన్ను కొడతావా?"**

ఆయన సమాధాన మిచ్చారు "ఔను".

ఫాతిమా(రజి) అన్నారు, "అయితే నీవు చేద్దామనుకుంటున్న దేదో అదే చేయి. నేను సాక్ష్యమిస్తున్నాను **'లేడు ఆరాధ్యుడు అల్లాహ్ తప్ప మరియు ముహమ్మద్(స) అల్లాహ్ యొక్క సందేశహరుడు'**. నీ వల్లనే మేము ఇస్లామ్ స్వీకరించాము".

ఉమర్ గారు ఈ మాటలు వినగానే, తాను చేసిన దానికి బాధపడ్డారు. స'ఈద్(రజి) పైనుండి ఉమర్ గారు లేచి ఆయన ప్రక్కనే నేలపై కూర్చున్నారు. తరువాత అన్నారు, **'మీతో ఉన్న ఆ వ్రాత ప్రతిని ఇవ్వండి నేను చదవడానికి".**

*ఈ ఉదంతానికి సంబంధించి పూర్తి వివరాలు ఉమర్(రజి)వారి జీవిత చరిత్రలో ఇంతకు పూర్వమే శాంతిబాటలో వివరించాము.*

ఉమర్ గారు చదివిన మొదటి పదాలు :

**అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో.** ఆ పదాలు **'రహమాన్', 'రహీమ్'** చదవగానే ఉమర్(రజి) భయపడి వ్రాతప్రతిని జారవిడిచారు. మరలా ఆయన మనస్సు దిటవు చేసుకుని, ఆ ప్రతిని మరలా తీసుకుని తా-హా సూరహ్‌లోని క్రింది ఆయత్‌లు చదివారు.

'తా-హా!

మేము ఈ ఖుర్ఆన్‌ను నీపై అవతరింపజేసింది **నిన్ను కష్టానికి గురి చేయటానికి కాదు.**

**కేవలం భయపడేవారికి హితబోధ చేయటానికే!**

ఇది (ఈ ఖుర్ఆన్) భూమినీ మరియు అత్యున్నతమైన ఆకాశాలనూ సృష్టించిన ఆయన (అల్లాహ్) తరఫునుండి క్రమక్రమంగా అవతరింప జేయబడింది.

ఆ కరుణామయుడు, సింహాసనంపై అధిష్టుడై ఉన్నాడు.

ఆకాశాలలోనూ మరియు భూమిలోనూ మరియు ఆ రెండింటి మధ్యనూ ఇంకా నేల క్రిందనూ ఉన్న, సమస్తమూ ఆయనకు చెందినదే!

మరియు నీవు గట్టిగా మాట్లాడితే (ఆయన వినినే వింటాడు), వాస్తవానికి ఆయనకు రహస్యంగా (చెప్పుకునే మాటలేగాక) అతి గోప్యమైన మాటలు కూడా తెలుస్తాయి.

అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు. ఆయనకు అత్యుత్తమమైన పేర్లు ఉన్నాయి. **(ఖుర్ఆన్ 20:1-8)**

(అల్లాహ్ గుణాలను తెలిపే పేర్లు 99 ఉన్నాయి.)

తాను చదివేది ఎంతో దివ్యంగానూ మరియు గొప్పగానూ ఉన్నట్లు ఉమర్ గారు గ్రహించారు. ఈ ఆయత్‌లు చదివాక, ఆయన ఇలా వ్యాఖ్యానించారు, **"వీటి నుండా ఖురైష్‌లు దూరంగా పారిపోతున్నారు?"** ఆయన చదవడం కొనసాగించారు -

**నిశ్చయంగా, నేనే అల్లాహ్‌ను! నేను తప్ప మరొక ఆరాధ్యుడు లేడు! కావున నన్నే ఆరాధించు మరియు నన్ను స్మరించడానికి సలాత్ (నమాజ్)ను స్థాపించు.**

నిశ్చయంగా, తీర్పు ఘడియ రానున్నది - ప్రతివ్యక్తీ తాను చేసిన కర్మల ప్రకారం ప్రతిఫలం పొందటానికి - నేను దానిని గోప్యంగా ఉంచాలని నిర్ణయించాను.

కావున దానిని విశ్వసించకుండా, తన మనోవాంఛలను అనుసరించే వాడు, నిన్ను దాని (ఆ ఘడియ చింత) నుండి మరలింప నివ్వరాదు, అలా అయితే నీవు నాశనానికి గురికాగలవు.

**(ఖుర్ఆన్ 20:14-16)**

ఉమర్ గారు అన్నారు, "**ఎవరైతే దీనిని చెప్పారో, ఆయనకు** (అంటే **అల్లాహ్‌కు) ఏదీ సరిపోదు, ఆయనతో పాటు ఆరాధించడానికి**".

ఉమర్ గారికి అరబీ పాండిత్యంలో మంచి ప్రావీణ్యం ఉంది. నిర్భీతి, నిజాయితీ ఆయన లక్షణాలు గనుక, వాక్యాలలో కనుగొన్న గొప్పతనాన్ని ఆయన నిజాయితీగా పలికారు.

ఉమర్ గారు పలికిన ఈ ఆఖరి పదాలు వినగానే, **ఖబ్బాబ్**(రజి) ఆయన దాక్కున్న ప్రదేశం నుండి బయటకు వచ్చి గట్టిగా అన్నారు, "సంతోషించు, ఓ ఉమర్! వాస్తవానికి సోమవారంనాడు ప్రవక్త(స)వారు చేసిన దువాకు నీతో సమాధానం చెప్పబడిందని అనుకుంటున్నాను".

ముహమ్మద్(స)వారు వేడుకున్నారు : **"ఓ అల్లాహ్, ఇస్లామ్‌కి గౌరవం మరియు బలాన్ని చేకూర్చు, ఈ ఇద్దరిలో మీకు బాగా ఇష్టమైన వారితో, అబూ జహ్ల్ బిన్ హిషామ్ లేదా ఉమర్ బిన్ ఖత్తాబ్"**

ఉమర్ గారు ముహమ్మద్(స)వారిని కలిసి చెప్పారు : **"ఓ రసూలల్లాహ్! అల్లాహ్‌ను మరియు ఆయన సందేశ హరుడిని మరియు ఆయన (అల్లాహ్) నుండి ఆయన సందేశహరుడు దేనితో అయితే పంపబడ్డారో దానినీ విశ్వసించిన మనిషిగా నేను మీ దగ్గరికి వచ్చాను"**

రసూలుల్లాహ్(స) గట్టిగా అన్నారు, "**అల్లాహు అక్బర్**" మరియు అర్ఖమ్ గారి ఇంటిలోని ప్రతీ ఒక్కరికి ఉమర్(రజి)వారు ఇస్లామ్ స్వీకరించినట్లు తెలిసింది.

## మదీనాకు హిజ్రత్ (వలస)

మదీనాకు హిజ్రత్ చేయడం కోసం ఆదేశించబడేవరకూ, ఖబ్బాబ్ (రజి) వారు మక్కాలో ఎన్నో సంవత్సరాలు దౌర్జన్యానికి మరియు అమితమైన బాధకు గురి అయ్యారు. హిజ్రత్ సందర్భంగా ఆయన ఒక విషయం తెలిపారు. **అవిశ్వాసుల పీడనకు మరియు హింసకు భయపడి తాను వలస వెళ్ళడం లేదని, కేవలం అల్లాహ్ ఆదేశం మేరకే మక్కా వదిలానని చెప్పారు.**

మదీనాలో ప్రవక్త(స)వారు ఖబ్బాబ్(రజి)వారికి తమీమ్(రజి)తో ఇస్లామీయ సోదరబంధాన్ని ఏర్పాటు చేశారు.

**ప్రవక్త(స)వారి కాలం నుండి సన్మార్గం పొందిన నలుగురు ఖలీఫాల కాలంలోనూ ఎన్నో యుద్ధాలలో ఖబ్బాబ్(రజి)వారు పాల్గొన్నారు.**

ఖబ్బాబ్(రజి)వారు జ్ఞానార్జన కోసం తరచుగా ముహమ్మద్(స)వారి దగ్గరకు వెళ్ళేవారు. ఒక రాత్రి ఆయన ప్రవక్త(స)వారి వద్దకు వెళ్ళారు, ఆయన సలాత్(నమాజ్)లో ఉన్నారు. ఖబ్బాబ్(రజి)వారు ప్రవక్త(స)వారి సలాత్ పూర్తి అయ్యేవరకూ వేచి ఉన్నారు. కాని ముహమ్మద్(స)వారి సలాత్ పూర్తి అయ్యేసరికి ఫజ్ర్ సమయం కావస్తుంది. అంటే ఖబ్బాబ్ (రజి)వారు ఆ రాత్రంతా వేచి ఉన్నారు. క్రింది హదీస్ చూడండి:

రసూలుల్లాహ్(స)వారితో పాటు బద్ర్ యుద్ధంలో పాల్గొన్న ఖబ్బాబ్ బిన్ అరత్త్ (రజి)వారు (ఇలా) చెప్పారు : అల్లాహ్ యొక్క సందేశహరులు (స) ప్రాత:కాలం వరకూ ప్రార్థన చేసిన ఆ రాత్రి నేను ఆయనను సందర్శించాను. అల్లాహ్ యొక్క సందేశహరుడు(స) తన ప్రార్థనను ముగించినప్పుడు, నేను అడిగాను, “ఓ రసూలల్లాహ్(స)! ఈ రాత్రి మీరు చేసిన ప్రార్థన వంటిది ఇంతకు పూర్వం నేనెన్నడూ మీరు చేయగా చూడలేదు”

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు :

“అవును ఇది **‘ఆకాంక్ష మరియు భయం’** యొక్క ప్రార్థన. ఈ ప్రార్థనలో, నేను నా ప్రభువును మూడింటి కోసం అడిగాను మరియు ఆయన రెండింటిని ఇచ్చారు మరియు తిరస్కరించారు మూడవ దానిని నాకు అనుగ్రహించడానికి.

1. నేను నా ప్రభువును అడిగాను మమ్మల్ని (నా ఉమ్మత్‌ని) నాశనం చేయవద్దని, వేటితో అయితే ఆయన మనకు ముందరి జాతులను నాశనం చేశారో వాటితో. మరియు ఆయన దానిని అనుగ్రహించారు.

2. నేను అడిగాను నా ప్రభువుని మాపై శతృవులు విజయం సాధించ కూడదని మరియు ఆయన దానిని అనుగ్రహించారు.

3. నేను అడిగాను నా ప్రభువును వర్గకలహాల అయోమయం మనల్ని కప్పకుండా. **కాని ఆయన తిరస్కరించారు.**”

(తఫ్సీర్ ఇబ్నె కసీర్, 6:63-65 ఆయత్‌ల తఫ్సీర్. అహమద్ 3:108)

ముస్లిములు వర్గాలుగా చీలిపోయి పరస్పరం హింసించు కోకుండా ఉండేలా అనుగ్రహించమని చేసిన వేడుకోలును అల్లాహ్ ఆమోదించ లేదు. ఈ విషయంపై గత సంచికలో కొంత వివరించబడింది. ఈ సంచికలో ముస్లిముల ఐక్యతకు సంబంధించి అందించిన వ్యాసంలో మరి కొంత వివరించడం జరిగింది.

## ఉమర్(రజి)వారి దిగ్భ్రాంతి

అమీరుల్ మోమినీన్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారు మరియు ఇతర సహాబాలు ఖబ్బాబ్(రజి)వారిని చాలా ఎక్కువగా గౌరవించేవారు. ఉమర్(రజి)వారు ఖలీఫాగా ఉన్న కాలంలో, ఖలీఫాగారి దగ్గరకు ఆయన ఎప్పుడు వెళ్ళినా, ఆయనను సాదరంగా ఆహ్వానించి తన పక్కన కూర్చోబెట్టుకునేవారు.

ఖలీఫా గారు అనేవారు : **“ఈ సమావేశంలో ఉండటానికి బిలాల్(రజి) వారు కాకుండా. మీ కంటే ఎవరూ ఎక్కువ అర్హత ఉన్నవారు లేరు”**

[బిలాల్(రజి)వారు కూడా చాలా హింసించ బడ్డారని మా పాఠకులకు తెలిసిన విషయమే! బిలాల్(రజి)వారికి మరియు ఖబ్బాబ్ (రజి)వారికి ప్రత్యేక గౌరవం ఉండేది.]

ఇబ్నె కసీర్ గారు గ్రంథస్థం చేసిన ఓ విషయాన్ని ఇక్కడ చెప్పుకుందాం.

ఒకరోజు ఉమర్(రజి)వారి దగ్గరికి ఖబ్బాబ్(రజి) వచ్చారు, ఖలీఫా ఎప్పటిలాగే ఆయనను తన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. మరియు విగ్రహారాధకుల చేతిలో ఆయన భరించిన హింసలను కొన్నింటిని వివరించమని అడిగారు.

ఖబ్బాబ్(రజి)వారు తన చొక్కా ఎత్తి తన వీపును ఖలీఫాగారికి చూపారు. మరియు ఉమర్(రజి)వారు అది చూసి దిగ్భ్రాంతి చెందారు. వీపు మొత్తం తెల్లగా, కుష్ఠు వ్యాధి కలిగిన వ్యక్తి వీపులా ఉంది. అది కుష్ఠు వ్యాధి వలన కానప్పటికీ, ఇస్లామ్ ప్రారంభ దినాలలో విగ్రహారాధకులు నిప్పులపై పరుండ బెట్టినప్పుడు కాలిన గుర్తులు అవి. ఆ గుర్తులు చూపించి, ఆ రోజులలోని దయనీయమైన సంఘటనలను వివరించారు ఆయన.

మరియు **అక్కడ ఉన్నవారంతా విలపించారు.**

ఇబ్నె సాద్ గారి ఉల్లేఖనంలో ఇలా ఉంది :

ఉమర్(రజి)వారు అన్నారు : “**ఇంతకు పూర్వం నేనెన్నడూ ఇటువంటి వీపును చూడలేదు.**” ఖబ్బాబ్(రజి)వారు అన్నారు **“నా శరీరాన్ని కాల్చిన బొగ్గు కుప్పలపై నుండి ఈడ్చు కెళ్ళేవారు, నా వీపునుండి వచ్చే రక్తం మరియు కొవ్వు ఆ నిప్పులను ఆర్పేది.**

అటువంటి దారుణమైన హింసలను సహించిన ఆయన సహన గుణం ఇస్లామ్‌లో ఆయనకంటూ ఓ గౌరవనీయమైన స్థానం ఏర్పాటు చేసింది. ఖబ్బాబ్(రజి)వారు **వినయ స్వభావం గల వ్యక్తి.** ఒకసారి ఆయన సహాబాల సమూహంలో కూర్చుని ఉండగా, వారిలోని కొందరు ఆయనను అడిగారు, ఏదైనా చేయడానికి తమని ఆదేశించమని.

కాని ఆయన సున్నితంగా ఇలా చెప్పారు : "దేనినైనా ఆదేశించ డానికి నేనెవర్ని ? అటువంటివి చేయమని మిమ్మల్ని నేను ఆదేశించినవి, నేనే స్వయంగా చేయకపోవచ్చు."

(ఇక్కడ మనం ఒక విషయం అర్థం చేసుకోవాలి. అడిగినవారు ఖుర్'ఆన్ మరియు సున్నత్‌లను ఆచరించువారే! ఖబ్బాబ్(రజి)వారి సదాచరణ గురించి ఇక ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆయనను ఆదేశించమని కోరడం వెనుక గల కారణం, బహుశా ఆయనకున్న విశిష్ఠ ఈమాన్ పట్ల సాటి ముస్లిములకు ఉండే గౌరవం కావచ్చు.)

ఖబ్బాబ్(రజి)వారు కొన్నిసార్లు కన్నీటి పర్యంతమై చెప్పేవారు :

ఖబ్బాబ్(రజి)వారు ఉల్లేఖించారు : "అల్లాహ్ ముఖాన్ని అర్థిస్తూ మేము రసూలల్లాహ్(స) వారితో వలస వచ్చాము. కాబట్టి మన ప్రతిఫలం అల్లాహ్‌తో ఉంది. మాలో ఉండేవారు ఏ ప్రతిఫలాన్నీ (ఈ లోకంలో) వినియోగించు కోకుండానే మరణించారు మరియు మాలో జీవించి ఉన్నవారు దాని ఫలాలను చూడటానికి మరియు .... నిశ్చయంగా, ముసబ్ బిన్ 'ఉమైర్ మరణించారు తన వెనుక ఏదీ వదలకుండా, ఒక వస్త్రం తప్ప. వారు ఆయన ముఖాన్ని దానితో కప్పితే, ఆయన పాదాలు కనిపించేవి మరియు వారు ఆయన పాదాలను కప్పినప్పుడు ఆయన తల కనిపించేది. కాబట్టి అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : "కప్పండి ఆయన తలను (వస్త్రంతో) మరియు అల్-ఇజ్‌కిర్(గడ్డి)ని ఆయన పాదాలపై." **(తిర్మిజీ, సహీహ్, 3853, 46వ పుస్తకం - కితాబుల్ మనాఖిబ్, అధ్యా.53, సంపుటి 6)**

కాని ఈ రోజు మన స్థితి వేరుగా ఉంది. ఈ రోజు అల్లాహ్ అనుగ్రహాలు మనపై పడుతున్నాయి వర్షం వలే, కాబట్టి నేను భయపడుతున్నాను అల్లాహ్ ఈ జీవితంలోనే మన ధీనస్థితికి ప్రతిఫలాన్ని చెల్లించడం లేదు కదా అని."

> అంటే వీరి త్యాగాలకు, సత్కార్యాలకు ఇహలోకంలోనే ప్రతి ఫలాలు అందుకుంటే, శాశ్వతమైన పరలోకంలో అందే ప్రతిఫలాలు తగ్గుతాయనే భయం ఆయనది. అదే తఖ్వా. తఖ్వా గలవారికి స్వర్గం సిద్ధం చేసానని అల్లాహ్ వాగ్ధానం చేశారు.

## చావును కోరుకోకూడదు

ఆయన జీవితపు చివరి రోజులలో కూఫా వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు. హి|జీ 37లో ఆయన జబ్బుపడ్డారు. ఆయన కడుపులో సమస్య వచ్చింది. ఆ సమస్యతో విసిగిపోయి ఒకరోజు ఆయన అన్నారు, **"ప్రవక్త(స)వారు నిరోధించక పోయినట్లయితే, నేను అల్లాహ్‌ను వేడుకుని ఉండేవాడిని ఆ స్థితిలోనే నా మరణం కొరకు."**

హారిసా బిన్ ముజ్‌రిబ్ వారు చెప్పారు : నేను ఖబ్బాబ్(రజి)వారి ఇంటిలో ప్రవేశించాను మరియు తన కడుపుపై ఏడు చురకలు వేయించు కున్నారు. ఆయన అన్నారు : 'నాకు తెలియదు, నాకు పెట్టబడిన పరీక్షల వంటి పరీక్షలకు గురైన ఏ సహాబా గురించీ. వాస్తవానికి ప్రవక్త(స)వారి కాలంలో ఒక్క దిర్హమ కూడా నేను పొందగలిగేవాడిని కాదు మరియు (ఇప్పుడు) నా ఇంటి బయట 40వేలు ఉన్నాయి. చావును కోరుకోవడం నుండి రసూలుల్లాహ్(స) మనల్ని నిరోధించి ఉండకపోతే - లేక నిరోధించి ఉండకపోతే - నేను దానిని కోరేవానిని. **(తిర్మిజీ, 970, సహీహ్, 8వ పుస్తకం, అధ్యా. 3, సంపుటి 2)**

---

ఖైస్ బిన్ అబూ హాజిమ్ వారి ఉల్లేఖనం. మేము (జబ్బు పడిన) ఖబ్బాబ్(రజి)వారిని పరామర్శించడానికి వెళ్ళాము. మరియు తన శరీరంపై ఏడు చోట్ల చురకలు వేయించు కున్నారు. ఆయన అన్నారు, "మన సహాబాలు మరణించారు తమ ప్రతిఫలాలు ఈ లోకంలో ఆనందానుభవాల వలన తగ్గకుండా. కాని మనం (చాలా) ఐశ్వర్యం పొందాము, దానిని ఖర్చు పెట్టడానికి మార్గమేదీ దొరకలేదు మట్టి తప్ప. ముహమ్మద్ (స)వారు చావును కోరుకోవడాన్ని నిరోధించి ఉండక పోయినట్లయితే, నేను దానిని కోరేవాడిని." మేము ఆయనను రెండవసారి చూడటానికి వెళ్ళినప్పుడు ఆయన ఒక గోడను కడుతున్నారు. ఆయన అన్నారు, "ఒక ముస్లిమ్ తాను ఖర్చు చేసిన దానిపై (పరలోకంలో) ప్రతిఫలాన్ని పొందుతాడు, ఈ మట్టిలో తప్ప. **(సహీహ్ బుఖారీ, 5672, 75వ పుస్తకం - మరజ్, అధ్యా. 13, సంపుటి 7)**

జబ్బుపడిన ఆ రోజులలో కొందరు ఆయనను పరామర్శించడానికి వచ్చారు మరియు అన్నారు: **"అబూ అబ్దుల్లాహ్! నీవు సంతోషంగా ఉండాలి ఎందుకంటే నీ కంటే పూర్వమే ఈ లోకాన్ని వీడిన నీ సహచరులను నీవు కలవబోతున్నావు కౌసర్ సరస్సు దగ్గర"**

అది విని, ఆయన కన్నీరు కారుస్తూ చెప్పారు : **"అల్లాహ్ సాక్షి! నేను మరణానికి భయపడటం లేదు. మీరు ప్రస్తావించిన సహాబాలు ఎటువంటి ప్రతిఫలాన్ని ఇక్కడ పొందకుండా, ఈ లోకాన్ని వీడారు కాబట్టి వారు తమ ప్రతిఫలాన్ని పరలోకంలో పొందుతారు.** కాని వారి తరువాత మనం ఇక్కడనే ఉన్నాము మరియు చాలా పొందాము, ఇప్పటికే మనం అనుభవించిన ఆనందాల కొరకు మన ప్రతిఫలాలు తగ్గించబడతా యేమోనని భయపడుతున్నాను."

## అరుదైన దాతృత్వం

ఆయన ఊహించని పరిమాణంలో ఐశ్వర్యాన్ని అల్లాహ్ అనుగ్రహించారు. ఒకప్పుడు ఆయనకు ఒక్క దిర్హమ్ పొందడమే కష్టమయ్యేది. ఆయన దాతృత్వం కూడా అసాధారణమైనది. పేదవారికి మరియు అవసరంలో ఉన్నవారికి తన ఇంటిలో ఎక్కడ దిర్హములు మరియు దీనార్లు ఉంచారో చెప్పేవారు. ఆయన అనుమతి తీసుకోకుండానే, వాటిని తీసుకెళ్ళే అవకాశాన్ని ఆయన దీనులకు కల్పించారు.

తన ఆరోగ్యం బాగుండలేనప్పుడు చూడటానికి వచ్చినవారితో ఆయన చెప్పారు :

**"ఇక్కడ 80వేల దిర్హములు ఉన్నాయి. అల్లాహ్ సాక్షి! నేనెన్నడూ దానిని సురక్షితంగా ఉంచలేదు మరియు అవసరంలో ఉన్నవారి నెవరినీ దాని నుండి నేను నిరోధించలేదు."**

## మరణానికి ముందే వస్త్రం సిద్ధం

ఆయన కొరకు ఆయన మరణానికి కొంతకాలం ముందే మృత దేహాన్ని కప్పే వస్త్రం తీసుకురాబడింది. ఆ వస్త్రాన్ని చూసి నీళ్ళు నిండిన కళ్ళతో ఆయన ఇలా చెప్పారు : **ఇది పూర్తి వస్త్రం. కాని హమ్జా(రజి)వారు షహీద్ అయినప్పుడు ఏ వస్త్రమూ సరిపోలేదు అతని పూర్తి శరీరాన్ని కప్పడానికి, కాబట్టి ఆయన పాదాలు గడ్డితో కప్పబడ్డాయి."**

## చివరి కోరిక

ఆయన చివరి కోరిక ఏమిటంటే, పట్టణ సరిహద్దుల లోపల కాకుండా, పట్టణం వెలుపల ఖాళీ స్థలంలో ఆయనను సమాధి గావించాలని కోరారు. కూఫాలో ఆనవాయితీ వేరేగా ఉండేది. పట్టణంలోనే సమాధి చేసేవారు. ఆయన కోరిన విధంగానే ఆయన శరీరాన్ని పట్టణం వెలుపలే సమాధి గావించారు. ఆ తరువాత కూఫాలోని ఇతరులు కూడా తమ బంధువుల భౌతిక కాయాలను ఆ స్థలంలోనే సమాధి గావించడం ప్రారంభించారు.

ఖబ్బాబ్(రజి)వారు తన 72 సంవత్సరాల వయస్సులో మరణించారు.

ఖబ్బాబ్(రజి)వారు మరణించే సమయానికి అలీ(రజి)వారు సిఫ్ఫీన్ యుద్ధానికి వెళ్ళి ఉన్నారు.

కాబట్టి, ఆయన కూఫాకు తిరిగివచ్చినప్పుడు, కూఫాకు వెలుపల ఏడు కొత్త సమాధులు చూసారు. కాబట్టి ఆయన అడిగారు, "**ఎవరి సమాధులు ఇవి? నేను ఇక్కడ నుండి వెడలేటప్పుడు అక్కడ ఏదీ లేదు.**"

ప్రజలు చెప్పారు, "ఓ అమీరుల్ మోమినీన్! మొదటి సమాధి ఖబ్బాబ్ బిన్ అరత్(రజి)వారిది, ఆయన కోరిక మేరకు ఇక్కడ సమాధి గావించ బడ్డారు. మరియు మిగిలిన సమాధులు ఇతరులవి. ఖబ్బాబ్(రజి)వారి వలన ఇక్కడ సమాధి గావించబడ్డారు.

అది విని అలీ(రజి)వారు కన్నీరు కారుస్తూ అన్నారు :

"అల్లాహ్ అనుగ్రహాలు మరియు కారుణ్యం ఖబ్బాబ్(రజి)వారిపై కురియుగాక! ఆయన ఇస్లామ్‌ను తన స్వీయ అంగీకారంతోనే స్వీకరించారు. అల్లాహ్ కొరకు తన ఇష్టప్రకారమే హిజ్రత్ చేశారు మరియు తన జీవితాన్ని అల్లాహ్ మార్గంలో కష్టాలలో మరియు జిహాద్‌లలో గడిపారు. అల్లాహ్ ఎన్నటికీ వృథాపోనివ్వరు సద్వర్తనుల సదాచరణలను"

అలీ(రజి)వారు చాలా సమయం అక్కడే ఉండి ఆయన కొరకు మరియు అక్కడ సమాధి గావించబడిన ఇతరుల కొరకు అల్లాహ్‌ను ప్రార్థించారు.

* * *

> **నిశ్చయంగా ఎవరైతే, "అల్లాహ్‌యే మా ప్రభువు!" అని పలుకుతూ తరువాత దానిపైననే స్థిరంగా ఉంటారో! వారిపై అల్లాహ్ యొక్క దూతలు దిగి వచ్చి** (ఇలా అంటారు) : **"మీరు భయపడకండి. మీకు వాగ్దానం చేయబడిన స్వర్గపు శుభవార్తను వినండి!'** (ఖుర్ఆన్ 41:30)

ఖబ్బాబ్(రజి)వారి జీవిత చరిత్ర చదివారు.

- ఆయన ఇస్లామ్ స్వీకరించి ముస్లిమ్ అయ్యారు. ఎందుకు? ఐశ్వర్యం కోసమా? సుఖాల కోసమా? బానిసత్వం నుండి విముక్తి కోసమా?
- ఇస్లామ్ స్వీకరిస్తే ఆ సమయంలో ఆయనకు ఎటువంటి పరిస్థితి ఎదురౌతుందో ఊహించడం ఆయనకు చాలా సులభమే. ఆయనకు తన వృత్తిలో మంచి ప్రావీణ్యం ఉంది. తన జీవనోపాధికి ఇబ్బంది లేదు. అయినా సరే, కష్టాలకు సిద్ధమై ఇస్లామ్ స్వీకరించారు. అంతేగాని ఎవరూ ఆయనను ప్రలోభ పెట్టలేదు. ముహమ్మద్(స)వారి మాటలలోని సత్యాన్ని గ్రహించ గలిగారు. ఇస్లామ్ స్వీకరించడం వల్లనే ఇన్ని కష్టాలు ఎదుర్కుంటున్నామని వారు ఏనాడూ నిష్ఠూరమాడ లేదు. అల్లాహ్ సహాయం కోసం ప్రార్థించమని ముహమ్మద్(స)వారిని కోరారు. **అల్లాహ్ తన దాసులను వదిలేయరు.** ఎటువంటి పరిస్థితులకైనా తట్టుకుని అల్లాహ్ మార్గంపై స్థిరంగా ఉండే విశ్వాసులుగా వీరిని భావితరాలకు ఉదాహరణలుగా అల్లాహ్ నిలబెట్టి, వారి త్యాగాన్ని ఖయామత్ వరకూ విశ్వాసులు తెలుసుకునేలా చేసారు.
- ఆయనకు తన వృత్తిలో ప్రావీణ్యం ఉంది. ఖుర్ఆన్‌ను కూడా నేర్పేవారు.
- ఇస్లామ్ ప్రారంభం నుండి మరణం వరకూ ఎన్నో కష్టాలను

సహించారు. ముహమ్మద్(స) ఆదేశాన్ని గౌరవిస్తూ కష్టాలలోనూ అనారోగ్యంలోనూ చావును కోరుకోలేదు. ఐశ్వర్యాన్ని ప్రేమించ లేదు. **ఎల్లప్పుడూ పరలోక ప్రతిఫలం కోసమే పరితపించారు.**

- ఖలీఫాల సమక్షంలో గౌరవ మర్యాదలు పొందారు. తోటివారు ఆయనను ఏదైనా ఆదేశించమని కోరేవారు. అయినా సరే ఆయన ఎంతో అణుకువగా ఉండేవారు.

ఈ శీర్షికలో తెలియజేయబడుతున్న సహాబాల వలే కేవలం పరలోక ప్రతిఫలం కోసం ఇస్లామ్ స్వీకరించే వారు కొందరు ప్రతీ కాలంలోనూ ఉంటారు. అయితే ఇస్లామ్ స్వీకరించడం ద్వారా ముస్లిమ్ దేశాలలో అధిక వేతనాలు పొందవచ్చని, లేదా 'దావా' పేరుతో ఉచితంగా ఐశ్వర్యం సంపాదించు కోవచ్చని, కపట విశ్వాసాన్ని నటించి ముస్లిమేతరులకు సహాయపడుతూ, ముస్లిములకు ద్రోహం తలపెట్టి ఆర్థికంగా లాభపడదామని కూడా ఇస్లామ్ స్వీకరించేవారు నేడు అధిక సంఖ్యలో ఉన్నారు.

**'విశ్వాసం' అంటే ఏమిటో తెలియకుండానే చాలామంది 'విశ్వసించాము' అంటున్నారు.**

**అలిఫ్-లామ్-మీమ్. ఏమీ? ప్రజలు, "మేము విశ్వసించాము!" అని అన్నంత మాత్రాన్నే తాము విడిచి పెట్టబడతారని మరియు తాము పరీక్షింపబడరని భావిస్తున్నారా?**

**మరియు వాస్తవానికి, మేము వారికి పూర్వం గతించిన వారిని కూడా పరీక్షించి ఉన్నాము. కావున నిశ్చయంగా సత్యవంతులు ఎవరో మరియు అసత్యవంతులు ఎవరో అల్లాహ్ వ్యక్తపరుస్తాడు.**

**లేక, చెడుపనులు చేస్తున్నవారు, మా నుండి తప్పించు కోగలరని భావిస్తున్నారా? ఎంత చెడ్డ నిర్ణయం వారిది!** (ఖుర్'ఆన్ 29:1-4)

సహాబాలంతా వారి వారి రంగాలలో ప్రావీణ్యులే. అన్నీ వదులు కున్నారు. **కాని అల్లాహ్ వారిని వదిలేయలేదు.** ఇతరులకు ఇది మూర్ఖంగా కనిపించవచ్చు. జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడం అంటే, ఎక్కువ పరిమాణంలో ఐశ్వర్యాన్ని సంపాదించడంగా చాలా మంది భావిస్తారు.

కాని ఈ సహాబాలకు చాలా వివేకం ఉంది. సత్యాన్ని గుర్తించ గలిగారు. తీవ్ర నష్టాలకు, భౌతిక హింసలకు తట్టుకోగలిగారంటే, దానికి కారణం - **తమ జీవిత లక్ష్యం ఏమిటో స్వయంగా కనుగొన్న శాస్త్రవేత్తలు వీరు.**

వీరి స్థాయి పర్వతమంత అయితే, మనది గులకరాయంత.

ఒక్క దిర్హముకు కూడా నోచుకోని వారు, తరువాయి కాలంలో ఐశ్వర్యవంతులు అయ్యారు. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)వారి జీవితాన్ని ఓసారి గుర్తు చేసుకోండి. **సహనం వారి ఆభరణం.**

**ఇహలోకంలో సంతోషం, పరలోకపు శాశ్వత సుఖాన్ని పొందాలను కునే వారికి ఈ ధర్మం ఆచరణ యోగ్యం. సరియైన విశ్వాసంతో ఇస్లామ్ స్వీకరించినవారు, తాము కష్టాల పాలయ్యామని ఏనాడూ ఫిర్యాదు చేయరు. చేయలేరు, ఇన్షా అల్లాహ్!**

**ఎవరైనా అలా ఫిర్యాదు చేస్తే, వారి విశ్వాసం అనుమానించ దగినదే!**

**కపట విశ్వాసుల పట్ల జాగ్రత్తగా ఉండాలి :**

**ఖుర్'ఆన్‌లో 63వ సూరహ్ అల్-మునాఫికూన్ చదవండి. ఖుర్'ఆన్ వాక్యాలను వక్రీకరించడం ద్వారా, ఇతర ఆశలు చూపడం ద్వారా సన్మార్గంలో ఉన్నవారిని మార్గభ్రష్టుల్ని చేసి నాశనం చేయడానికి ఈ కపట విశ్వాసులు ప్రయత్నిస్తున్నారు. జాగ్రత్త సుమా.**

ఉమర్(రజి)వారి ఇస్లామ్ స్వీకరణ గురించి మరొకసారి ఇందులో ప్రస్తావించడం జరిగింది.

**ఇతరులకు ఇస్లామ్ అర్థం కావాలంటే, ఏ పుస్తకం ముందు ఇవ్వాలని అడుగుతుంటారు. మొట్టమొదటే వారికి ఖుర్'ఆన్ ఇస్తే అర్థం కాదని లేదా అర్థం చేసుకోలేరని చాలామంది భావిస్తుంటారు.**

ఖుర్'ఆన్‌లో అల్లాహుతాలా ఇలా చెబుతున్నారు : "... **ఆయన** (అల్లాహ్) **దీనితో** (ఖుర్'ఆన్‌తో) **తాను కోరిన వారికి మార్గదర్శకత్వం చేస్తాడు** ..." (ఖుర్'ఆన్ 39:23). ఉమర్(రజి)వారు 'తా-హా' సూరహ్ లోని కొన్ని ఆయత్‌లు చదవగానే ఆయనకు సత్యం తెలిసింది. అవే ఆయత్‌లు ప్రతీ వారిని ఆలోచింప చేయకపోవచ్చు. ఎవరెవరికి ఏయే ఆయత్‌లు మార్గం చూపుతాయో మనకు తెలియదు. అల్లాహ్‌కే తెలుసు. కాబట్టి ప్రారంభంలోనే ఇతరులకు మొట్టమొదటగా ఖుర్'ఆన్‌ను ఇవ్వండి. కొత్తగా ఇస్లామ్ స్వీకరించిన ముస్లిములు చాలాకాలం పాటు ఖుర్'ఆన్‌ను నెమ్మదిగా అర్థం చేసుకుంటూ పలుమార్లు చదవాలి. అర్థమైన ప్రతీ దానిని అల్లాహ్ పేరుతో ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించాలి. సహాబాల గురించి చదివి తెలుసుకోవాలి. ఇన్షా అల్లాహ్! ఈ శీర్షికలో ప్రచురించబడిన సహాబాల జీవిత చరిత్రలను ఓ ప్రత్యేక పుస్తకంగా అందిస్తాము.

కష్టపడి చదవకుండా డాక్టర్లు, సైంటిస్టులు, ఇంజనీర్లు, లాయర్లు మొదలైన వారిగా కాలేరు కదా! వీరందరూ తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎంతో కష్టపడతారు. కాని ఎన్నో కష్టాలకు గురి అవుతున్నామని దు:ఖిస్తారా? ప్రాపంచిక సుఖాల కోసం వారు కష్టాలను ఎదుర్కొంటున్నారు. **మరి అత్యున్నత సాఫల్యం కోసం ఇస్లామ్ స్వీకరించినవారు ఎలా బాధపడతారు?**

**"ధర్మంలో బలవంతం లేదు."** (ఖుర్'ఆన్ 2:256)

**కష్టాలలోనే విశ్వాసికి, తన విశ్వాస స్థాయి ఏమిటో అర్థమౌతుంది, ఇన్షా అల్లాహ్!**

# ముస్లిములంతా ఐక్యంగా ఉండాలి

ఇది అల్లాహ్ యొక్క ఆదేశం

وَ اعْتَصِمُوا بِحَبْلِ اللهِ جَمِيعًا وَّ لَا تَفَرَّقُوا

**And hold firmly to the rope of Allah all together and do not become divided.**
(Qur'an 3:103)

**మరియు స్థిరంగా పట్టుకోండి అందరూ కలిసి అల్లాహ్ త్రాడును మరియు విడిపోకండి ... (ఖుర్'ఆన్ 3:103)**

**ఇది ఖుర్'ఆన్ ద్వారా అల్లాహ్ ఇచ్చిన ఆదేశం.**

## కాబట్టి కలిసి ఉండటం ఫరజ్

- అయినా సరే ముస్లిమ్ సమాజంలో ఐక్యత పోయింది. వివిధ జమాత్‌లుగా ముస్లిములు ఎలా చీలి పోయారు?
- దానికి గల కారణాలు ఏమిటి?
- ఈ ఐక్యతను పాడుచేసే కుట్రలు ఎప్పుడు ప్రారంభమయ్యాయి?
- వాటిని ఎవరు చేయిస్తున్నారు?
- ఇప్పుడు మన తక్షణ కర్తవ్యం ఏమిటి?

పై ప్రశ్నలకు సమాధానాలు ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్(స) వారి బోధనల వెలుగులో వివరించడం జరిగింది. ఈ వ్యాసం చదివే వారికి ముందుగా ఫిఖ్ పట్ల అవగాహన ఉండాలి. అందుకోసమే ఏప్రిల్ మరియు మే-జూన్, 2013 సంచికలలో ఫిఖ్ గురించి రెండు వ్యాసాలను ముందుగానే అందించాము. వాటికి కొనసాగింపుగా ఈ వ్యాసంలో పై ప్రశ్నలకు సమాధానాలు తెలియజేశాము.

తొలి మానవుడు ఆదమ్(అ)వారి ముందు ఇబ్లీస్‌ను సజ్దా చేయమని అల్లాహుతాలా ఆదేశించారు. కాని ఇబ్లీస్ ఆ ఆదేశాన్ని తిరస్కరించి అల్లాహ్ శాపానికి గురయ్యాడు.

**కలిసి ఉండండి! విడిపోకండి!** అని అల్లాహ్ ఆదేశిస్తుంటే, ఆ ఆజ్ఞకు వ్యతిరేకంగా విడిపోతున్నారు మరియు ప్రజలను విడగొడు తున్నారు. అల్లాహ్ ఆదేశాన్ని స్వీకరించకుండా, **విడగొట్టే వారి మాట ఎవరైనా ఎందుకు స్వీకరించాలి?**

అందరూ ఐక్యంగా ఉండాలి అని చెబితే మరలా దాని కొరకు ఓ కొత్తపేరు అవసరం లేదు. అది మరో కొత్త చీలిక అవుతుంది.

**అల్లాహ్ చేసిన హెచ్చరిక :**

**స్పష్టమైన ఉపదేశాలను పొందిన తరువాత కూడా ఎవరైతే** (వేర్వేరు తెగలుగా) **చీలిపోయారో మరియు విభేదాలకు గురి అయ్యారో, వారి మాదిరిగా మీరు కావద్దు. మరియు అలాంటి వారికి ఘోరశిక్ష ఉంటుంది.** (ఖుర్'ఆన్ 3:105)

పై ఆయత్‌లో అల్లాహ్ ఇంత స్పష్టంగా హెచ్చరిక చేసినా కూడా, దానిని ముస్లిములు పెడచెవిన పెడుతున్నారు.

**'కలిసి ఉండాలి'** అనే ఉపదేశం ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్ (స)వారి బోధనలలో చాలా స్పష్టంగా ఉంది. మరి స్పష్టమైన ఉపదేశాలు అందిన తరువాత కూడా, ముస్లిములు ఎందుకు వివిధ జమాత్‌లుగా చీలిపోతున్నారు?

**'హబ్‌లిల్లాహ్'** (అల్లాహ్ యొక్క తాడు) అంటే అది **ఖుర్'ఆన్**. అబ్దుల్లాహ్ బిన్ మస్'ఊద్(రజి)వారు ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త(స) వారు చెప్పారు :

**అల్లాహ్ గ్రంథమే అల్లాహ్ యొక్క త్రాడు, ఆకాశాల నుండి భూమికి విస్తరించబడింది.**

అరబీ భాషలో హబ్ల్ అంటే 'ఒప్పందం' (Covenant)

**సంపూర్ణమైన భావంలో చెప్పాలంటే కలిపి ఉంచే ఏదైనా ఒక బంధం.**

ఇక్కడ తాడు అనేది ఖుర్'ఆన్ కొరకు వాడబడిన రూపకాలంకారం. ఐక్యతకు మూలం ఖుర్'ఆన్.

## 1. ఖుర్'ఆన్‌ను గట్టిగా పట్టుకోండి

ఇక్కడ ఖుర్'ఆన్‌కు సంబంధించి క్లుప్తంగా కొన్ని విషయాలు గుర్తు చేసుకోవలసి ఉంది. ఖుర్'ఆన్ అవతరణ దాదాపు 23 సంవత్సరాల పాటు అంచెలంచెలుగా జరిగింది. మన ప్రియప్రవక్త ముహమ్మద్(స) వారి మరణానికి ముందే, ఆయన(స) అల్లాహ్ యొక్క ఆదేశంతో ఈ ఆయత్‌లు అన్నింటిని ఒక క్రమ పద్ధతిలో మనకు అందించారు. ఖుర్'ఆన్‌లోని తొలి సూరహ్ తొలి వాక్యం : **బిస్మిల్లాహిర్రహ్మా నిర్రహీమ్.**

**అల్లాహ్ పేరుతో ... మరియు ఆయన కారుణ్యాన్ని వివరించే రెండు పేర్లు రహమాన్, రహీమ్** ఈ వాక్యంలో ఉన్నాయి.

**రహమాన్, రహీమ్** ఒకే గుణాన్ని తెలిపే రెండు పేర్లు అయినప్పటికీ రెండింటిలో కాస్త వ్యత్యాసం ఉంది. అర్రహమాన్ అంటే **ఈ సృష్టిలోని**

**సర్వంపై** అనంతమైన కారుణ్యాన్ని కురిపించేవాడు.

అర్రహీమ్ అంటే **పరలోకంలో ప్రత్యేకంగా విశ్వాసులపై** అనంతమైన కారుణ్యాన్ని కురిపించేవాడు.

అదే విధంగా **బదీ** మరియు **ఖాలిక్** అనే పేర్లు అల్లాహ్ యొక్క ఓ లక్షణాన్ని వివరించే ఆయన పేర్లు. పైన చెప్పిన విధంగానే వీటిలో కూడా కాస్త వ్యత్యాసం ఉంది. ఏమీ లేని శూన్యం నుండి 'విశ్వాన్ని' సృష్టించిన సృష్టికర్త - అల్ బదీ.

ఆ విధంగా సృష్టించిన దానిలోని ఒక దానితో మరొక దానిని ఆయన సృష్టించారు. ఉదాహరణకు మానవుడిని మట్టితో తయారు చేశాడు అల్లాహుతాలా. మట్టిని సృష్టించింది అల్లాహ్‌యే! ఆ మట్టితో మరలా మనిషిని సృష్టించింది అల్లాహ్‌యే! తాను సృష్టించిన దాని నుండి మరోదానిని సృష్టించే ఆయన లక్షణాన్ని తెలిపే పేరు : అల్ ఖాలిక్.

ఖుర్ఆన్ తొలి వాక్యంలో '**కారుణ్యం**' గురించి చెప్పబడింది.

**అల్లాహ్ కారుణ్యం :**

ఓ క్షణం పాటు అల్లాహ్ కారుణ్యం ఈ సృష్టి పైనుండి మరలితే సృష్టి నాశనమై పోతుంది. మనం తల్లి గర్భంలో జీవిగా రూపుదిద్దు కున్నప్పటి నుండి మరణం వరకూ ప్రతీ క్షణం అల్లాహ్ కారుణ్యంపైనే ఆధారపడుతున్నాము.

దాసులు **తన కారుణ్యాన్ని ఎలా పొందవచ్చో** క్రింది ఖుర్ఆన్ ఆయత్ ద్వారా అల్లాహుతాలా తెలియజేశారు.

**"మరియు మీరు కరుణింపబడటానికి అల్లాహ్‌కు మరియు సందేశ హరునికి విధేయులై ఉండండి."** (ఖుర్ఆన్ 3:132)

అంటే అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఆదేశించినవి, ముహమ్మద్ (స) వారు తన బోధనల ద్వారా ఆదేశించినవి మనస్ఫూర్తిగా చేయాలి.

**ఇక అల్లాహ్ పేరు గురించి ...**

సృష్టికి పూర్వం ఆయన పేరు అల్లాహ్‌యే! సృష్టి అంతమయ్యాక కూడా ఆయన పేరు అల్లాహ్‌యే! ప్రవక్త లందరూ 'అల్లాహ్'ను ఆ పేరుతోనే వేడుకున్నారు. మూసా(అ)వారు 'అల్లాహ్'నే వేడుకున్నారు. ఆయన మాతృభాష హెబ్రూలో సృష్టికర్త పేరు అల్లాహ్‌యే! ఈసా(అ) వారి మాతృభాష అరమాయిక్‌లో సృష్టికర్త పేరు 'అల్లాహ్'యే! (మరిన్ని వివరాలకై www.saanthibaata.net చూడండి.)

ఈ విశ్వానికి సృష్టికర్త **'అల్లాహ్'** మరియు దీని మనుగడకు కారణం **అల్లాహ్ కారుణ్యం**.

ఈ విధంగా ఖుర్ఆన్ తొలి వాక్యం అల్లాహ్‌ను పరిచయం చేస్తుంది.

తరువాయి వాక్యాలు అల్లాహ్‌ను మరింతగా వివరిస్తున్నాయి. ఇక్కడ అనువాదం కాకుండా వివరణ నిస్తున్నాము.

**అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత, సకల లోకాల ప్రభువు అల్లాహ్‌కే సకల పొగడ్తలు మరియు కృతజ్ఞతలు.**

'సకల పొగడ్తలు ఆయనకే' అంటే ఆయనను మించిన ఘనత సృష్టిలో మరొకరికి లేదు. ఉండదు.

'సకల కృతజ్ఞతలు ఆయనకే' అంటే, ఏ సహాయమైనా ఆయన నుండే లభిస్తుంది.

**"మాలికి యౌమిద్దీన్"** (తీర్పు దినానికి యజమాని) - ప్రళయం తరువాత మానవులంతా తిరిగి లేపబడిన రోజున, అల్లాహ్ వారి ఆచరణలపై తీర్పు చెప్పే అధికారి.

**కేవలం పై మూడు వాక్యాలలో విశ్వం ప్రారంభం నుండి దాని అంతం వరకూ మరియు శాశ్వత పరలోక నిర్ణయం అంతా అల్లాహ్ అధీనంలో ఉంది అని స్పష్టం అవుతుంది.**

అందుకనే **'నిన్నే ప్రార్థిస్తున్నాము, నీ సహాయమే కోరుతున్నాము'** అని దాసుడు ప్రతీ రకాత్‌లో సర్వశక్తివంతుడైన అల్లాహ్‌ను వేడు కుంటున్నాడు. తీర్పు దినానికి అధికారి అల్లాహ్ అని దాసునికి స్పష్టంగా అర్థమైంది. కనుకనే తమకు సన్మార్గం చూపండి అని కోరుతూ, ఆయన ఆగ్రహానికి గురైనవారి మార్గం కాకుండా ఆయన అనుగ్రహాలను పొందినవారి మార్గాన్నే చూపమని వేడుకుంటున్నాడు.

మనం చేసే ఫరజ్, సున్నత్, నఫిల్, వాజిబ్ మొదలైన ప్రతీ సలాత్‌లో ఈ 'ఫాతిహా' సూరహ్ ప్రతీ రకాత్‌లో పఠించబడుతుంది.

అంటే అల్లాహ్ అనుగ్రహాలను అందించే సన్మార్గంలోనే మనల్ని ఉంచమని నిరంతరం కోరుకుంటున్నాము. **దాసుల ఈ వేడుకోలుకు సమాధానమే ఖుర్ఆన్.**

**రెండవ సూరహ్ ప్రారంభం నుండి ఖుర్ఆన్ చివరి ఆయత్ వరకూ ఉన్నదంతా మనకు ఆ సన్మార్గాన్నే చూపుతుంది.** రెండవ సూరహ్ మొదటి రెండు ఆయత్‌లలో ఇలా చెప్పబడింది.

**అలిఫ్-లామ్-మీమ్. ఇది ఒక పుస్తకం. లేదు సందేహం దీనిలో. అల్లాహ్ పట్ల భయం (తఖ్వా) గలవారికి మార్గదర్శకత్వం.**

ఆ తరువాత వచ్చే రెండు వాక్యాలలో అల్లాహ్ పట్ల భయం గలవారు (ముత్తఖీన్) అంటే ఎవరో చెప్పబడింది.

దాసులు అల్లాహ్‌ను 'సన్మార్గాన్ని' చూపమని వేడుకున్నారు.

దాసుల వేడుకోలును స్వీకరించి, దానికి సమాధానంగా అల్లాహ్ సన్మార్గాన్ని చూపే ఖుర్ఆన్‌ను అవతరింప జేశారు. అది అందరికీ అందుబాటులో ఉంది. అది మనకు మార్గదర్శకంగా ఉండాలంటే మనమంతా **'ముత్తఖీ'**లు కావాలి.

ఆ తరువాయి వాక్యాలలో **సత్య తిరస్కారుల** గురించి మరియు **మునాఫిక్‌ల** గురించి చెప్పడం జరిగింది. మునాఫిక్‌లు (కపట

విశ్వాసులు) అంటే 'విశ్వసించాము' అని పైకి చెబుతూ, ముస్లిములుగా నటించేవారు. వారి హృదయాలలో ఇస్లామ్ మరియు ముస్లిముల పట్ల ద్వేషం ఉంటుంది. ఖుర్'ఆన్‌లో ప్రారంభంలోనే మునాఫిక్‌ల గురించి ఎక్కువగా వివరించడం జరిగింది. ముస్లిముల ఐక్యతను పాడుచేయడానికి, వారిని మోసగించడానికి అహర్నిశలూ ప్రయత్నించేది ఈ మునాఫిక్‌లే! ప్రస్తుతం మన రాష్ట్రంలో వీరి కార్యకలాపాలు చాలా వేగంగా జరుగుతున్నాయి.

మూడవ సూరహ్ 103వ ఆయత్‌లో "అల్లాహ్ తాడు - ఖుర్'ఆన్" ను గట్టిగా పట్టుకోమని అల్లాహ్ ఆదేశించారు. మరియు విడిపోవద్దన్నారు. 2వ సూరహ్ మరియు 3వ సూరహ్‌లోని కొన్ని ముఖ్య ఆయత్‌లు పైన ప్రస్తావించడం జరిగింది.

ఈ 2వ సూరహ్ **బఖరా** మరియు 3వ సూరహ్ **ఆల్-ఇమ్రాన్** కు ఒక ప్రత్యేక విశిష్ఠత ఉంది. క్రింది హదీస్‌లు చూడండి.

అబూ హురైరా(రజి)వారి ఉల్లేఖనం: ప్రవక్త(స) చెప్పారు, 'మీ ఇండ్లను సమాధులుగా మార్చకండి. నిస్సందేహంగా, షైతాన్ సూరతుల్ బఖరా చదివిన ఇంటిలో ప్రవేశించడు."
**(తిర్మిదీ, సహీహ్, 2877, పుస్తకం 42, అధ్యా. 2, సంపుటి 5)**

నవ్వాస్ బిన్ సమాన్ గారు ఉల్లేఖించారు : ప్రవక్త(స) చెప్పారు, "ఖుర్'ఆన్ వస్తుంది, మరియు ఈ ప్రపంచంలో దాని ప్రకారం ఆచరించిన దాని ప్రజలు వస్తారు. **సూరతుల్ బఖరా మరియు ఆల్-ఇమ్రాన్‌లు దాని ముందు ఉంటాయి**." నవ్వాస్ చెప్పారు, 'అల్లాహ్ యొక్క సందేశహరులు మూడు సామెతలు చెప్పారు, వాటిని నేను మరచిపోలేను.' ఆయన చెప్పారు, 'అవి వస్తాయి రెండు నీడలుగా వాటి మధ్యలో ప్రకాశవంతంగా ఉంటుంది లేదా అవి రెండు నీడనిచ్చే నల్లటి మేఘాలుగా లేదా అవి పక్షుల పంక్తులవంటి నీడలుగా తన ప్రజల తరపున వాదిస్తాయి."**(తిర్మిదీ, సహీహ్, 2883, పుస్తకం 42, అధ్యా. 5, సం. 5)**

తీర్పుదినం నాడు ప్రజలంతా నీడకోసం పరితపిస్తారు. ఈ సూరహ్‌ల పఠనం మరియు వాటి ప్రకారం ఆచరించిన వారికి ఆరోజున ఏ విధంగా నీడ లభిస్తుందో పై హదీస్‌లో ముహమ్మద్(స)వారు వర్ణించి చెప్పారు. అంతేకాకుండా వారికొరకు అవి వాదిస్తాయని కూడా తెలుస్తున్నది.

ముస్నద్ అహ్మద్ నుండి ఇబ్నె కసీర్ తెలియజేసిన హదీస్ ప్రకారం ఈ సూరహ్ ఖుర్'ఆన్ యొక్క శిఖరం వంటిదని, ఈ సూరహ్‌లోని ప్రతీ ఆయత్ యొక్క అవతరణ జరిగినప్పుడు ఆ ఆయత్‌తో పాటు 80మంది 'అల్లాహ్ యొక్క దూతలు' ఉండేవారని తెలుస్తుంది. **పై హదీస్‌లు సంపూర్ణంగా అర్థం కావాలంటే, ఈ రెండు సూరహ్‌లను అర్థంతో సహా పదే పదే చదవాలి. అప్పుడు ఈ సూరహ్‌ల యొక్క విశిష్ఠతను మన హృదయాలు అనుభూతి పొందుతాయి.**

*2వ సూరహ్‌లో మొదటి రెండు ఆయత్‌లలో ఇలా చెప్పారు :*

**అలిఫ్-లామ్-మీమ్. ఇది ఒక పుస్తకం. లేదు సందేహం దీనిలో.** (ఖుర్'ఆన్ 2:1)

*32వ సూరహ్ మొదటి రెండు ఆయత్‌లలో ఇలా చెప్పారు :*

**అలిఫ్-లామ్-మీమ్. (ఖుర్'ఆన్) గ్రంథ అవతరణ సకల లోకాల ప్రభువు నుండి** (వచ్చింది). **లేదు సందేహం దీనిలో.** (ఖుర్'ఆన్ 32:1,2)

3వ సూరహ్‌లో 3వ ఆయత్‌లో ఇలా చెప్పారు :

**అవతరింపజేశాడు నీపై ఈ గ్రంథాన్ని, సత్యంతో.** (ఖుర్'ఆన్ 3:3)

ఖుర్'ఆన్ సత్యగ్రంథం. దీనిలో సందేహానికి తావు లేదు. సర్వలోపాలకు అతీతుడైన అల్లాహ్ నుండి ఇది అవతరించబడింది.

**అరబీ భాషలో ఉన్న ఈ ఖుర్'ఆన్‌ను, ఏ విధమైన వక్రత లేకుండా అవతరింప జేశాము. బహుశా వారు అల్లాహ్ పట్ల భయంగలవారుగా ఉంటారని.** (ఖుర్'ఆన్ 39:28)

ఏ మనిషికైనా తన జ్ఞానాన్ని బట్టే విషయాలు అర్థమౌతాయి. మనిషిలో జ్ఞానం పెరిగే కొద్దీ అర్థం చేసుకునే సామర్థ్యమూ పెరుగుతుంది. **ఖుర్'ఆన్‌లో అర్థమైనవి స్వీకరించాలి**. అర్థం కానివాటిని, అవి అర్థమయ్యేంత వరకూ వేచి ఉండాలి లేదా వాటిని అర్థమయ్యేలా చేయమని అల్లాహ్‌ను వేడుకోవాలి. అధ్యయనం చేయాలి.

ఖుర్'ఆన్‌ను అల్లాహ్ సులభతరం చేశారు :

**"మరియు వాస్తవానికి, మేము ఈ ఖుర్'ఆన్‌ను హితబోధ గ్రహించడానికి సులభం చేశాము. అయితే హితబోధ స్వీకరించేవాడు ఎవడైనా ఉన్నాడా?"** (ఖుర్'ఆన్ 54:32)

కాబట్టి ఇహపరలోకాలలలో అల్లాహ్ నుండి మేలును కలుగజేసే విషయాలన్నీ ఖుర్'ఆన్ నుండి మనకు స్పష్టంగానే అర్థమౌతాయి.

**మేము ఎంతో శుభవంతమైన ఈ గ్రంథాన్ని నీపై అవతరింప జేశాము. ప్రజలు దీని ఆయత్‌లను గురించి ఆలోచించాలని మరియు బుద్ధిమంతులు దీని నుండి హితబోధ గ్రహించాలని.** (ఖుర్'ఆన్ 38:29)

అంటే - **ప్రజలు ఖుర్'ఆన్ చదవాలి.** అర్థం చేసుకుని ఆలోచించాలి. కాబట్టి కేవలం ఆలిమ్‌లు మరియు మస్జిద్ ఇమామ్‌లు మాత్రమే ఖుర్'ఆన్ చదవాలని అనుకోవడం అల్లాహ్ ఆదేశానికి విరుద్ధం. హితబోధ అర్థమయ్యేందుకు ఖుర్'ఆన్‌ను సులభతరం చేసినట్లు అల్లాహ్‌యే స్వయంగా చెబుతున్నారు. **ఖుర్'ఆన్‌లోని హితబోధను తెలుసుకోవడం కూడా ఫరజ్.**

ఆయనే నీపై (ఓ ముహమ్మద్!) ఈ గ్రంథాన్ని అవతరింప జేశాడు. ఇందులో కొన్ని స్పష్టమైన అర్థమిచ్చే ఆయత్‌లు ఉన్నాయి. అవి ఈ గ్రంథానికి మూలాలు. మరికొన్ని అస్పష్టమైనవి ఉన్నవి. కావున **తమ హృదయాలలో వక్రత ఉన్నవారు సంక్షోభాన్ని రేకెత్తించడానికి మరియు గూఢార్థాలను ఆపేక్షించి ఎల్లప్పుడూ అస్పష్టమైన వాటి వెంట పడతారు.** వాటి అసలు అర్థం అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ తెలియదు. కానీ, పరిపక్వ జ్ఞానం గలవారు : **"మేము దీనిని విశ్వసించాము, ప్రతీ ఒక్కటీ మా ప్రభువు వద్ద నుండి వచ్చినదే!" అని అంటారు. జ్ఞానవంతులు తప్ప ఇతరులు వీటిని గ్రహించ లేరు.**

(వారు ఇలా అంటారు) : **"ఓ మా ప్రభూ! మాకు సన్మార్గం చూపిన తరువాత మా హృదయాలను వక్రమార్గం వైపునకు పోనివ్వకు. మరియు మాపై నీ కారుణ్యాన్ని ప్రసాదించు. నిశ్చయంగా నీవే సర్వప్రదాతవు.** (ఖుర్'ఆన్ 3:7,8)

**కాబట్టి సన్మార్గంలో ఉండాలంటే ఖుర్'ఆన్‌ను గట్టిగా పట్టుకోవాలి. ఎటువంటి సందేహం ఉండకూడదు. అది సకల లోకాల ప్రభువు నుండి సత్యంతో అవతరించబడింది. మనకు సన్మార్గం చూపుతుంది.**

ఖుర్'ఆన్‌లో అర్థం కాని విషయాల వెనుక పడటం వలన, ఖుర్'ఆన్ వాక్యాలను వక్రీకరించి చెప్పేవారి మాటలు వినడం వలన సన్మార్గం నుండి దూరం అయ్యే అవకాశం ఉంది. ఖుర్'ఆన్ అనువాదాలలో ఎన్నో లోపాలు ఉన్నాయి. **అరబీ భాషలో ఉన్న ఖుర్'ఆన్‌ను పరిపూర్ణంగా మరో భాషలో అనువాదం చేయడం సాధ్యం కాదు.** కాబట్టి తఫ్సీర్ ఇబ్నె కసీర్ వంటి తఫ్సీర్ గ్రంథాలు చదవండి.

ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకోవాలి మరియు అర్థమైన వాటిని ఆచరణలో పెట్టాలి. ఖుర్'ఆన్ గురించి మరికొన్ని ఆయత్‌లు :

| **సన్మార్గం చూపేది, స్వస్థత నిచ్చేది మరియు కారుణ్యమే ఖుర్'ఆన్** |
| --- |
| "మరియు నిశ్చయంగా, ఇది విశ్వాసులకు **మార్గదర్శిని** మరియు **కారుణ్యం.**" (ఖుర్'ఆన్ 27:77) |
| "అలిఫ్-లామ్-మీమ్. ఇవి వివేకంతో నిండి ఉన్న గ్రంథ సూచనలు. సజ్జనులకు **మార్గదర్శకత్వమూ** మరియు **కారుణ్యమూ** ఉన్నాయి." (ఖుర్'ఆన్ 31:1-3) |
| "... ఇది విశ్వసించిన వారికి **మార్గదర్శకత్వం** మరియు **స్వస్థత నిచ్చేది** మరియు విశ్వసించనివారి చెవులకు అవరోధం మరియు వారి కళ్ళకు ఒక గంత ..." (ఖుర్'ఆన్ 41:44) |
| "ఇది మానవులకు అంతర్దృష్టి (పరిజ్ఞానం) ఇచ్చేది గానూ మరియు విశ్వసించే ప్రజలకు **మార్గదర్శకత్వంగానూ** మరియు **కారుణ్యంగానూ** ఉంది. (ఖుర్'ఆన్ 45:20) |

మనమంతా అల్లాహ్ తాడు (ఖుర్'ఆన్)ను గట్టిగా పట్టుకుంటే ఇన్షా అల్లాహ్, అల్లాహ్ కారుణ్యం మనపై ఉంటుంది మరియు మనం సన్మార్గంలో ఉంటాము. అప్పుడు ఇహలోకంలో సంతోషం మరియు పరలోకంలో శాశ్వత సుఖం లభిస్తాయి.

## 2. మరియు విడిపోకండి

**ముస్లిమ్ సమాజంలో ఐక్యత లోపించడానికి గల కారణాలు**

ఇదే సంచికలో ఖబ్బాబ్(రజి)వారి ఒక ఉల్లేఖనాన్ని "తిరిగి గూటికి" శీర్షికలో తెలిపాము. ఆ ఉల్లేఖనం ప్రకారం మూడు విషయాల గురించి ముహమ్మద్(స)వారు అల్లాహ్‌ను వేడుకుంటే, వాటిలో రెండు ఆమోదించ బడ్డాయి. మూడవది యైన 'ముస్లిముల మధ్య అంతర్ కలహాల విషయంలో' అవి సంభవించకుండా ఉండేందుకు చేసుకున్న వేడుకోలు ఆమోదించబడలేదు. దీనిని బట్టి స్పష్టమయ్యేది ఏమిటంటే, ముస్లిములు పరస్పరం కలిసి ఉండాలని మరియు గొడవ పడకూదనేది మన ప్రియ ప్రవక్త ముహమ్మద్(స)వారి కోరిక. ఆయన (స) కోరికకు వ్యతిరేకంగా **వివిధ జమాత్‌లుగా ఎందుకు చీలిపోవాలి?**

భవిష్యత్తులో జరగబోవు ఎన్నో విషయాలను ముహమ్మద్(స)వారు తెలిపారు. దానిలో ఒకటి ముస్లిమ్‌లు 73 వర్గాలుగా చీలిపోతారని, దానిలో ఒక వర్గమే స్వర్గంలో ప్రవేశిస్తుందని. భవిష్యత్తులో జరగబోవు ఒక దురదృష్టకరమైన సంఘటనను ముందుగా తెలిపారు. అంతేగాని **చీలిపోవడం సున్నత్ కాదు.** చీలిపోవడం అనేది దౌర్భాగ్యానికి సూచన. ఇది అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడి ఆదేశాలకు వ్యతిరేకం.

**చీలిపోతే ఘోరశిక్ష ఉంటుందని** ఖుర్'ఆన్ (3:105)లో అల్లాహ్ హెచ్చరించారు. క్రింది ఆయత్‌లు చూడండి :

> ఇలా అను: **"ఆయన మీపై నుండి గానీ లేదా మీ పాదాల క్రింది నుండి గానీ, మీపై ఆపద అవతరింప జేయగల సామర్థ్యం కలిగి ఉన్నాడు. మరియు మిమ్మల్ని తెగలు తెగలుగా చేసి, పరస్పర కలహాల రుచి చూపగలిగే (సామర్థ్యం కూడా) కలిగి ఉన్నాడు."** చూడు! బహుశా వారు (సత్యాన్ని) గ్రహిస్తారేమోనని, మేము ఏ విధంగా మా సూచనలను వివిధ రూపాలలో వివరిస్తున్నామో!" (ఖుర్'ఆన్ 6:65)

చీలిపోయి కలహించుకోవడం అనేది అల్లాహ్ విధించే శిక్షలలో **ఒక శిక్ష కారణంగా సంభవిస్తుంది.** అల్లాహ్‌కు మరియు ఆయన సందేశహరునికి విధేయత చూపితే కరుణించబడతారని ఖుర్'ఆన్‌లో చెప్పబడింది. **విధేయత చూపక పోవడం** వలన కారుణ్యానికి బదులుగా శిక్ష లభిస్తుంది.

**"మా జమాతే గొప్పది** మరియు **మా జమాత్ మాత్రమే స్వర్గానికి చేరుకుంటుంది"** అని ఓ సమూహం, **"మాదే ఆ వర్గం"** అంటూ

మరొక జమాత్ కలహించుకోవడం ఎన్నో సంవత్సరాలుగా ముస్లిమ్ సమాజంలో కనిపిస్తూనే ఉంది.

పై ఆయత్ ప్రకారం ఈ విధంగా కలహించుకోవడం **'అల్లాహ్ శిక్ష'** కాక మరేమిటి?

**అంటే ఈ విధంగా కలహించుకునేవారు అల్లాహ్ చే శిక్షింపబడు తున్నారని అర్థమౌతుంది.** ఎందుకు శిక్షింప బడుతున్నారో చెప్పుకున్నాం. మరో విధంగా చెప్పాలంటే **అల్లాహ్‌కు మరియు ఆయన సందేశ హరునికి విధేయత చూపేవారు, వివిధ జమాత్‌లుగా చీలిపోలేరు, ఇన్నా అల్లాహ్!**

అందరూ అల్లాహ్ ఒక్కరినే ఆరాధిస్తున్నప్పుడు, ముహమ్మద్(స) వారినే తమ సందేశహరునిగా స్వీకరించినప్పుడు, ఆయన(స) ఆదేశించిన వాటినే ఆచరిస్తే, సన్మార్గం పొందిన నలుగురు ఖలీఫాలను అనుసరిస్తే **బేధాలకు అవకాశం ఎక్కడుంది?**

అన్ని జమాత్‌ల మస్‌జిద్‌లలో ఫజ్ర్, జుహ్ర్, అస్ర్, మగ్‌రిబ్, ఇషా అనే 5 నమాజ్‌లు జరుగుతాయి. ప్రతీ నమాజ్‌కు ముందు అజాన్ ఇవ్వడం జరుగుతుంది. ఈ ఫరజ్ నమాజ్‌లలో చేసే రకాత్ సంఖ్యలో కూడా తేడా ఉండదు. ఇస్లామ్ మూలస్తంభాలు 5 అని వీరంతా ఆమోదిస్తారు. వీరందరికీ ఖుర్‌ఆన్ ఒక్కటే! సందేశహరుడు ఒక్కరే! **మరి బేధం ఎక్కడి నుండి వచ్చింది?**

**అహంకారం, స్వార్థం మరియు అధికార దాహాల నుండే బేధాలు పుట్టుకొస్తాయి.**

దుష్ట పన్నాగాలను పన్నే కపట విశ్వాసులను కట్టడి చేయనప్పుడు, వారి వలన షైతాన్ ప్రభావంతో బలహీన విశ్వాసం గలవారు భేదాలకు లోనై మోసపోతారు.

సామాన్య ప్రజలకు కొన్ని ధార్మిక విషయాలపై అవగాహన కలుగ నివ్వకుండా పెద్దలు జాగ్రత్త పడ్డారు. పడుతున్నారు.

**ఆ అవగాహనే గనుక సామాన్య ప్రజలకు కలిగిననాడు పెద్దల మేడలు కూలిపోతాయి.**

## ● చీలికలకు ఫిఖ్ కారణమా? ఎంతమాత్రం కాదు?

చాలామందికి ఫిఖ్ అంటే తెలియదు. ఏప్రిల్ మరియు మే-జూన్, 2013 సంచికలలో 10 పేజీలతో ఫిఖ్‌ను ఉదాహరణ పూర్వకంగా శాంతిబాటలో తెలియ జేశాము. ఫిఖ్ అంటే ఏమిటో తెలియకుండానే 'దాయీ' అనే నామకరణం స్వయంగా చేసేసుకుని అడుక్కోవడానికి బయలుదేరి పోతున్నారు. **ఐకమత్యాన్ని చెడగొడుతున్నారు.** వ్యాసం చివరిలో ఈ అంశం వివరంగా చెప్పడం జరిగింది.

ఖుర్‌ఆన్ మరియు హదీస్‌లను అర్థం చేసుకోవడమే ఫిఖ్ అని తెలియనివారు, ఇమామ్‌ల ఫిఖాలను అనుసరించ వద్దని, ఖుర్‌ఆన్ మరియు హదీస్‌లనే అనుసరించమని చెబుతున్నారు.

'ఫిఖా' వచ్చిందే ఖుర్‌ఆన్ మరియు హదీస్ నుండి. మరి ఫిఖాను ఎందుకు వద్దంటున్నారు? **కారణం వీరికి ఫిఖ్ అంటే అవగాహన లేకపోవడమే!**

ఒక విద్యార్థికి ఎల్.కె.జి. నుండి దేశంలోని అత్యున్నత స్థాయి విద్య నభ్యసించేవరకూ, ఎందరో టీచర్లు బోధిస్తారు. హైస్కూలులో పాఠాలు చెప్పే టీచర్‌కి, యూనివర్శిటీలో పాఠాలు చెప్పే టీచర్‌కి జ్ఞానంలో చాలా వ్యత్యాసం ఉంటుంది. (ఫిఖ్ వ్యాసం చదవండి)

**టీచర్లు అనేవారు ఒక వ్యక్తికి జ్ఞాన సముపార్జనలో సాధనాలుగా ఉపయోగ పడతారు.** ఒక స్థాయికి చేరుకున్న తరువాత టీచర్ అవసరం లేకుండా అధ్యయనం చేస్తూ జ్ఞానాన్ని సంపాదించుకునే అవకాశం ఉంటుంది. ఈ జ్ఞానం ద్వారా పొందిన వివేకంపై ఆధారపడి మనం నిర్ణయం తీసుకోవాలి.

## ● ఇమామ్‌లను గుడ్డిగా అనుసరిస్తున్నారా? నిజమా?

ఖుర్‌ఆన్ ముత్తఖీలకు మార్గదర్శకత్వం. సన్మార్గంలో ఉండటానికి మరియు పరలోక సాఫల్యం పొందడానికి ప్రతీ ముస్లిమ్ 'ముత్తఖీ' కావాలి. క్రింది ఆయత్ చూడండి :

"నిశ్చయంగా, అల్లాహ్ యొక్క దాసులలో **జ్ఞానం గలవారు మాత్రమే ఆయనకు భయపడతారు.** నిశ్చయంగా అల్లాహ్ సర్వశక్తివంతుడు, క్షమాశీలుడు" (ఖుర్‌ఆన్ 35:28)

పై ఆయత్ ప్రకారం జ్ఞానం గలవారు మాత్రమే 'ముత్తఖీ'లు అవుతారు. **కాబట్టి ప్రతీ ముస్లిమ్‌కి జ్ఞానం అవసరం.** జ్ఞానం కోసం 4 గురి ఇమామ్‌లలో ఒకరైన షాఫ'ఇ(ర)వారు ఎంత కష్టపడ్డారో 'జకాత్' ప్రత్యేక వ్యాసంలో చదివారు. చిన్నతనంలో గురువుగారికి ఫీజు చెల్లించే స్థోమత లేక గోడ పక్కనుండి గురువుగారు చెప్పేది వినేవారు. తరువాత ఎందరో గురువుల దగ్గర విద్య నేర్చుకున్నారు. ఉన్నత విద్య కోసం ఉన్న ఊరు విడిచారు. నలుగురు ఇమామ్‌లలో ఒకరైన మాలిక్(ర) వారు షాఫ'ఇ(ర)వారికి గురువుగారు.

**ప్రతీ ఇమామ్ ఎందరో గురువుల దగ్గర జ్ఞానాన్ని పొందారు.**

ఉదాహరణకు బుఖారీ(ర)వారు దాదాపు 45 మంది గురువుల దగ్గర జ్ఞానాన్ని నేర్చుకున్నారు.

ఇమామ్ ముస్లిమ్(ర), ఇమామ్ తిర్మిజీ(ర) మొదలైన వారు బుఖారీ(ర)వారి సమకాలీనులే! (వీరంతా ఒకే కాలంలోని వారే)

**ఈ ఇమామ్‌ల మధ్య వ్యక్తిగత విబేధాలు లేవు.** ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా ధార్మిక జ్ఞానాన్ని అందించాలని వారంతా తపించారు. గురువులు శిష్యులను గౌరవించడమే కాకుండా వారితో ఫిఖ్ విషయంలో చర్చిస్తూ ఉండేవారు.

బుఖారీ(ర)వారి దగ్గరకు ముహద్దిస్ కావాలనే ఉద్దేశ్యంతో శిష్యునిగా చేరడానికి వచ్చిన అల్-వలీద్ బిన్ ఇబ్రాహీమ్ గారితో ముహద్దిస్ కావడంలో ఎదురయ్యే కష్టాల గురించి వివరించారు. మరియు 'ఫిఖ్'పై పనిచేసి, ఆ రంగంలో ప్రావీణ్యం సాధించమని బుఖారీ(ర)వారు ఆయనకు సలహా ఇచ్చారు. అయితే అప్పటికే ఎందరో 'ఫిఖ్' రంగంలో పనిచేసారు. (ఈ విషయం వివరంగా 'హదీస్ విజ్ఞానం' శీర్షికలో ఇదివరకే తెలియజేశాము.)

**హదీస్ సేకరణ పూర్తయిపోయింది. కాని 'ఫిఖ్' రంగంలో కృషి ఖయామత్ వరకూ జరుగుతూనే ఉంటుంది, ఇన్షా అల్లాహ్!**

అంటే దీని అర్థం ధర్మంలో కొత్త విషయాలు వస్తాయని కాదు. ఎందుకంటే ధర్మాన్ని అల్లాహుతాలా పరిపూర్ణం చేసేసారు. **ఫిఖ్ వలన ధర్మావగాహన ఇన్షా అల్లాహ్ ఇంకా సులభం అవుతుంది.** అంటే తక్కువ స్థాయి జ్ఞానం గలవారు కూడా మరికాస్త సులభంగా అర్థం చేసుకోగలుగుతారు. అల్లాహ్ మార్గంలో ఎంతో శ్రమించి జ్ఞాన సంపదను అందించిన ఇమామ్‌లందరికీ అల్లాహ్ అమితంగా అనుగ్రహించు గాక! (ఆమీన్)

నలుగురు ఇమామ్‌లలో ఒకరైన అహమద్ బిన్ హంబల్(ర)వారికి ఇమామ్ బుఖారీ(ర)వారు తన సహీహ్ హదీస్ గ్రంథాన్ని ఇచ్చారు. **ఈ ఇమామ్‌లు అందరూ ఒకే జమాత్.**

ఇమామ్ అహమద్ బిన్ హంబల్(ర)వారు జన్మించిన దాదాపు 30 సంవత్సరాలకు బుఖారీ(ర)వారు జన్మించారు. ఇమామ్ అహమద్(ర)వారు మరణించిన 15 సంవత్సరాల తరువాత బుఖారీ (ర)వారు మరణించారు. అంటే ఇమామ్ అహమద్(ర) మరణించే సమయానికి బుఖారీ(ర)వారి వయస్సు సుమారు 47 సంవత్సరాలు.

ఇమామ్ అహమద్ బిన్ హంబల్(ర)వారు బుఖారీ(ర)వారి కోసం చెప్పిన మాటలు : **"ఖరాసాన్ ప్రాంతం ఏ వ్యక్తినీ అందించలేదు ముహమ్మద్ బిన్ ఇస్మా'ఈల్ (బుఖారీ-ర)వారికి సమానంగా."**

హదీస్‌లను గొప్పగా కంఠస్థం చేసిన వారి గురించి ఇమామ్ అహమద్ బిన్ హంబల్(ర)వారిని ఆయన కుమారుడు అబ్దుల్లాహ్ గారు అడిగినప్పుడు, ఆయన చెప్పారు : "ఖరాసాన్ ప్రాంతం నుండి ఓ యువకుడు (బుఖారీ-ర). అతడు వారిలో ఒకరు." మరియు ఆ విధంగా ఆయన చాలా పేర్లు చదివి వినిపించారు, ఆయన ఇమామ్ బుఖారీ(ర)వారి పేరునే మొట్టమొదటగా చెప్పారు.

ఇమామ్ బుఖారీ(ర)వారు సహీహ్ హదీస్‌లను గ్రంథస్థం చేసిన తరువాత, ఇమామ్ ముస్లిమ్(ర)వారు కూడా ఒక హదీస్ గ్రంథాన్ని వ్రాసారు. తరువాత ఇమామ్ తిర్మిజీ, ఇమామ్ ఇబ్నెమాజా మొదలైన వారందరూ హదీస్‌లను గ్రంథస్థం చేశారు. ఒకొక్కరిది ఒకొక్క శైలి. ఆ గ్రంథాలను అధ్యయనం చేస్తే ఆ విషయం స్పష్టంగా అర్థమౌతుంది.

అదే విధంగా 'ఫిఖ్'ను కూడా తమ జ్ఞానపరిధిలో ఎందరో ఇమామ్‌లు అందించారు. వీరంతా ధర్మం విషయంలో చాలా నిజాయితీగా, కఠినంగా వ్యవహరించారు.

**'ఉలూ : ఒక సనద్‌లో ఉల్లేఖకుల సంఖ్య తక్కువయ్యేకొద్దీ, ఆ హదీస్ యొక్క ఔన్నత్యం పెరుగుతూ ఉంటుంది.**

అందువల్లనే ముహద్దిస్‌లు ఈ '**ఉలూ**ను సాధించడం కోసం ఎన్నో కష్టతరమైన ప్రయాణాలు చేశారు. తన కాలంలోనే జీవించియున్న ఓ వ్యక్తి సనద్‌లో ఉన్నాడని తెలిసిన వెంటనే, ప్రత్యక్షంగా అతని నుండే ఆ హదీస్‌ను వినడానికి ప్రయాణం మొదలయ్యేది.

**ఇమామ్ అహమద్ బిన్ హంబల్(ర)వారు ఉన్నత స్థాయి ఇస్నాద్‌ను పొందడానికై చేసే అన్వేషణను సున్నత్‌గా పేర్కొన్నారు.**

'మీ కోరిక ఏమిటి?' అని ఆయనను అడిగినప్పుడు, **"ఖాళీగా ఉండే ఇల్లు మరియు ఉన్నత స్థాయి ఇస్నాద్."** అని చెప్పారు. అంటే ఈ ఇమామ్ గారు ప్రామాణికంగా ఉండే హదీస్‌లు అందించాలని మరియు నిరాడంబరంగా జీవించాలనే కోరుకున్నారు.

ఫిఖ్‌లో వ్యత్యాసాలుండటం సహజం. అది కూడా ఒక అనుగ్రహమే!

ఈ వ్యత్యాసాలకు కారణాలను ఫిఖ్ వ్యాసంలో వివరించాము. ఇమామ్ బుఖారీ(ర)వారు ముహద్దిస్ మాత్రమే కాదు, ఫఖీ కూడా.

ఈ ఇమామ్‌లలో ఎవ్వరూ కూడా తమ ఫిఖ్‌నే అనుసరించమని ఎవరినీ బలవంత పెట్టలేదు. **ఫిఖ్‌ను గుడ్డిగా అనుసరిస్తున్నారని అనేవారే నిజానికి గుడ్డివారు.**

చాలామందిలో మరొక ఘోరమైన అపోహ ఉంది. బుఖారీ(ర)వారే మొదటిసారిగా 'సహీహ్' మరియు 'దయీఫ్' హదీస్‌లుగా వర్గీకరణ చేసినట్లు భావిస్తున్నారు. అది నిజం కాదు. అంతకు పూర్వం నుండే ఇమామ్‌లు 'సహీహ్' హదీస్‌లను దయీఫ్ నుండి వేరుచేయడానికి చాలా కఠినంగా మరియు నిజాయితీగా పనిచేసారు.

కేవలం సహీహ్ హదీస్‌లతోనే ఒక గ్రంథం చేస్తే బావుంటుందనే గురువుగారి కోరికను ఇమామ్ బుఖారీ(ర)వారు నెరవేర్చారు. ఈ వివరాల కోసం ఇదివరకే 'హదీస్ విజ్ఞానం'లో అందించిన వ్యాసాలను చదవండి.

## ముహద్దిస్‌లను, ఫఖీలను దూషించడం హేయమైన పని

వివిధ జమాత్‌లకు చెందిన కొందరు తమ కలహాలలో ఒకరి నొకరు దూషించు కునేటప్పుడు, ముహద్దిస్‌లను మరియు ఫఖీలను దూషిస్తున్నారు. ఇది చాలా హేయమైన విషయం.

**ఫిఖ్ విషయంలో చర్చలు అనేవి ఒక జ్ఞాన స్థాయిని అధిగమించిన వారి మధ్యనే జరగాలి. సామాన్య ప్రజలు ఈ పరిధిలోనికి రారు కాబట్టి ఫిఖ్‌లోని బేధాల కారణంగా సామాన్య**

**ప్రజలు చీలిపోవలసిన అవసరం లేదు. ఖుర్'ఆన్ మరియు హదీస్‌లను అర్థం చేసుకోవడం (ఫిఖ్) చాలా ముఖ్యమైన విషయం.**

**ఆరాధనా పద్ధతులలోని వ్యత్యాసాలు చాలా సూక్ష్మమైనవి. కాని వాటిని భూతద్దంలో చూపిస్తూ ముస్లిములలో అయోమయాన్ని కలుగ జేయడానికి ప్రయత్నిస్తున్నారు.**

**ఇమామ్‌లు జ్ఞాన సంపదను మనకు అందించారు. ఆ జ్ఞానసంపద నుండి వీలైనంత నేర్చుకుని మనం ముత్తఖీలు కావాలి.**

ఫిఖ్ వ్యాసంలో ఖుర్'ఆన్ మరియు హదీస్‌లలో ప్రస్తావించబడిన ఏదైనా ఓ విషయాన్ని సహాబాలు ఎలా అర్థం చేసుకున్నారో, ఆ విధంగా అర్థం చేసుకోవడంలోని వ్యత్యాసాలను ఉదాహరణ పూర్వకంగా వివరించడం జరిగింది. అయితే ఈ వ్యత్యాసాల వలన ఒక విశ్వాసికి తన దైనందిన జీవితంలో వచ్చే సమస్య ఏమీ లేదు. ఈ సందర్భానికి సరిపోతుంది కాబట్టి ఫిఖ్ వ్యాసంలో లేని మరో ఉదాహరణను దిగువున ఇస్తున్నాము.

**మరో ఉదాహరణ :**

ధర్మపరాయణుడైన సహాబీ అబూజర్(రజి)వారి గురించి 'తిరిగి గూటికి' శీర్షికలో ఇది వరకే చెప్పుకున్నాము. సమాజంలో చెడు కనిపిస్తే, ఆయన ఖుర్'ఆన్ వాక్యాలతో ఆ చెడును ఖండించేవారు. కాబట్టి కొందరికి ఈయన వలన చాలా ఇబ్బందులు కలిగేవి.

ఉస్మాన్(రజి)వారి ఖిలాఫత్‌లో సిరియాకు వెళ్ళవలసిందిగా ఆయన ఆదేశించ బడ్డారు. అబూజర్(రజి)వారు ఎక్కడికి వెళ్ళినా చెడుపై ఆయన పోరాటం ఆగదు.

సిరియా దేశ గవర్నర్ కూడా ఉస్మాన్(రజి)వారి బంధువే. ఆయన విచక్షణ గలవాడు. ఆయన తెలివిగా ఐశ్వర్యాన్ని మరియు అధికారాన్ని తన స్వంత మనుషుల చేతిలో, చాలా వరకూ బంధువుల చేతిలో మరియు నమ్మకమైన తన స్నేహితుల చేతిలో ఉంచారు. ఈ విషయంలో అబూజర్(రజి) తన నిరసన తెలిపారు.

**''ము'ఆవియా (రజి) ఎంతో తెలివైనవాడు. ప్రభుత్వ ఖజానాన్ని బంగారం మరియు వెండితో నింపేస్తూ, అది అల్లాహ్ సొమ్ము అని చెబుతున్నాడు! ఎందుకని? అది ప్రజల సొమ్ము మరియు దానిని వారి మధ్య ఖచ్చితంగా వెంటనే పంచాలి.''**

ఈ వాదన ప్రజల్లోకి బలంగా వెళ్ళింది.

**కపటం లేకుండా మాట్లాడే ఈ ప్రవక్త సహచరుని చుట్టూ ప్రజలు చేరారు.**

ము'ఆవియా(రజి)వారు అసహాయుడై పోయారు. అబూజర్ (రజి) వారిని ఆయన నియంత్రించలేరు. ఎందుకంటే అబూజర్(రజి)వారికి ఏ అధికార పదవి లేకపోయినా, నిరుపేద అయినా సరే ఆయనకున్న గౌరవ స్థాయి చాలా పెద్దది. ఇక లాభం లేదనుకుని అబూజర్(రజి) వారిని వెనక్కి పిలవమని ము'ఆవియా(రజి)వారు ఉస్మాన్(రజి) వారిని అభ్యర్థిస్తూ లేఖ వ్రాశారు.

ఈ సందర్భంగా జైద్ బిన్ వహబ్ గారి ఉల్లేఖనాన్ని ఇక్కడ అందిస్తున్నాము (సహీహ్ బుఖారీ, 1406, 24వ పుస్తకం, అధ్యా. 4, సంపుటి 2) :

> నేను **రబజ** అనే ప్రదేశం ప్రక్కగా వెళుతూ అనుకోకుండా అబూజర్‌ని కలిశాను మరియు ఆయనని అడిగాను, ''**మిమ్మల్ని ఏ విషయం ఇక్కడకు తీసుకు వచ్చింది?**'' ఆయన చెప్పారు, ''నేను సిరియాలో ఉండగా ము'ఆవియా(రజి)తో (క్రింది ఖుర్'ఆన్ ఆయత్) అర్థంతో విబేధించాను''
>
> **''ఓ విశ్వాసులారా! నిశ్చయంగా, చాలామంది అహ్‌బార్‌లు మరియు రుహ్‌బానులు (గ్రంథ ప్రజలలోని ధార్మిక నాయకులు) ప్రజల సొత్తును అక్రమ పద్ధతుల ద్వారా తిని వేస్తున్నారు మరియు వారిన అల్లాహ్ మార్గం నుండి ఆటంక పరుస్తున్నారు. మరియు ఎవరైతే వెండి బంగారాన్ని కూడబెట్టి, దానిని అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టరో వారికి బాధాకరమైన శిక్ష కలదనే వార్తను వినిపించు.** (ఖుర్'ఆన్ 9:34)

ము'ఆవియా (రజి) అన్నారు: '**ఈ వాక్యం గ్రంథ ప్రజలకు సంబంధించి అవతరించింది.**'

నేను చెప్పాను: '**మనకు సంబంధించి అవతరించింది మరియు గ్రంథప్రజలకు కూడా.**'

కాబట్టి మా మధ్య గొడవ జరిగింది. ము'ఆవియా(రజి) నాకు వ్యతిరేకంగా 'ఉస్మాన్' (రజి)వారికి ఫిర్యాదు చేశారు. ఉస్మాన్(రజి) నన్ను మదీనాకు రమ్మని లేఖ వ్రాశారు. మరియు నేను మదీనా వచ్చాను. చాలామంది నన్ను చూడటానికి వచ్చారు, (ఏ విధంగా నంటే) వారు నన్ను ఇంతకు ముందెన్నడూ చూడనివిధంగా.

కాబట్టి నేను ఈ విషయాన్ని ఉస్మాన్(రజి)వారికి చెప్పాను. ఆయన నాతో అన్నారు, మీరు వెళ్ళవచ్చు లేదా మీరు కోరితే దగ్గరలో ఉండవచ్చు''.

నేనిక్కడ ఉండటానికి అదే కారణం. అబిసీనియా వ్యక్తిని నాకు పాలకునిగా నియమించినా సరే, నేను అతనికి విధేయత చూపుతాను'.

ము'ఆవియా(రజి)వారితో ఒక ఆయత్ విషయంలో విబేధించిన అబూజర్(రజి)వారి గురించి ప్రవక్త(స)వారు ఏమి చెప్పారో చూడండి:

> **''ఆకాశం క్రింద మరియు భూమిపైన అబూజర్(రజి) కంటే ఎక్కువ సత్యవంతుడు లేడు.''** (ఇబ్నెమాజా, 156, సంపుటి 1)

మరి అబూజర్(రజి) మరియు ము'ఆవియా(రజి) మధ్య విబేధం

**మరొక జమాత్‌కు దారితీసిందా?** జ్ఞానంలో మేటి అయిన ఉమర్(రజి) వారు తన కంటే వయస్సులో చిన్నవారైన ఇబ్నె అబ్బాస్(రజి)వారి సలహా తీసుకునేవారు.

ఒక విషయాన్ని అర్థం చేసుకోవడంలో ఒకరి కంటే మరొకరికి జ్ఞానం ఎక్కువ ఉంటుందని ముహమ్మద్(స)వారే స్వయంగా చెప్పారు. ప్రతీ విషయంలోనూ ఒక వ్యక్తి మరొక వ్యక్తి కంటే అధికం కాకపోవచ్చు. కొన్ని విషయాలలో ఒకరికి జ్ఞానం ఎక్కువైతే, మరికొన్ని విషయాలలో మరొకరికి జ్ఞానం ఎక్కువ. **వీరందరూ అందించిన జ్ఞాన సంపదను పొందిన భాగ్యవంతులం మనం.** ఈ సంపదను మనం సద్వినియోగం చేసుకోగలిగితే ఇహలోకంలో సంతోషం మరియు పరలోకంలో శాశ్వత సుఖం లభిస్తుంది, ఇన్షా అల్లాహ్!

**కాబట్టి ఫిఖ్ వలన వివిధ జమాత్‌లుగా ముస్లిములు చీలిపోలేదు. ఆ చీలికలకు కారణాలు వేరు.**

## ముహమ్మద్(స)వారి కాలం నుండి ముస్లిమ్ సమాజాన్ని చీల్చడానికి కపట విశ్వాసులు చేసిన ప్రయత్నాలు

- రెండు సమూహాల మధ్య

**ముహాజిరీన్‌లు మరియు అన్సారుల మధ్య ఐక్యతను నాశనం చేయడానికి జరిగిన ప్రయత్నం**

మక్కా నుండి కట్టుబట్టలతో మదీనా చేరిన ముహాజిరీన్‌లను, అక్కడి అన్సారులు హృదయపూర్వకంగా ఆహ్వానించారు. తాము కలిగి ఉన్న ప్రతీ దానిలో సగభాగాన్ని ముహాజిరీన్‌లకు ఇవ్వడానికి మనస్ఫూర్తిగా ఇష్టపడ్డారు. అనూహ్యమైన సోదరబంధం వారి మధ్య ఏర్పడింది. ఇది అసాధారణమైన విషయం.

మదీనాలో ఉన్న కపట విశ్వాసులు ఆ ఐక్యతను చూసి భరించ లేకపోయారు. కాబట్టి వీరి ఐక్యతను పాడు చేయడానికి వారు ఎన్నో ప్రయత్నాలు చేసారు.

మునాఫిక్‌లను (కపట విశ్వాసులను) గుర్తించడం మామూలుగా అయితే కష్టమైన పనే! **ఎందుకంటే అంత గొప్పగా వారు నటిస్తారు.** విశ్వాసులను మోసం చేస్తారు. అయితే విశ్వాసులకు వారిని అల్లాహుతాలా స్పష్టం చేస్తారు, ఇన్షా అల్లాహ్!

బనీ ముస్తలిఖ్ తెగ ముస్లిమ్‌లపై యుద్ధ సన్నాహాలు చేస్తున్న విషయం తెలుసుకుని ముహమ్మద్(స)వారు తన వారితో యుద్ధానికి బయలుదేరారు. కపట విశ్వాసులు కూడా ఈ యుద్ధంలో పాల్గొన్నారు. అల్లాహ్ తప్పకుండా తన ప్రవక్తకు సహాయం చేస్తారనే విషయం కపట విశ్వాసులకు తెలుసు కాబట్టి, యుద్ధప్రాప్తిలో వాటాగా ఐశ్వర్యం లభిస్తుందనే ఉద్దేశ్యంతో వారు కూడా యుద్ధంలో పాల్గొన్నారు.

యుద్ధం ముగిసింది. అల్లాహ్ కారుణ్యంతో ముస్లిములు గెలిచారు.

ఈ యుద్ధం ముర్రైసీ అనే బావి దగ్గర జరిగింది. నీటి విషయంలో అక్కడే **ఓ ముహాజిర్** మరియు **ఓ అన్సార్** మధ్య తగాదా జరిగింది. అంటే **ఇద్దరు ముస్లిముల మధ్య జరిగిన తగాదా ఇది.** ఒక ముహాజిర్, ఒక అన్సార్ పిరుదులపై తన్నాడు. అన్సార్ వ్యక్తి గాయపడ్డాడు. ఆ అన్సార్ తన తోటి అన్సారులను మరియు ముహాజిర్ తన తోటి ముహాజిర్లను పిలవడం జరిగింది. ఈ విషయం ప్రవక్త(స)వారికి తెలియజేయబడింది.

ఆయన(స) వెంటనే గొడవ జరిగిన చోటుకు వెళ్ళి "**అజ్ఞాన కాలపు నినాదం ఏమిటి?**' (అంటే రక్షణ కోసం ప్రాంతం, జాతి, తెగల ఆధారంగా పిలుస్తారా?)

**'ఆ నినాదాన్ని వదిలేయండి. అది ఏహ్యమైనది.'**

ప్రతీ ముస్లిమ్ తన తోటి ముస్లిమ్‌కు సహాయం చేయాలి. అతడు అణచివేసేవాడైనా లేక అణిచివేతకు గురైనా వాడైనా సరే. అణచివేతకు గురియైనవానికి సహాయం అందించడం అంటే స్పష్టంగా అర్థమౌతుంది. కాని అణిచేవాడికి సహాయం అందించడమంటే ఏమిటి? అతనిని ఆ పని నుండి ఆపడమే అతనికి చేసే సహాయం.

**ప్రవక్త(స)వారి మాటల వలన ఆ తగాదా సమసిపోయింది.** ఆ తగాదాకి కారణమైన ఇద్దరిలో ఒకరైన ఆ ముహాజిర్ పేరు జహ్జా (రజి) మరియు అన్సార్ పేరు 'ఇబ్నె వబ్రా అల్-జుహనీ' (రజి). ఈ తగాదాలో ముహాజిర్ దోషమే ఎక్కువ ఉంది. అన్సార్ వ్యక్తి గాయపడ్డాడు. ఉబాదా బిన్ సామిత్(రజి) అనే సహాబీ ఆ అన్సారీకి విషయాన్ని వివరించారు. అతను అర్థం చేసుకుని జహ్జా(రజి)ని క్షమించమని కోరాడు. ఈ సంఘటనలో అణచినవాడు మరియు అణిచివేతకు గురియైన వారిద్దరూ సోదరులైపోయారు.

ముందుగానే చెప్పుకున్నాం, కపట విశ్వాసులు యుద్ధసంపదలోని వాటాపై అత్యాశతోనే ముస్లిమ్‌లతో కలిశారని. ఆ కపట విశ్వాసులకు నాయకుడు - 'అబ్దుల్లాహ్ బిన్ ఉబై' (లేదా ఇబ్నె ఉబై).

ఇతర కపటవిశ్వాసులు చెప్పుకునే విధంగానే ఇహలోక ప్రయోజనాల కోసమే ఇతను కూడా తనను ముస్లిముగా చెప్పు కుంటాడు . కాని అతడు తన హృదయంలో రసూలుల్లాహ్(స) మరియు ముస్లిములపై శతృత్వాన్ని కలిగి ఉన్నాడు.

**ముహాజిర్లు మరియు అన్సారుల మధ్య జరిగిన తగాదాను గొప్ప అవకాశంగా భావించి వారి మధ్య ఘర్షణ పెంచాలనుకున్నాడు.**

కాబట్టి అతడు తన తోటి కపట విశ్వాసులతో మరియు అన్సారులతో సమావేశం ఏర్పాటుచేశాడు. అయితే, అన్సార్‌ల నుద్దేశించి **రెచ్చగొట్టే** ప్రసంగం **చేశాడు: "ఇదంతా మీపైకి మీరే**

**తెచ్చుకున్నారు. వారిని మీ భూభాగంలో చేర్చుకున్నారు. మీ సంపదను వారితో పంచుకుని, వారు మీచే పోషించబడి బలంగా తయారై మీపైనే తిరగబడుతున్నారు. మీ జీవితాలను దయనీయంగా మార్చు కున్నారు.కాబట్టి భవిష్యత్‌లో ముహాజిర్లను వదిలేసి వారికి సహాయం చేయకుండా ఉంటే వారు ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోతారు".**

"అల్లాహ్ సాక్షి!, మనం మదీనా నగరానికి తిరిగి వెళ్ళిన తరువాత, నిశ్చయంగా గౌరవనీయులమైన (మనం), అక్కడ వున్న తుచ్ఛమైన వారిని తప్పక వెడలగొడ్దాం."

ఇతడు తన స్వంత కపట వర్గాన్ని మరియు అన్సారులను **'గౌరవ నీయులు గాను'**, (అల్లాహ్ క్షమించాలి) ప్రవక్త(స)వారిని మరియు ముహాజిర్‌లను **'అల్పమైనవారు'గానూ** వర్ణించాడు.

అక్కడే ఉన్న జైద్ బిన్ అర్ఖమ్(రజి) ఇతని ప్రసంగం విని, వెంటనే అతని మాటలను తిప్పి కొట్టారు. **"అల్లాహ్ సాక్షి! నీవే అల్పబుద్ధి గలవాడివి. నీచమైన మరియు హేయమైనవాడివి. ముహమ్మద్(స)వారు అల్లాహ్ వలన గౌరవం పొంది మరియు ముస్లిములు చూపే ప్రేమతో విజేత అయ్యారు."**

(ఈ విధంగా ఏదో రోజు కపటవిశ్వాసులకు అవమానం జరుగుతుంది.)

అబ్దుల్లాహ్ బిన్ ఉబై అతని కపటత్వాన్ని పైకి తెలియకుండా జాగ్రత్త పడేవాడు. కాబట్టి జైద్ బిన్ అర్ఖమ్(రజి) నుండి తీక్షణమైన ఎదరుదెబ్బ తగిలేసరికి, తన కాపట్యం బయటపడిపోతుందని అర్థం చేసుకుని జైద్ బిన్ అర్ఖమ్(రజి)ను క్షమాపణకోరి తాను కేవలం తమాషాగా అన్నానని నమ్మబలికాడు. దాని అర్థం రసూలుల్లాహ్ (స)వారికి వ్యతిరేకంగా చెప్పినట్లు కాదని సర్ది చెప్పాడు.

కాని జైద్ బిన్ అర్ఖమ్(రజి) ఆ సమావేశాన్ని వదిలి రసూలుల్లాహ్(స) వారికి ఈ విషయాన్ని చేరవేశారు. **ఈ విషయం ప్రవక్త(స)వారిని కలత చెందేలా చేసింది.** ఆ సమయానికి జైద్ బిన్ అర్ఖమ్(రజి) నవ యువకుడు. కాబట్టి ప్రవక్త(స)వారు అడిగారు : **"ఓ అబ్బాయి! నీవు అబద్ధం ఆడటం లేదు కదా!"** జైద్ బిన్ అర్ఖమ్(రజి) అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెప్పారు: "నేను ఈ మాటలను నా చెవులారా విన్నాను."

ప్రవక్త(స) అతనితో అన్నారు : **"నీవు ఇది అనుమానంతో చెప్పడం లేదుగా?"** జైద్ బిన్ అర్ఖమ్(రజి) మరలా అదే సమాధానం చెప్పారు.

ఈ వార్త ముస్లిమ్ సైన్యం అంతటా తెలిసిపోయింది. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. తన జాతి గౌరవించే నాయకునిపై జైద్ బిన్ అర్ఖమ్(రజి) అపనింద వేశాడని మరియు ఆ నాయకునితో బాంధవ్యాన్ని వేరు చేసుకున్నాడని కొందరు అన్సారులు అన్నారు.

జైద్ బిన్ అర్ఖమ్(రజి) అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెప్పారు:

**'ఖజ్‌రజ్ తెగ మొత్తంలో ఇబ్నె ఉబై (అంతవరకూ) తనకు చాలా ప్రియమైన వాడు. కాని అతడు రసూలుల్లాహ్(స)వారికి వ్యతిరేకంగా బాధకలిగించే పదాలు పలికినప్పుడు నేను తట్టుకోలేక పోయాను. అతను ఒకవేళ నా తండ్రియైనా సరే, నేను ప్రవక్త(స) వారికి అతను మాట్లాడిన దానిని గురించి తెలియ జేస్తాను."**

విశ్వాసం అంటే ఇదే! తాను ప్రేమించే వారందరి కంటే ముహమ్మద్ (స)వారి గౌరవ మర్యాదలే ముఖ్యం విశ్వాసికి. అరబ్బులు తండ్రిని చాలా గౌరవించేవారు.

ఈ విషయం ప్రవక్త(స)వారికి తెలియజేయ బడినప్పుడు, ఆయనతో ఉమర్(రజి) ఉన్నారు.

**ఉమర్**(రజి) అన్నారు : **"ఓ రసూలుల్లాహ్!(స) ఈ కపట విశ్వాసి శిరస్సు ఖండించడానికి అనుమతి నివ్వండి."**

"అతనిని వదిలేయి లేకపోతే ప్రజలు ముహమ్మద్ తన సహచరులను చంపు కుంటున్నాడని అంటారు" అని ముహమ్మద్(స) వారు ఉమర్(రజి)వారిని శాంతపరిచారు.

ఉమర్(రజి)వారు అక్కడితో ఆగిపోలేదు. ఆకపట విశ్వాస నాయకుని కుమారుని దగ్గరకి వెళ్ళి జరిగిన విషయాన్ని చెప్పారు. కొడుకు మాత్రం నిజాయితీ పరుడు మరియు నిజమైన విశ్వాసి.

అతడు వెంటనే రసూలుల్లాహ్(స)వారి వద్దకు వెళ్ళి చెప్పారు:

**'నా తండ్రి అతను మాట్లాడిన మాటలకు చంపబడాలని మీరు కోరితే, అతనిని చంపడానికి నాకు అనుమతి నివ్వండి మరియు ఇక్కడ నుండి మీరు లేవడానికి ముందే అతని తలను మీ ముందుకు తీసుకువస్తాను. నా తల్లిదండ్రులకు ఎంతో విధేయుడుగా మరియు సేవ చేసేవాడిగా నాకంటే ఎక్కువ ఎవరూ లేరనే విషయానికి మొత్తం ఖజ్‌రజ్ తెగే సాక్షి! కాని నేను అల్లాహ్‌కు మరియు ఆయన సందేశహరుని (స)కి హానిచేసినవాడిని సహించలేను. మీరు గనుక మరెవరి నైనా నా తండ్రిని చంపమని అనుమతిస్తే, అతడు ఆయనని చంపుతాడు. తరువాత నేను నా తండ్రిని చంపిన వ్యక్తి స్వేచ్ఛగా నడిచి వెడుతుండగా చూసినప్పుడు, తెగ అసూయ నన్ను జయించి అతనిని చంపడానికి నన్ను ప్రేరేపించ వచ్చు. అది నన్ను శిక్షకు గురిచేస్తుందని నేను భయపడు తున్నాను.'**

రసూలుల్లాహ్(స)వారు చెప్పారు : "అతనిని చంపే ఉద్దేశ్యం నాకు లేదు, అతనిని చంపమని మరెవరికీ నేను ఆదేశించలేదు".

యుద్ధం నుండి తిరుగు ప్రయాణంలో సర్వసాధారణంగా ప్రవక్త(స) వారి అలవాటు ఏమిటంటే ఓ నిర్ణీత సమయంపాటు మార్గం మధ్యలో ఆగుతారు. అయితే ఈ సంఘటన జరిగాక, రసూలుల్లాహ్ (స)వారు

అలవాటుకు భిన్నంగా అసాధారణ సమయంలో వెంటనే మదీనా వైపు ప్రయాణం ప్రారంభించారు. ఆయన(స) తన ఒంటె ఖస్వా పై కూర్చుండి బయలుదేరారు. అందరూ అనుసరించారు.

ప్రవక్త(స)వారు కపట విశ్వాస నాయకున్ని అడిగారు **"నీవు ఇది చెప్పావా?" అతడు ప్రమాణం చేసి తనపై ఆరోపించబడిన ప్రతీ విషయాన్ని ఖండించాడు మరియు ఆ నవ యువకుడైన 'జైద్ బిన్ అర్ఖమ్'ని అసత్యవాది అని ప్రకటించాడు.**

అబ్దుల్లాహ్ బిన్ ఉబై తన తెగ వారికి గౌరవనీయమైన నాయకుడు కాబట్టి, ఆ తెగవారు 'ఇబ్నె ఉబై'ని 'జైద్ బిన్ అర్ఖమ్'(రజి) అపార్థం చేసుకున్నాడని భావించారు. ఇబ్నె ఉబై చేసిన ప్రమాణాన్ని రసూలుల్లాహ్(స) స్వీకరించారు కాబట్టి, జైద్ బిన్ అర్ఖమ్(రజి)పై ప్రజల మందలింపు ఎక్కువైంది. **ఇది ఆయనను కలవర పరిచింది.** ఆయన ఇతరులకు కనిపించకుండా ముఖం చాటేసారు.

ప్రవక్త(స) వారు తన మొత్తం సైనికులతో ఆ పగలు, రాత్రి మరియు తరువాతి రోజు ఉదయం కూడా ప్రయాణం చేశారు. సూర్యుడు బాగా తీక్షణం అయ్యాక, ఆయన(స) ఓ ప్రదేశంలో విడిది చేశారు. అందరూ బాగా అలసి పోవడంతో, ఎంతో సుదూరమైన మరియు పట్టువదలని ప్రయాణం వలన వారు నేలను తాకగానే, గాఢ నిద్రలోకి వెళ్ళిపోయారు.

ఈ అసాధారణ మరియు సుదూర ప్రయాణానికి కారణం ఏమిటంటే, జరిగిన సంఘటన గురించి పూర్తి సమయం పదే పదే అందరూ చెప్పుకోకుండా ముగింపు పలకడానికే కావచ్చు. విశ్రాంతి అనంతరం అల్లాహ్ యొక్క సందేశహరులు(స) తిరిగి ప్రయాణం ప్రారంభించారు.

ఉబాదా బిన్ సామిత్(రజి) అనే సహాబీ ఈ ప్రయాణంలో కపట విశ్వాసి - ఇబ్నె ఉబైని చేరి అతని తప్పును ప్రవక్త(స)వారి ముందు ఒప్పుకుంటే ప్రవక్త(స) అతని క్షమాపణ కొరకు అల్లాహ్‌ను ప్రార్థిస్తారని మరియు అతనికి మోక్షం కలుగుతుందని చెప్పి ఆ కపట విశ్వాసి మేలుకోరి సలహా ఇచ్చారు.

అతడు ఈ సలహా విని తన తలను తిప్పుకున్నాడు. అప్పటివరకూ కపట విశ్వాసి అయిన ఇబ్నె ఉబైకు వ్యతిరేకంగా ఏ ఖుర్'ఆన్ ఆయత్ కూడా అవతరించబడ లేదు. కాని అతడు అహంకారంతో పొగరుతో తలతిప్పు కోవడంతో ఉబాదా బిన్ సామిత్(రజి) అన్నారు : **"ఖచ్చితంగా, ఆ తిరస్కారానికి సంబంధించి ఖుర్'ఆన్ ఆయత్‌లు తెలియజేస్తాయి"** (చూడండి: ఖుర్'ఆన్ 63:5).

ప్రయాణంలో జైద్ బిన్ అర్ఖమ్(రజి)వారు మాటిమాటికి ప్రవక్త(స)వారి సమీపంలోకి వచ్చేవారు. మరియు అతని ధృఢ విశ్వాసమేమిటంటే, ఆ కపటవిశ్వాసి తన జాతి మొత్తం ముందు తనను కలవరపడేలా చేసి, తనను అసత్యవాది అన్నాడు కాబట్టి, **అల్లాహ్ నిశ్చయంగా తన నిజాయితీని బయటపెడతారని.**

విశ్వాసులకు అల్లాహ్‌పై ఉండే భరోసా అటువంటిది. ఆలస్యమైనా సత్యం వెలుగు చూస్తుంది.

ఇదే విషయంపై ప్రవక్త(స)వారిపై దివ్య సందేశం అవతరించ బడింది. జైద్ బిన్ అర్ఖమ్(రజి)కి కబురు పంపబడింది. ప్రవక్త(స)వారు జైద్(రజి)వారి చెవి పట్టుకుని అన్నారు : **"ఓ అబ్బాయి! నీ మాటల సత్యతని అల్లాహ్ ధృవీకరించారు."**

మొత్తం **'సూరహ్ మునాఫిఖూన్'** - ప్రారంభం నుండి చివరి వరకూ - ఇబ్నె ఉబయ్ సంఘటనకు సంబంధించి అవతరించ బడింది."

రసూలుల్లాహ్(స)వారు అఖీఖ్ లోయ దగ్గర మదీనా సమీపించి నప్పుడు, అబ్దుల్లాహ్ బిన్ ఉబై కుమారుడైన 'అబ్దుల్లాహ్' అన్ని వాహనాలు తనిఖీ చేస్తూ, తన తండ్రి ప్రయాణిస్తున్న వాహనాన్ని కూర్చోబెట్టి, ఒంటె మోకాళ్ళపై అతని పాదాన్ని ఉంచి తండ్రితో చెప్పాడు: **"అల్లాహ్ సాక్షి! నీవు మదీనాలోకి అడుగుపెట్టలేవు, రసూలుల్లాహ్(స)వారు అనుమతిస్తే తప్ప మరియు గౌరవనీయులైన మదీనా నివాసులెవరో, వెడలగొట్టబడే తుచ్ఛమైన వారెవరో స్పష్టం చేస్తే తప్ప.**

**చెప్పు! ఎవరు గౌరవనీయుడు, రసూలుల్లాహ్? లేక నీవా?"** తన తండ్రితో అతను అంత నిర్దయగా వ్యవహరిస్తున్నందుకు తోటి ప్రయాణీకులు 'అబ్దుల్లాహ్'(రజి)వారిని మందలించారు.

అప్పుడే రసూలుల్లాహ్ (స)వారి ఒంటె అక్కడికి వచ్చింది. ఆయన(స) అడిగారు ఏమి జరుగుతుందని. ప్రజలు చెప్పారు అబ్దుల్లాహ్ తన తండ్రి మదీనాలో ప్రవేశించడాన్ని అడ్డుకున్నారని, రసూలుల్లాహ్(స)వారు అనుమతిస్తే తప్ప వదలనంటున్నారని తెలియ జేశారు.

ప్రవక్త(స)వారు చూస్తుండగా ఆ కపట విశ్వాసి తన కుమారునితో, **తానే స్వయంగా మదీనా ప్రజలలో స్త్రీలు మరియు పిల్లల కంటే కూడా తుచ్ఛమైన వాడినని, మరియు వారందరిలోకి ప్రవక్త(స)వారే ఎక్కువ గౌరవనీయులని ప్రకటించాడు.**

అప్పుడు, రసూలుల్లాహ్(స)వారు అతని కుమారునితో చెప్పారు : **"అతనికి దారి వదులు, అతనిని ప్రవేశించ నివ్వు".** కుమారుడు అతనిని మదీనాలో ప్రవేశింపనిచ్చాడు.

- **ఒకే సమూహంలో ..**

**అన్సారులలోని ఔస్ మరియు ఖజ్‌రజ్ తెగల మధ్య ఐక్యతను నాశనం చేయడానికి జరిగిన ప్రయత్నం**

షమ్మాస్ బిన్ ఖైస్ అనే యూదుడికి ముస్లిముల పట్ల ఎంతో కాలంగా తీవ్రమైన ద్వేషముండేది.

ఒకసారి అన్సారులకు చెందిన రెండు తెగలవారు, **ఔస్** మరియు

**ఖజ్రజ్**, కలిసి ఒకచోట చాలా స్నేహంగా కూర్చుని ఉండటం చూసాడు. వారికి కీడు చేయాలనే ఆలోచన వానికి కలిగింది. వారి మధ్య గొడవ పెట్టాలని వెళ్ళాడు.

ఇస్లామ్‌కి పూర్వం ఈ రెండు తెగల మధ్య శతృత్వం ఉండేది. వీరి మధ్య యుద్ధాలు జరిగాయి. వారు తమ తెగల యొక్క గొప్పతనాన్ని వర్ణిస్తూ పద్యాలు చెప్పేవారు. **కాని ఇస్లామ్ వారి శతృత్వాన్ని రూపుమాపి ఒకటిగా చేసింది.** తమ తెగల గొప్పతనాన్ని తెలిపే ఆ పద్యాలను ఇరు తెగలవారు కూర్చుని చెప్పుకోవచ్చు కదా అని వారి మధ్య ఓ విష బీజాన్ని నాటాడు. అదే గనుక జరిగితే ఏం సంభవిస్తుందో వాడు ఊహించాడు. **కాని ఔస్ మరియు ఖజ్రజ్ తెగలవారు, దాని పర్యవసానం ఏమౌతుందో ఆలోచించ లేదు.**

ఆ పద్యాల పఠనం మొదలైనప్పుడు, వారి మధ్య బావోద్వేగాలు పెరిగి, చివరికి ఇరువురి మధ్య వాగ్వివాదాలు చోటు చేసుకున్నాయి. అవి హద్దులు దాటాయి, ఎలా అంటే అక్కడ ఓ కొత్త యుద్ధం ప్రారంభం కాబోతుంది అన్నట్లుగా.

ప్రవక్త(స)వారు ఇది వినగానే వారి దగ్గరకు వచ్చి అన్నారు : ''ఇదంతా ఏమిటి, నేను మీ మధ్య ఉండగనే మరియు మీరు ముస్లిములు అయిన తరువాత మరియు మీరంతా ఐక్యంగా మరియు పరస్పర స్నేహితులుగా మారిన తరువాత కూడా ఇది చేస్తారా? ఇది కేవలం అజ్ఞానం. మీరు ఈ స్థితిలో తిరిగి అవిశ్వాసం వైపుకు వెళ్లాలను కుంటున్నారా?''

ఆ హెచ్చరికను వారి మనస్సులు అందుకున్నాయి. షైతాన్ తమను తప్పుదారి పట్టించాడని అర్థం చేసుకున్నారు. **వారు ఒకరినొకరు కౌగలించుకున్నారు, విలపించారు మరియు పశ్చాత్తాప పడ్డారు.**

ఆ సందర్భంగా క్రింది ఆయత్‌లు అవతరించబడ్డాయి.

**"ఓ విశ్వసించిన ప్రజలారా! గ్రంథమివ్వబడిన వారిలోని ఓ వర్గాన్ని(వారి మాటలు విని) మీరు అనుసరిస్తే, వారు మిమ్మల్ని విశ్వసించిన తరువాత కూడా సత్యతిరస్కారులుగా మార్చి వేస్తారు.**

**మరియు అల్లాహ్ సందేశాలు మీకు చదివి వినిపించబడుతూ ఉన్నప్పుడు మరియు ఆయన సందేశహరుడు మీలో ఉన్నప్పుడు, మీరు ఎలా సత్యతిరస్కారులు కాగలరు? మరియు మీలో ఎవడు స్థిరంగా అల్లాహ్‌ను ఆశ్రయిస్తాడో, అతడు నిశ్చయంగా, ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం పొందినవాడే!** (ఖుర్ఆన్ 3:100-101)

ఒకవేళ నేడు అల్లాహ్ గ్రంథాన్ని మరియు ముహమ్మద్(స)వారి బోధనలను అర్థం చేసుకుని, వివిధ జమాత్‌లు తమ మధ్య ఉన్న సూక్ష్మ విబేధాలు పక్కన పెట్టి అల్లాహ్ అనుగ్రహం వలన, సోదర భావంతో కలిసి ఉంటే, మరలా వారి మధ్య శతృత్వాన్ని రెచ్చగొట్టడానికి కపటులు ప్రయత్నిస్తారు.

కాబట్టి విశ్వాసులు అల్లాహ్‌ను ఆశ్రయించాలి. అల్లాహ్‌కే భయపడాలి.

అప్పుడు ఏ కపట విశ్వాసి ఎంత ప్రయత్నించినా సరే, అల్లాహ్ నుండి మనకు రక్షణ ఉంటుంది.

నేడు మన మధ్య ముహమ్మద్(స)వారు భౌతికంగా లేకపోవచ్చు గాని ఆయన బోధనలు మన మధ్య సజీవంగానే ఉన్నాయి.

### • ఐక్యతను పాడుచేయడానికి జరిగిన మరో ప్రయత్నం

ప్రవక్త(స)వారి కాలంలో ఒకసారి ఖైస్ బిన్ ముతాతియహ్ అనే మునాఫిక్ (కపట విశ్వాసి) ముస్లిమ్ సమాజంలో వివిధ స్థాయిలలో ఉన్న ప్రజల మధ్య తిరస్కారం మరియు అనుమానాలను నాటాలని ప్రయత్నించాడు.

సల్మాన్ ఫార్సీ(రజి), సుహైబ్(రజి), బిలాల్(రజి) మరియు కొందరు ముస్లిములు కూర్చున్న చోటికి ఖైస్ వచ్చాడు. (ఈ ముగ్గురిని దృష్టిలో పెట్టుకుని) ఇలా వ్యాఖ్యానించాడు:

**"ఔస్ మరియు ఖజ్రజ్ తెగలు ఈ వ్యక్తి (ముహమ్మద్-స)కి దన్నుగా నిలిచారు. మరి వీరు ఆయనకు ఏమి చేస్తున్నారు?".**

(అంటే ఆ ప్రాంతంలో పేరు ప్రతిష్టలు ఉన్న రెండు తెగల ప్రజలు ముహమ్మద్(స)వారికి అన్ని విధాలా సహాయ పడుతున్నారు మరియు వీరు శరణార్థులుగా వేరే దేశాల నుండి వచ్చిన వారు, వీరికి ఏమి విలువుందనే విధంగా చులకన చేసి మాట్లాడాడు.)

అక్కడే ఉన్న ము'ఆజ్(రజి)వారికి అది వినగానే చాలా కోపం వచ్చింది.

ఆయన వెళ్ళి ప్రవక్త(స)వారికి ఖైస్ పలికిన మాటలు తెలియజేశారు. **ప్రవక్త(స) వారికి కూడా చాలా కోపం వచ్చింది.** ఆయన(స) మస్జిద్‌లో ప్రవేశించారు. అజాన్ ఇవ్వబడింది. ప్రజలకు ముఖ్య విషయం తెలపడానికి పిలుపు. ఆయన(స) లేచారు, అల్లాహ్ ఘనతను కొనియాడి చెప్పారు :

**"మీ ప్రభువు ఒక్కరు. మీ పూర్వీకుడు ఒక్కరు. మీ ధర్మం ఒక్కటి. జాగ్రత్త! అరబ్బీయం అనేది మీ తల్లి నుండిగాని మీ తండ్రి నుండి గాని ప్రధానం చేయబడదు. అది నాలుక ద్వారా (అంటే అరబీ భాష ద్వారా), కాబట్టి ఎవరైతే అరబీ మాట్లాడు తున్నారో, అతడు అరబ్."**

ముస్లిముల మధ్య ఐక్యతను నాశనం చేయడానికి జరిగిన ఎన్నో ప్రయత్నాలలో 3 ప్రయత్నాలను పైన వివరించడం జరిగింది.

**మన ఐక్యతను పాడుచేసే కపట విశ్వాసులు మనతోనే ఉంటారు.** వారు ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోరు. చిన్న చిన్న గొడవలను పెద్దవిగా చేస్తారు లేదా గొడవలను వారే కల్పించి, వాటిని ఇంకా రగిలిస్తారు.

అసాధారణమైన సోదర భావంతో స్నేహంగా ఉన్న ముహాజిరీన్ మరియు అన్సారులను విడదీయడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. ఆర్థికంగా, రాజకీయంగా ముహాజిరీన్‌లను దెబ్బ తీయడం ద్వారా ఒక్కటిగా కలిసిపోయిన రెండు ముఖ్యమైన సమూహాలను చీల్చడానికి ప్రయత్నించి విఫలమయ్యారు.

ముహాజిరీన్‌లను వదిలేసి, అన్సారులలోనే పరస్పరం గొడవలు రెచ్చగొట్టి విడగొట్టాలని వారు చేసిన మరో ప్రయత్నం కూడా విఫలమైంది.

అన్సారులను పొగుడుతూ, మరియు ముహాజిరీన్‌లలో అణగారిన స్థితి నుండి గౌరవ స్థాయికి చేరుకుని, వేరే భాషలకు చెందిన త్యాగధనులు బిలాల్(రజి), సల్మాన్ ఫార్సీ(రజి) మరియు సుహైబ్ రూమీ(రజి) వారిని అవమానిస్తూ విడగొట్టడానికి ప్రయత్నించారు. అది కూడా విఫలమైంది.

ఇవి ముహమ్మద్(స)వారు జీవించి ఉన్న కాలంలో జరిగిన సంఘటనలు. కాబట్టి వారికి హితబోధ చేసి ముహమ్మద్(స)వారు ఉపద్రవాలను నిరోధించారు. ఆ హితబోధ నేడు మనమధ్య కూడా ఉంది.

**నేడు కూడా కపట విశ్వాసులు ఆనాటి పన్నాగాలనే తిరిగి ఉపయోగించి కలిసి ఉన్న వివిధ ముస్లిమ్ జమాత్‌ల మధ్య ఐక్యతను పాడుచేస్తున్నారు.**

వివిధ జమాత్‌ల మధ్యనే కాకుండా ప్రతీ జమాత్‌లోనూ మరలా కొత్తగా చీలికలు చేయడానికి కృషి చేస్తున్నారు.

బిలాల్(రజి)వారిని, సల్మాన్ ఫార్సీ(రజి)వారిని, సుహైబ్ రూమీ(రజి) వారిని వేరు చేస్తూ ఆనాడు ఓ మునాఫిక్ ఎలా అయితే ప్రవర్తించాడో, నేడు కూడా కొందరు అదేవిధంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మన రాష్ట్రంలో తెలుగు భాష మాట్లాడేవారి కొరకు ప్రత్యేకంగా లేక నవముస్లిముల కొరకు ప్రత్యేకంగా మస్జిద్‌లను నిర్మించాలనే విషబీజాన్ని నాటారు.

సన్మార్గం పొందిన నలుగురు ఖలీఫాలు ఇస్లామ్ స్వీకరించినవారే. వారి కోసం ప్రత్యేకంగా ఒక మస్జిద్ మరియు ముస్లిమ్ కుటుంబాలలో పుట్టినవారి కోసం వేరే మస్జిద్‌లు **ఆనాడు ఏర్పాటు చేసారా? లేదు కదా!**

**ధనదాహం మరియు దుర్మార్గం ఇంకా ఎన్ని చీలికలకు కారణం అవుతాయో! ముస్లిమ్ సమాజాన్ని రక్షించమని అల్లాహ్‌ను వేడుకుందాం!**

### అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు ఖలీఫాగా ఉన్న కాలంలో ...

జకాత్ చెల్లించడానికి కొందరు నిరాకరించారు. వారిపై మరియు తమను తాము ప్రవక్తలుగా ప్రకటించుకున్న అసత్య ప్రవక్తలపై యుద్ధాన్ని ప్రకటించి వారిని నియంత్రించి దారిలో పెట్టారు.

### ఉమర్(రజి)వారు ఖలీఫాగా ఉన్న కాలంలో ...

ఉమర్(రజి)వారు ఒక దారిలో వస్తుంటే, షైతాన్ వేరే దారిలో పోతాడనే విషయం ప్రవక్త(స)వారి ద్వారా మనకు తెలిసిన విషయమే! ఈయన కాలంలో ఏ మునాఫిక్‌కు కూడా ధైర్యం చాలలేదు. విద్రోహుల కుట్రలు ఈ ఖిలాఫత్‌కు దూరంగా ఉన్నాయి.

### ఉస్మాన్(రజి)వారి మరియు అలీ(రజి)వారి ఖిలాఫత్‌లో ...

వీరి కాలంలో కపట విశ్వాసులు విజృంభించారు. ఎన్నో వివాదాలకు కారణ మయ్యారు. ఉస్మాన్(రజి)వారి కాలంలో చెడుపై పోరాడే అబూజర్(రజి)వారు, రబజ అనే ప్రదేశంలో ఉన్నప్పుడు, ఆయనను తమ వైపు తిప్పుకుని ఉస్మాన్(రజి) వారిపై తిరుగుబాటు చేయాలని కూఫా లోని కపట విశ్వాసులు ఆయనను అడిగారు.

అబూజర్(రజి) తన సత్యసంధత మరియు ధృడస్వరంతో వారికి చెప్పారు, ఖలీఫా తనను హింసించినా కూడా ఆయనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయనని మరియు ఖలీఫా ఆయనను ఎక్కడికైనా వెళ్ళమంటే ఆయనకు మరో అవకాశం లేదు ఖలీఫాకు విధేయత చూపడం కంటే.

ఈ ఖిలాఫత్ కాలంలో కపట విశ్వాసుల కారణంగా ఎన్నో ఉపద్రవాలు సంభవించాయి.

## పాశ్చాత్యుల పన్నాగాలు

**సన్మార్గం నుండి విడిపోయి వేరే జమాత్‌లు ఏర్పడటం, కొన్నాళ్ళకే అవి కాల గర్భంలో కలిసి పోవడం గతంలో జరిగింది.**

పూర్వం ఒక వర్గం ఇస్లామ్ నుండి విడిపోయి కొత్త ధర్మంగా ప్రజలలోకి వెళ్ళింది. ముస్లిములంతా దానిలోకి వెళ్ళిపోతారనుకున్న పాశ్చాత్యుల ఊహలకు ఎదురుదెబ్బ తగిలింది.

ముస్లిములు కాకుండా క్రైస్తవులతో సహా ముస్లిమేతర ధర్మాల వారే ఆ ధర్మంలోకి ఎక్కువగా వెళ్ళడం జరిగింది. దానికి కారణం ఏమై ఉంటుందోనని వారు అన్వేషించారు.

పూర్తిగా ఇస్లామ్ నుండి విడిపోయి వేరే ధర్మంగా పరిచయం కావడం వల్లనే అలా జరిగిందని తెలుసు కున్నారు.

కాబట్టి పాశ్చాత్యులు తమ పూర్వీకులు ఉపయోగించిన పాత పన్నాగాలనే పన్నారు. అసత్య ప్రవక్తలను బరిలోకి దింపారు.

గత శతాబ్దంలో పాకిస్తాన్‌లో ఒక వ్యక్తి తనను తాను ప్రవక్తగా

ప్రకటించుకోవడం జరిగింది. ఇతడు ఇస్లామ్‌లోనే ఉన్నట్లుగా ఉండి, ముహమ్మద్ (స)వారిని ప్రవక్తగా చెబుతూనే, తనను ఆయన(స) తరువాత వచ్చిన ప్రవక్తగా ప్రకటించుకున్నాడు. మన పంజాబ్‌లోని ఎందరో అమాయక ముస్లిములు మోసపోయారు. బ్రిటిష్‌వారి సహకారంతో ఇదంతా జరిగింది. కాని ఆ తరువాత ముస్లిమ్ సమాజం సత్యం తెలుసుకుంది.

ఇతని వలే ప్రవక్తనని ప్రకటించుకున్న మరో వ్యక్తి కొన్ని సంవత్సరాల క్రితం అమెరికాలో హత్య చేయబడ్డాడు.

ముస్లిమ్ సమాజాన్ని ముక్కలుగా చేయడానికి బ్రిటిష్ వారు చాలా పరిశోధన చేశారు. వారికి స్పష్టమైన విషయాలు రెండు.

1. **ఖుర్‌ఆన్ వాక్యాలను మార్చడానికి ముస్లిములు ఒప్పుకోరు.** అది సాధ్యం కాదు. ఎందుకంటే అది అల్లాహ్‌చే రక్షింపబడుతుంది. కాబట్టి ఖుర్‌ఆన్ వాక్యాల అర్థాలను వక్రీకరించైనా ముస్లిమ్ సమాజాన్ని చీల్చాలని నిర్ణయించుకున్నారు. ఆ పనిని వారు స్వయంగా చేయలేరు. ఆ పని ఆలిమ్‌ల చేతనే చేయించాలి.
2. **ముహమ్మద్(స)వారు అంటే ముస్లిములకు అమితమైన ప్రేమ.** కాబట్టి ఆ మహనీయుని అమోఘమైన శీలంపై దుష్ప్రచారం చేయించాలని నిర్ణయించు కున్నారు.

ఖుర్‌ఆన్ వాక్యాలను, హదీస్‌లను వక్రీకరించడానికి ధన వ్యామోహం గల కొందరు ఆలిమ్‌లను ఎన్నుకున్నారు. **నేడు కూడా ఇటువంటి ఆలిమ్‌లు ఎందరో మన సమాజంలో ఉన్నారు.** ముహమ్మద్ (స)వారిపై దుష్ప్రచారాన్ని కూడా ముస్లిముల పేర్లతో ఉన్న కొందరు కపట విశ్వాసుల ద్వారా చేయిస్తున్నారు.

> ఈ పాపకార్యాలు మన రాష్ట్రంలో జరుగుతున్నంత స్థాయిలో మరొక రాష్ట్రంలో జరగడం లేదని అనిపిస్తుంది. ఈ కపట విశ్వాసులు అన్ని జమాత్‌ల లోకి తమ మనుష్యులను చొప్పించడమే కాకుండా, ఆ విధంగా చొప్పించబడిన వారిలో కొందరిని ఆయా జమాత్‌లలో ముఖ్య పదవులలో కూడా కూర్చుండ బెట్టారు.

వీరి పన్నాగాన్ని శాంతిబాట ఏనాడో బయటపెట్టింది. ముహమ్మద్ (స)వారిపై ఏ విధంగా దుష్ప్రచారం జరుగుతుందో ఓ పుస్తకాన్ని ప్రచురించి దాని ద్వారా ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం కూడా జరిగింది. **www.saanthibaata.net** నుండి ఈ పుస్తకం డౌన్‌లోడ్ చేసి చదువుకోవచ్చు. ఆ వాస్తవాలు తెలుసుకున్నప్పటికీ ఏ జమాత్ కూడా ముందుకు రాలేదు. **కారణం ఏమిటి?** రోజు తినడానికి కనీస స్థోమత లేని కపట విశ్వాసులు ఖరీదైన కార్లు, భవంతులు ఎలా పొందగలిగారు? ఐశ్వర్యాన్ని ఎలా సంపాదించగలిగారు?

### ముస్లిమేతరులలో ద్వేషాన్ని పెంచడానికి జరుగుతున్న కార్యక్రమమే - డిబేట్

### ముహమ్మద్(స) ముందుగానే ముస్లిములను హెచ్చరించారు :

గ్రంథప్రజలు 'తౌరాత్'ను హెబ్రూలో చదివి, దానిని అరబీ భాషలో ముస్లిములకు వివరిస్తుండేవారు. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "**గ్రంథప్రజలు చెప్పేది నిజమని గాని, అబద్ధమని గాని చెప్పవద్దు.** కాని (బదులుగా) చెప్పండి, 'మేము అల్లాహ్‌ను మరియు ఏదైతే మాపై అవతరింపబడిందో దానిని మరియు ఏదైతే మీపై అవతరింప బడ్డాయో వాటిని విశ్వసిస్తున్నాము". (సహీహ్ బుఖారీ, నెం. 7362, సంపుటి 9, పుస్తకం 96, అధ్యా.25, అబూహురైరా(రజి) ఉల్లేఖనం)

**అల్లాహుతాలా ఖుర్‌ఆన్‌లో ఇలా హెచ్చరించారు**

> **ఓ విశ్వసించిన ప్రజలారా! గ్రంథమివ్వబడిన వారిలోని ఓ వర్గాన్ని(వారి మాటలు విని) మీరు అనుసరిస్తే, వారు మిమ్మల్ని విశ్వసించిన తరువాత కూడా సత్యతిరస్కారులుగా మార్చి వేస్తారు.** (ఖుర్‌ఆన్ 3:100)

**ప్రస్తుతం అదే జరుగుతుంది.** అల్లాహ్ హెచ్చరికను పెడచెవిని పెట్టి గ్రంథప్రజల మాటలనే నేడు వింటున్నారు. గ్రంథప్రజలు డిబేట్లకు రమ్మని పిలుస్తున్నారు. **వారి మాట విని వీరు వెళు తున్నారు.** వారు ముస్లిముల చేత ఇతర గ్రంథాలలోని ఫలానా వాక్యం **నిజం** మరియు ఫలానా వాక్యం **అబద్ధం** అని చెప్పిస్తున్నారు.

దీని వలన ఇస్లామ్ విరోధులకు కలిగే రెండు ప్రయోజనాలు :

1. పై హదీస్‌లోని ముహమ్మద్(స)వారి ఆదేశాన్ని తిరస్కరించేలా చేసి ముస్లిమలను తప్పుదారి పట్టించడం.
2. ఇతర గ్రంథాలను విమర్శించేలా చేయడం ద్వారా ఆయా ధర్మాల వారికి ముస్లిముల పట్ల ద్వేషం పెరిగేలా చేయడం.

> **ఈ డిబేట్స్‌లో ఖుర్‌ఆన్ వాక్యాలను వక్రీకరించడం, వాటి పట్ల వ్యంగ్యంగా మాట్లాడటం, ముహమ్మద్(స)వారి అమోఘమైన శీలంపై అపనిందలు వేయడం జరుగుతుంది.**

పదుల సంఖ్యలోనో లేక వందల సంఖ్యలోనో లేక వేల సంఖ్యలోనో ముస్లిములు అక్కడ కూర్చుని జరుగుతున్న డిబేట్‌ను చూస్తుంటారు. కాని ఆ సమయంలో వారికి **క్రింది ఖుర్‌ఆన్ ఆయత్‌లు జ్ఞాపకం రావేమో!**

మరియు మా ఆయత్‌లను గురించి వారు వృథా మాటలు (దూషణలు, వక్రీకరణలు, వెక్కిరింపులు) చేస్తూ ఉండటం నీవు చూస్తే, **వారు తమ ప్రసంగం మార్చేవరకు నీవు వారి నుండి దూరంగానే ఉండు.** మరియు ఒకవేళ షైతాన్ నిన్ను మరపింపజేస్తే, జ్ఞప్తికి వచ్చిన తరువాత **అలాంటి దుర్మార్గులైన వారితో కలిసి కూర్చోకు.** (ఖుర్‌ఆన్ 6:68)

మరియు వాస్తవానికి మీ కొరకు ఈ గ్రంథంలో అవతరింప

జేశాడు: "**ఒకవేళ మీరు అల్లాహ్ యొక్క ఆయత్‌లను గురించి తిరస్కారాన్ని మరియు పరిహాసాన్ని వింటే,** అలా చేసేవారు ఇతర సంభాషణ ప్రారంభించనంతవరకు మీరు వారితో కలిసి కూర్చోకండి!" అలా చేస్తే **నిశ్చయంగా, మీరు కూడా అలాంటివారే!** నిశ్చయంగా అల్లాహ్ కపట విశ్వాసులను మరియు సత్యతిరస్కారుల నందరినీ నరకంలో జమచేస్తాడు. (ఖుర్'ఆన్ 4:140)

**చూశారా! ఏ విధంగా ముస్లిమ్ సమాజం మోసపోతుందో! గ్రంథ ప్రజల ద్వారా ఏ విధంగా దారి తప్పుతుందో!**

సకల లోకాల ప్రభువు అల్లాహ్ నుండి ప్రజలకు మార్గ దర్శకంగా ఖుర్'ఆన్ అవతరించింది. దానిలో సందేహం లేదు. **మరెందుకు డిబేట్?** జ్ఞానంలో మేటి ఉమర్(రజి)వారు. ఆయన ఖలీఫాగా ఉన్న కాలంలో ఆయన దగ్గర క్రైస్తవ బానిస ఉండేవాడు. అతనిని ఆయన ఇస్లామ్ స్వీకరించమన్నారు. అతను ఇష్టపడలేదు. ఆయన అతనిని బలవంతం చేయలేదు. "ధర్మంలో బలవంతం లేదు" అనే ఖుర్'ఆన్ వాక్యాన్ని అతనికి వినిపించారు. ఉమర్(రజి)వారు తన జ్ఞానంతో ఎటువంటి వాదన చేయలేదు.

ఈ డిబేట్స్ విషయాన్ని శాంతిబాట పాఠకులు పోలీసులకు ఫిర్యాదు చేస్తుండటంతో, ఇప్పుడు ఎవరికీ తెలియకుండా రహస్యంగా వారి వారి ఇండ్లలో డిబేట్స్ ఏర్పాటుచేసుకుని రికార్డ్ చేస్తున్నారు. వీటికోసం ప్రత్యేకంగా స్టుడియోలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఈ సిడిలను ప్రజలలోకి వదులుతున్నారు. **ప్రజలను అశాంతికి గురిచేస్తున్నారు.**

ఈ దుష్ట కార్యక్రమాల ద్వారా ఇరువైపులవారు డబ్బు బాగా సంపాదిస్తున్నారు.

**"మూడు గ్రంథాలతో సందేశం" పేరుతో తప్పుదారి పట్టించడం మరియు అల్లాహ్ పేరు లేకుండా చేయాలని చేస్తున్న ప్రయత్నాలు.**

అల్లాహ్ ఖుర్'ఆన్‌లో ఇలా చెప్పారు :

"... **ఆయన** (అల్లాహ్) **దీనితో** (ఖుర్'ఆన్‌తో) **తాను కోరిన వారికి మార్గదర్శకత్వం చేస్తాడు** ..." (ఖుర్'ఆన్ 39:23)

ఖుర్'ఆన్ ద్వారానే అల్లాహ్ హిదాయత్ ఇస్తాను అని చెప్పినప్పుడు, మూడు గ్రంథాలతో సందేశ ప్రచారం చేయాలనుకోవడం అల్లాహ్ వాక్యాన్ని తిరస్కరించడమే!

అంతేకాకుండా **ఖుర్'ఆన్ చాలదా?** అని అల్లాహుతాలా చెప్పినా సరే, దానిని కూడా పెడచెవిని పెట్టారు.

"ఏమీ? వాస్తవానికి మేము నీపై అవతరింప జేసిన **ఈ గ్రంథం (ఖుర్'ఆన్) వారికి వినిపించ బడుతుంది కదా! ఇది వారికి చాలదా?** నిశ్చయంగా ఇందులో విశ్వసించే ప్రజలకు కారుణ్యం మరియు హితబోధలున్నాయి. (ఖుర్'ఆన్ 29:51)

**కాబట్టి ధర్మసందేశ ప్రచారం పేరుతో బయట జరుగుతున్నది తిరస్కారమా? లేక పన్నాగమా? మీరే ఆలోచించండి!**

గ్రంథప్రజల కుటిల పన్నాగాల వలన మరియు **వారి మాట విని వారిని అనుకరిస్తూ ఇప్పటికే ఎందరో సన్మార్గాన్ని వదిలేసారు.** పేద ప్రజలకు వెళ్ళవలసిన ధనం స్వార్థపరులకు మరియు కపట విశ్వాసులకు వెళ్ళిపోతుంది.

ఇక అల్లాహ్ పేరును లేకుండా చేయాలని వారు ఎంత ప్రయత్నించినా, అది వారికి సాధ్యం కాదు.

ముస్లిములు ఈ దేశంలో ఎన్నో ధర్మాల వారితో కలిసి జీవిస్తున్నారు. వారితో సామరస్యంగానే ఉన్నారు. ఆ సామరస్యాన్ని నాశనం చేయడానికి మరియు ముస్లిమ్‌ల పట్ల ద్వేషం పెరగడానికి , ధర్మ సందేశ ప్రచారం ముసుగులో ప్రయత్నాలు ఎలా జరుగుతున్నాయో తెలుసుకున్నాము. **ఇది దేశవ్యాప్తంగా జరుగుతూ ఉంది.** అయితే ప్రపంచ వ్యాప్తంగా కూడా ముస్లిముల పట్ల ద్వేషం పెరగడానికి గత 20 సంవత్సరాలుగా పాశ్చాత్యులు కక్కిన విషం గురించి ప్రపంచ ప్రజలకు ఇంకనూ తెలియవలసి ఉంది. క్లుప్తంగా ఆ విషయాలు :

**ముస్లిములపై ప్రపంచ వ్యాప్తంగా విద్వేషం కలిగించాలని అమెరికా పన్నిన పన్నాగం :**

**'టెర్రరిస్టులు అందరూ ముస్లిములే'** అని ఓ విష ప్రచారాన్ని అమెరికా మరియు దానికి అనుబంధంగా పనిచేసే అటువంటి ధూర్త దేశాలు ప్రారంభించాయి. **ప్రపంచ ప్రజలు నమ్మారు.** మీడియా కూడా విశేషంగా ఆ ప్రచారం ప్రజల మధ్య నిత్యం ఉండేలా చేసింది. అంతా కలిసి ముస్లిములకు ఆవేదన కలిగించారు.

'శాంతిబాట'లో ధూర్తదేశాల దుష్టపన్నాగాలకు సంబంధించి వాస్తవాలను అందించాము. ఈ వాస్తవాల కోసం మేము స్టింగ్ ఆపరేషన్స్ ఏమీ చేయలేదు. ఎవరినీ ఇంటర్వ్యూలు చేయలేదు. వారు ఏ విషయాలనైతే ప్రచురించి ముస్లిముల పట్ల చెడు ప్రచారం చేసారో, వాటితోనే వారి దుష్ట పన్నాగాలను వివరించాము. రెండు సంవత్సరాల పాటు 'టెర్రరిజమ్' అనే శీర్షికలో ఎన్నో పరిశోధక వ్యాసాలను అందించాము.

టెర్రరిస్ట్ అనే పదాన్ని మొట్ట మొదట ఉపయోగించిన దగ్గర నుండి 1940 వరకూ ప్రపంచంలో జరిగిన ఎన్నో తీవ్రవాద దాడుల గురించి వివరించాము మరియు వాటిలో ఏ ఒక్కటి కూడా ముస్లిమ్ చేసినది కాదు. మరి టెర్రరిస్ట్‌లందరూ ముస్లిములు ఎలా అయ్యారు?

ఓ మూడు దశాబ్దాల క్రితం మన దేశంలో సిక్ఖు సోదరులను టెర్రరిస్టులుగా చిత్రీకరించారు.

తీవ్రవాదానికి సంబంధించి ఎన్నో గణాంకాలను అందించాము (రెండు సంవత్సరాలలో ప్రచురించిన వ్యాసాలు చదవండి)

**99.99** శాతం ముస్లిములకు మరియు తీవ్రవాదానికి సంబంధం లేనప్పుడు, తీవ్రవాదాన్ని ముస్లిములకు ఎలా ముడిపెట్టారు?

'అల్-ఖైదా' ప్రపంచానికి పెను ముప్పు అని రంకెలు వేసేది 'అమెరికా' దేశమే. ఆ దేశమే ఓ సంస్థను స్థాపించి దానికి అల్-ఖైదా అనే నామకరణం చేసిందని ఎంతమందికి తెలుసు? **ముస్లిములకు కూడా ఆ విషయం తెలియదు.** ఆ సంస్థలోకి ఎందరినో చేర్చుకుని, వారికి ఆర్థిక సహకారం అందించి, అమెరికా భూభాగంలోనే వారికి సిఐఎ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వబడిందని ఎందరికి తెలుసు?

అమెరికాలోని 'ట్విన్ టవర్స్'ను అమెరికా ప్రభుత్వమే కూల్చివేసి ఆ నిందను మాత్రం అల్-ఖైదాపై మరియు బిన్‌లాడెన్‌పై మోపిందని చెప్పడానికి ఎన్నో బలమైన ఆధారాలున్నాయి. బిన్ లాడెనే చేయించాడని తెలిపే సాక్ష్యం తన దగ్గర ఉందని బుష్ ప్రపంచాన్ని నమ్మించాడు.

కాని వారి దేశంలోని అత్యున్నత నేర పరిశోధనా సంస్థ F.B.I. వారు తమ దగ్గర అటువంటి సాక్ష్యం లేదన్నారు. (శాంతిబాటలో ఆ విషయాలు ఆధారాలతో సహా ప్రచురించ బడ్డాయి). ఆ టవర్స్ కూలిన సంవత్సరంలోనే బిన్ లాడెన్ అనారోగ్యంతో మరణించినట్లు అంతర్జాతీయ పత్రికలలో కూడా వార్తలు వచ్చాయి. **కాని ఈ మధ్యనే ఆయనను పాకిస్తాన్‌లో చంపినట్లు డ్రామా ఆడారు.**

మన ముంబయిలో 26/11 దాడికి మూల కారకుడు డేవిడ్ హెడ్లీ. అతడు అమెరికా ప్రభుత్వం తరపున పనిచేస్తున్నాడని ఒకసారి అమెరికాయే ప్రకటించింది. అతడు అమెరికన్ ఏజెంట్ అనడంలో ఎటువంటి సందేహమూ లేదు. అతడు టెర్రరిస్ట్ అని స్వయంగా అతని భార్య F.B.I.కి ఫిర్యాదు కూడా చేసింది. అయినా సరే, హెడ్లీని ఎయిర్ పోర్ట్‌లలో తనిఖీ చేయరు. అతడు అమెరికా నుండి పాకిస్తాన్ మరియు ఇండియాకు స్వేచ్ఛగా తిరగగలడు. కాని షారూక్ ఖాన్, అబ్దుల్ కలామ్ మొదలైన వారిని మాత్రం అనుమానంతో తనిఖీ చేసేవారు. **టెర్రరిస్ట్‌గా ఫిర్యాదు చేయబడిన వ్యక్తిని స్వేచ్ఛగా ఎలా వదిలారు?**

ఐక్యరాజ్య సమితి పంపిన నిపుణుల కమిటీ ఇరాఖ్‌లో వినాశకర ఆయుధాలు లేవని నివేదించినా సరే, అమెరికా దానిని తిరస్కరించి ఇరాఖ్‌పై పిచ్చి మృగంలా విరుచుకు పడింది. వినాశకర ఆయుధాలు లేవని తరువాత చెప్పింది. **టెర్రరిస్ట్‌లు ఎవరు? టెర్రరిస్టులను తయారు చేస్తున్న దెవరు?**

అమెరికా ప్రభుత్వమే ఓ పెద్ద టెర్రరిస్ట్. మానవ సమాజానికి పెను ప్రమాదం. అమెరికా రక్తపాతం సృష్టిస్తుంది. కాని ఆ రక్తపు మరకలను ముస్లిములకు అంటిస్తుంది. **మోసం అనేది పాశ్చాత్యులకు వెన్నతో పెట్టిన విద్య. అల్-ఖైదా సంస్థ అమెరికా ప్రభుత్వానిదే.**

మన దేశంలో కూడా ఈ మధ్య వినిపిస్తున్న 'ఇండియన్ ముజాహిదీన్' అనే సంస్థ ముస్లిములది కాదని, ఇక్కడి ఓ మతతత్వ రాజకీయ పార్టీకి సంబంధించినది అనే అనుమానాలు కూడా ప్రజలలో ఉన్నాయి. ఈ వాస్తవాలు కూడా ఏదో ఒక రోజు బయట పడతాయి.

ఎందరో ముస్లిమ్ యువకులు తప్పుడు కేసులతో జైళ్ళలో మగ్గుతున్నారు. **కాని వివిధ జమాత్‌లుగా చీలిపోయిన ముస్లిములు అటువంటి వారిని పట్టించు కోవడం లేదు.**

ఇరాఖ్‌పై యుద్ధం జరిగినప్పుడు, ఇతర ముస్లిమ్ దేశాలు చూస్తూ ఉన్నాయి. అదే విధంగా ఏదైనా ముస్లిమ్ దేశంపై ఎవరైనా దాడిచేస్తే మిగిలినవారు మౌనంగానే ఉంటారు.

**ఒక్కసారి ఇస్లామీయ చరిత్ర తిరగేయండి.**

అల్లాహ్ మరియు ఆయన సందేశహరునికి విధేయత చూపిన కాలంలో **మహా సామ్రాజ్యాలే ముస్లిములకు లొంగిపోయాయి.** ఆనాటి ముస్లిముల ఆర్థిక పరిస్థితి నేటి ముస్లిముల కంటే కూడా చాలా తక్కువ. అప్పటి ముస్లిముల సంఖ్య కూడా చాలా తక్కువ.

వందల సంవత్సరాలుగా తెగలుగా విడిపోయి శతృత్వాన్ని కలిగి ఉన్నవారిని ఇస్లామ్ కలిసిపోయేలా చేసి వారిని ఐక్యంగా ఉంచింది. వారు యూనివర్శిటీలు స్థాపించారు, పరిశోధనలతో కూడిన ఆధునిక సైన్స్‌ను ఆరంభించారు. 5 శతాబ్దాలపాటు స్వర్ణయుగాన్ని ప్రపంచానికి చూపారు. **అటువంటి నాగరికత ఈనాడు ఏమైపోయింది?**

## మన తక్షణ కర్తవ్యం?

క్రింది ఆయత్‌లో మనందరినీ అల్లాహ్ ఆదేశించినట్లు చేయాలి.

**వాస్తవానికి విశ్వాసులు ఒకరికొకరు సహోదరులు. కావున మీ సహోదరుల మధ్య సంధి చేయించండి. మరియు మీరు కరుణించ బడాలంటే అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి.** (ఖుర్ఆన్ 49:10)

1. ఆరాధనా పద్ధతులలోని వ్యత్యాసాలు చాలా సూక్ష్మమైనవి. **అవి ముస్లిముల ఐక్యతకు ఏ విధంగానూ అడ్డంకి కావు.** కాబట్టి వివిధ జమాత్‌ల మధ్య ఐక్యత కోసం కృషి చేయాలి. ఏ జమాత్‌కు చెందిన వారైనా సరే, ఇతర జమాత్‌లకు చెందినవారు తమ సోదరులే అని ఆచరణలో చూపాలి. జమాత్‌ల మధ్య ఐక్యతకై మనం కృషి చేస్తే, మునాఫిక్‌లు ఊరికినే కూర్చోరు. ఆ ఐక్యతను నాశనం చేయడానికి వారు కూడా ప్రయత్నిస్తారు, ఏ విధంగానైతే కలిసిపోయిన ఔస్, ఖజ్‌రజ్ తెగల మధ్య తిరిగి విరోధం కలిగేలా ప్రయత్నించారో.
2. ప్రతీ జమాత్‌వారు తమ జమాత్‌లోకి చొరబడిన కపట విశ్వాసులను

ముందుగా గుర్తించాలి. జమాత్‌పై విపరీతమైన ప్రేమ ఉన్నట్లు నటిస్తూ, **ఇస్లామ్ కోసం కాకుండా** జమాత్ కోసమే అంకితమైనట్లు, ప్రతీ దానిపై జమాత్ ముద్ర ఉండాలని పట్టుబట్టే వారి పట్ల జాగ్రత్తగా ఉండండి. అటువంటివారు మునాఫిక్‌లు కావచ్చు. జాగ్రత్తగా గమనించండి. **అదే నిజమైతే అటువంటి వారి నోటిని అదుపులో పెట్టాలి.** అటువంటి వారిని నియంత్రించాలి. ఖుర్‌ఆన్ గ్రంథం మరియు ముహమ్మద్(స)వారి బోధనలు తెలిపే హదీస్ గ్రంథాలు ముస్లిమ్ ఉమ్మత్‌కు చెందినవి. వాటిపై ఎటువంటి ముద్రలు ఉండవు. **అవి అందరివి.**

3. వేరే రాష్ట్రాల నుండి ఏదో ఒక పేరుతో డబ్బు దండుకోవడానికి వచ్చే వైట్ కాలర్ బిచ్చగాళ్ళు ఆంధ్రప్రదేశ్‌కు రావడం ఆనవాయితీ అయిపోయింది. వారు జుమ్మా ప్రసంగాలు తీసుకోవడం మరియు మైక్ చేతికి అందగానే, ఇతర జమాత్‌ల పట్ల విషం కక్కడం అలవాటై పోయింది. ఆ వచ్చినవారు తమ రాష్ట్రానికి డబ్బుతో వెళతారు. కాని ఇక్కడ మన జమాత్‌ల మధ్య విద్వేషాన్ని రగిలించి పోతున్నారు. **ఇప్పటికైనా ప్రతీ జమాత్‌లో అల్లాహ్‌కు మరియు ముహమ్మద్(స)వారికి విధేయత చూపేవారు ఇటువంటి ప్రసంగాలు ఆపే బాధ్యత తీసుకోవాలి.**

   శుక్రవారం ఖుత్బాలలో గాని, ఈద్ ఖుత్బాలలో గాని, ఇతర పబ్లిక్ మీటింగ్స్‌లో గాని జమాత్‌ల మధ్య ఉన్న విబేధాల గురించి ప్రసంగీకులు లేవనెత్తకుండా **వారిని ముందుగానే హెచ్చరించాలి.**

4. **డిబేట్లను ఆపాలి.** ముహమ్మద్(స)వారిపై ఏయే ప్రాంతాలలో దుష్ప్రచారం జరుగుతున్నదో, ఆయా ప్రాంతాలలో పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరంగా వారిపై చర్య తీసుకోవడానికి ప్రయత్నించాలి.

5. సందేశ ప్రచారాన్ని వ్యాపారంగా మార్చివేసిన వారికి సహకరించకుండా, ఆ వ్యాపార వ్యవస్థను సమూలంగా పెకిలించాలి. ప్రతీ మస్‌జిద్‌ను విజ్ఞాన కేంద్రంగా చేసి ముస్లిములకు ఖుర్‌ఆన్ జ్ఞానం అందేలా చేయాలి. అప్పుడు ప్రతీ ముస్లిమ్ తన జ్ఞాన పరిధిలో సందేశాన్ని ఇతరులకు అందిస్తాడు. మరియు అల్లాహ్ తాడును గట్టిగా పట్టుకుంటాడు ఇన్షా అల్లాహ్!

**కపట విశ్వాసులు రగిలించే విద్వేషానికి ముస్లిములు ఎందుకు బలి కావాలి?**

మన ఆరాధ్యుడు ఒక్కడే - అల్లాహ్.

మనందరినీ సన్మార్గంలో ఉంచే గ్రంథం ఒక్కటే. ఇది అల్లాహ్ రక్షణలో మార్పుకు గురికాకుండా ఉంది.

మనందరికి సందేశహరుడు ఒక్కరే - ముహమ్మద్(స)

మనందరి ధర్మం ఒక్కటే - ఇస్లామ్.

**మనమంతా ఒక్కటే!**

### ఇప్పటికైనా ముస్లిమ్ సమాజం మేల్కోవాలి

ముస్లిమ్ సమాజం వివిధ జమాత్‌లుగా చీలిపోయి, ఒక జమాత్ పట్ల మరో జమాత్ విరోధం వహించడం, ప్రతీ జమాత్‌లో మరలా అంత:కలహాలు, ముస్లిముల పట్ల ముస్లిమేతరుల ద్వేషం, ముస్లిములపై దౌర్జన్యం, మరియు మూకుమ్మడి దాడులు, ముస్లిములు అవమానించ బడటం **- ఇవన్నీ అల్లాహ్ తాడును ముస్లిములు వదిలివేయడం వల్లనే జరుగు తున్నాయి.**

ఖుర్‌ఆన్‌లో ఏముందో ముందుగా ముస్లిములు అందరూ తెలుసు కోవాలి. ఉర్దూ / తెలుగు / ఇంగ్లీష్ అనువాదాలను కలిగి ఉన్న ఖుర్‌ఆన్ గ్రంథాలను మరియు తఫ్సీర్ ఇబ్నె కసీర్ వంటి ఒక తఫ్సీర్ గ్రంథాన్ని మస్‌జిద్‌లో ఏర్పాటు చేసుకుని, తెలిసినవారు తెలియని వారికి తెలియజేయండి. ప్రతీ ఒక్కరూ కనీసం కాస్సేపైనా ఖుర్‌ఆన్‌ను మస్‌జిద్‌లో చదివే అలవాటు చేసుకోవాలి.

జమాత్‌లో ఒక చెడును చూస్తే అది దాని నుండి తొలగిపోయే వరకూ ప్రయత్నం చేయాలి. అంతేగాని వేరే జమాత్‌గా చీలి పోకూడదు. నిజాయితీగా మన ప్రయత్నం ఎంతకాలమైనా చేస్తూనే ఉండాలి. వివిధ జమాత్‌ల ఔన్నత్యం గురించి కాకుండా **ఇస్లామ్ ఔన్నత్యం గురించి ప్రతీ ముస్లిమ్ పాటుపడాలి.**

ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు : **"అల్లాహ్ యొక్క చేయి జమ'అత్‌పై ఉంటుంది." (తిర్మిజీ, సహీహ్, 2166, పుస్తకం 31: కితాబుల్ ఫితన్, అధ్యా.7, సంపుటి 4)**

ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు, "ఎవరైతే తమ నాయకుడు చేసిన దానిని ఇష్టపడకపోతే, అతడు దానిపై సహనంతో ఉండమని ఆదేశించారు. **ఎవరైతే జమా'అత్‌ని స్వయంగా ఒక జాన దూరమైనా సరే (షిబ్రన్) విడిచి పెట్టి మరణిస్తే, అతని మరణం అజ్ఞానకాలపు మరణం అవుతుంది." (సహీహ్ బుఖారీ, 7054, పుస్తకం 92: కితాబుల్ ఫితన్, అధ్యా.2, సం. 9)**

గ్రంథ ప్రజలచే ఇంటర్‌నెట్‌లో ఎన్నో వెబ్‌సైట్లు నిర్వహించబడు తున్నాయి. కాని అవి ముస్లిములు నిర్వహిస్తున్నట్లుగా భ్రమ కలిగేలా చేస్తున్నారు. కొత్తవారు ఇంటర్‌నెట్ ద్వారా ఇస్లామ్ గురించి తెలుసు కోవాలని ప్రయత్నించకండి. ముందుగా ఖుర్‌ఆన్ చదవండి. తరువాత ఎక్కువ వివరాలతో ఉన్న ఒక తఫ్సీర్ గ్రంథాన్ని చదవండి. తమకంటూ ఓ అవగాహన స్పష్టంగా కలిగిన తరువాత వీటిని చూస్తే, ఏది ఒరిజినల్ లేదా ఏది కపటం అనేది స్పష్టమౌతుంది.

**భార్యాభర్తల నుద్దేశించి ఖుర్'ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలియజేస్తున్నారు :**


వారు మీకు వస్త్రాలు, మీరు వారికి వస్త్రాలు (2:187) | They are clothing for you and you are clothing for them | هُنَّ لِبَاسٌ لَّكُمْ وَأَنتُمْ لِبَاسٌ لَّهُنَّ




అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : (సహీహ్ ముస్లిమ్, 3649, పుస్తకం 17, అధ్యా.19, సంపుటి 4)

**"ఈ ప్రపంచం తాత్కాలిక సుఖం. ప్రపంచంలోని తాత్కాలిక సుఖాలన్నింటికంటే ఉత్తమమైనది ధర్మపరాయణురాలైన స్త్రీ (భార్య)"**

*వస్త్రాలు నగ్నత్వం నుండి కాపాడుతూ మనకు గౌరవాన్నిస్తాయి. అదే విధంగా భార్య గౌరవాన్ని భర్త మరియు భర్త గౌరవాన్ని భార్య కాపాడాలి. కుటుంబంలో భార్యాభర్తలకు వేర్వేరు బాధ్యతలున్నాయి. వారి మధ్య హెచ్చుతగ్గుల గురించి ఆలోచించ వలసిన అవసరం లేదు. ఇద్దరిలో ఎవరికీ ఎక్కువ తఖ్వా ఉంటుందో, ఎవరు తమ బాధ్యతను అల్లాహ్ ఆదేశించిన దాని ప్రకారం నిర్వర్తిస్తారో వారికే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ విలువ ఉంటుంది. కాబట్టి భార్యాభర్తలు ధర్మ పరాయణతలో, బాధ్యతలను నిర్వహించడంలో, ఒకరి గౌరవాన్ని మరొకరు కాపాడటంలో పోటీపడాలి. భార్యాభర్తల సంబంధంలో > (ఎక్కువ), < (తక్కువ), = (సమానం) వంటి గుర్తులు ఉండవలసిన అవసరం లేదు. కొన్ని విషయాలలో భర్త అధికుడైతే, మరికొన్ని విషయాలలో భార్య ఆధిక్యత వహిస్తుంది. సంతోషంగా బ్రతకవలసిన ఎన్నో కుటుంబాలు చీలిపోయి విడాకుల కోసం పరితపించడమో, మానసిక క్షోభకు గురికావడమో జరుగుతుంది. సలాత్ (నమాజ్) ఎలా చేయాలీ, సౌమ్ (ఉపవాసం) ఎలా ఉండాలీ, ఖుర్'ఆన్‌ను అరబీలో ఎలా చదవాలీ, ఈ విషయాలు తెలుసుకుంటే చాలు అని నేటి ముస్లిమ్ సమాజంలోని స్త్రీలు అనుకుంటున్నారు. వివాహం జరిగినప్పుడో లేక జరిగిన తరువాతైనా సరే ఒక ఇల్లాలిగా తాను నిర్వహించవలసిన బాధ్యతలేమిటో, వాటి గురించి అల్లాహ్ ఏమి ఆదేశించారో తెలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు. తల్లి తన కుమార్తెకు బంగారు నగలు, బట్టలు, ఇతర సామాన్లు ఇవ్వడం గురించి ప్రాధాన్యత ఇస్తుంది గాని, తన కూతురు ఇహలోకంలోనూ పరలోకంలోనూ సంతోషంగా బ్రతకడం కోసం అవసరమైన శిక్షణ ఇవ్వడం లేదు. ఓ మాతృమూర్తి తన కుమార్తె వివాహ సమయాన ఎటువంటి విషయాలు చెప్పి, భర్తతో పంపారో ఈ శీర్షిక తొలి వ్యాసంలో చదవండి. మహిళ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తే ఓ గొప్ప సమాజం మన ముందుంటుంది.*




ఏయే వయస్సులలో స్త్రీ, పురుషులు వివాహం చేసుకోవచ్చో, ఏయే వ్యక్తులతో వివాహం ధర్మ సమ్మతమో మరియు ఏ ఇద్దరి మధ్య వివాహం నిషిద్ధమో, మరియు **మానసిక సౌందర్యం యొక్క విలువ ఏమిటో** గత సంచికలలో చెప్పుకున్నాము. అంతేకాకుండా ఇతర ధర్మాల వారికి ముస్లిముల వివాహాలపై ఉన్న అపోహలను దూరం చేస్తూ, ఇస్లామీయ వివాహ వ్యవస్థలో ఉన్న వివేకాన్ని స్పష్టంగా ఉదాహరణ పూర్వకంగా వివరించడం జరిగింది. ఈ విషయాలు ముస్లిమేతరులకే కాకుండా, ముస్లిములలో కూడా చాలా మందికి తెలియవు. కాబట్టి సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అంశాలను చర్చించడం జరిగింది. ఇవి ప్రతీ ముస్లిమ్ తెలుసు కోవలసిన విషయాలు. కాబట్టి కొత్తగా చేరిన పాఠకులు, గత సంచికల లోని వివరాలు చదవగలరని ఆశిస్తున్నాము.

భార్య తన మెట్టినింటిలో ఉండే పరిస్థితులకు అనుగుణంగా సర్దుకు పోవడం గురించి క్రిందటి సంచికలో కొన్ని వివరాలు తెలియ జేయడం జరిగింది. మిగిలిన వివరాలు ఈ వ్యాసంలో అందిస్తున్నాము.

## మెట్టినింటిలోని పరిస్థితులకు అనుగుణంగా...

ముహమ్మద్(స)వారు తన ప్రియపుత్రిక 'ఫాతిమా'(రజి)వారిని పేదవారైన అలీ(రజి)వారికిచ్చి వివాహం చేయడం గురించి మరియు ఐశ్వర్యంలో పుట్టి పెరిగిన ఆయిషా(రజి) వారిని ముహమ్మద్(స)వారి కిచ్చి అబూబక్ర్(రజి)వారు వివాహం చేయడం గురించి వివరించడం జరిగింది. ముహమ్మద్(స)వారు మరణించే సమయానికి ఆయిషా(రజి) వారి అరలో గుప్పెడు బార్లీ గింజలు మాత్రమే ఉన్నాయి. దిర్హములు గాని దీనార్లు గాని లేవు.

ముహమ్మద్(స)వారు మరణించే సమయానికి విశ్వాసుల మాతృమూర్తి ఆయిషా(రజి)వారి వయస్సు 18 సంవత్సరాలు మాత్రమే. విశ్వాస స్త్రీలు తమ భర్తలను నిష్ఠూరమాడలేదు. వారిని ఇబ్బందులకు గురి చేయలేదు. **తమకు కలిగిన దానితోనే తృప్తిపడ్డారు.**

అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారి పెద్ద కుమార్తె - అస్మా(రజి)వారు. ఆమెను ముహమ్మద్(స)వారి మేనత్తగారి కుమారుడైన జుబైర్ బిన్ అవ్వామ్(రజి)వారి కిచ్చి వివాహం చేశారు. ఆమె ఏ విధంగా తన ఇంటి బాధ్యతల నెరవేర్చారో ఆమె మాటలలోనే తెలుసు కుందాం. జుబైర్(రజి)వారు నన్ను వివాహం చేసుకున్నప్పుడు ఆయనకు ఐశ్వర్యం గాని, బానిసగాని లేక ఏదీలేదు - బావి నుండి నీరు త్రోడే ఒక ఒంటె మరియు అతని గుఱ్ఱం తప్ప. నేను అతని గుఱ్ఱానికి మేతపెట్టేదానిని మరియు నీళ్ళు త్రోడేదానిని మరియు నీరు త్రోడటానికి తిత్తిని కుట్టేదానిని మరియు పిండి కలిపేదానిని. కాని నాకు తెలియదు రొట్టెను కాల్చడం ఎలాగో. కాబట్టి మా పొరుగున ఉన్న అన్సార్లు నా కొరకు రొట్టె కాల్చిపెట్టేవారు మరియు వారు గౌరవనీయమైన మహిళలు. నేను రసూలుల్లాహ్(స)వారు జుబైర్(రజి)వారికి ఇచ్చిన భూమి నుండి ఖర్జూరపు పిక్కలను నా తలపై మోసుకు వచ్చేదానిని. మరియు ఆ పొలం మా ఇంటి నుండి పర్‌సఖ్‌లో మూడింట రెండవ వంతు (దాదాపు రెండు మైళ్ళు) ఉంటుంది. ఒకరోజు నేను నా తలపై ఖర్జూరపు పిక్కలతో వస్తూ ఉండగా, అన్సారులతో కలిసిఉన్న రసూలుల్లాహ్ (స)వారిని (దారిలో) కలిసాను. ఆయన(స) నన్ను పిలిచారు మరియు తరువాత (మోకాళ్ళపై కూర్చునేలా ఒంటెను ఆదేశిస్తూ) చెప్పారు, "ఇఖ్! ఇఖ్!" (ఆ ఒంటెపై) ఆయన(స) వెనుక కూర్చునేందుకు. నేను పురుషుల వెనుక ప్రయాణం చేయడానికి సిగ్గు పడ్డాను మరియు జ్ఞాపకం చేసుకున్నాను జుబైర్(రజి)ని మరియు ఆయన ఆత్మాభిమానాన్ని. మరియు జుబైర్(రజి)వారు ప్రజలలో చాలా ఎక్కువ ఆత్మాభిమానం కలవారు. రసూలుల్లాహ్(స)వారు నేను సిగ్గుపడు తున్నట్లు గమనించి, ఆయన(స) ముందుకు సాగిపోయారు. నేను జుబైర్(రజి)వారి వద్దకు వచ్చి చెప్పాను, "నేను రసూలుల్లాహ్(స) వారిని కలిసాను, నేను ఖర్జూరపు పిక్కల మోపును నా తలపై మోసుకు వస్తుండగా. మరియు ఆయన(స)తో అనుచర సమూహం ఉంది. తన ఒంటెను మోకాళ్ళపై కూర్చుండబెట్టారు నేను ప్రయాణించ వచ్చని. కాని నేను ఆయన(స) సమక్షంలో సిగ్గుపడ్డాను మరియు గుర్తు చేసుకున్నాను మీ ఆత్మాభిమానాన్ని". ఆ విషయంపై జుబైర్(రజి)వారు అన్నారు, "అల్లాహ్ సాక్షి! ఖర్జూరపు పిక్కలను నీవు మోయడమే నాకు ఎక్కువ అవమానంగా ఉంది ఆయన(స)తో ప్రయాణం కంటే." (నేను ఈ విధంగా ఇంటి పనులు చేస్తూ ఉన్నాను) అబూబక్ర్(రజి)వారు నా దగ్గరకు గుఱ్ఱం బాగోగులు చూసుకోవడానికి ఒక నౌకరును పంపేవరకూ, అప్పుడు ఆయన నన్ను విముక్తి కలిగించినట్లుగా ఫీల్ అయ్యాను. **(సహీహ్ బుఖారీ, 5224, పుస్తకం 67, అధ్యా.108, సంపుటి 7)**

**అల్లాహ్ తాను కోరిన వారికి అమితంగా ప్రసాదిస్తాడు. మరియు తాను కోరిన వారికి మితంగా ప్రసాదిస్తాడు.**

**విశ్వాసులకు పేదరికం కూడా ఒక పరీక్షే!**

**అల్లాహ్ అనుగ్రహించిన దానితో తృప్తి చెందేవారు ఇహలోకంలో సంతోషంగా ఉండగలుగుతారు.**

ఈ సందర్భంగా ఇబ్రాహీమ్(అ) మరియు ఇస్మా'ఈల్(అ)వారి కాలం నాటి ఓ సంఘటన గుర్తు చేసుకుందాం! వీరిద్దరూ తండ్రీ కొడుకులు మరియు ప్రవక్తలని పాఠకులకు తెలిసిన విషయమే!

ఇబ్రాహీమ్(అ)వారు ఒకసారి తన కుటుంబాన్ని చూడాలని మక్కా వచ్చారు. అప్పటికే ఆయన భార్య మరణించారు. ఇస్మా'ఈల్(అ)వారికి వివాహం జరిగిపోయింది.

కాని అక్కడ ఆయనకు ఇస్మా'ఈల్(అ)వారు కనిపించలేదు. కాబట్టి అతని గురించి ఇస్మాయీల్(అ)వారి భార్యను అడిగారు. **'ఆయన మా జీవనోపాధి కొరకు బయటకు వెళ్ళారు'** అని ఆమె సమాధాన మిచ్చారు. వచ్చినవారు తన మావయ్యగారేనని ఆమెకు తెలియదు.

తరువాత వారి స్థితి గురించి మరియు వారి జీవన విధానం గురించి ఆమెను అడిగారు. ఆమె సమాధాన మిచ్చారు, **'మేము దారిద్ర్యంలో జీవిస్తున్నాము. మేము కష్టాలతో మరియు లేమితో జీవిస్తున్నాము'** అని ఫిర్యాదు చేసారు.

ఆయన అన్నారు, **"నీ భర్త ఇంటికి వచ్చినప్పుడు, అతనికి నా సలామ్ అందజేయి మరియు** (నీ ఇంటి) **గడపను మార్చమన్నానని అతనికి చెప్పు".**

ఇస్మా'ఈల్(అ)వారు ఇంటికి రాగానే ఆయనకి ఏదో ఒక అసాధారణ భావం కలిగింది, ఆయన తన భార్యను అడిగారు, **'ఎవరైనా చూడటానికి వచ్చారా?'.**

**'ఔను, ఫలానా వర్ణన గల ఓ పెద్దాయన వచ్చారు మరియు మీ గురించి నన్ను అడిగారు మరియు నేను ఆయనకు తెలియజేశాను. మన జీవన స్థితిగతుల గురించి అడిగారు. మనం కష్టాల్లో మరియు బీదరికంలో జీవిస్తున్నట్లు ఆయనకు చెప్పాను'** అని ఆమె సమాధాన మిచ్చారు,

ఇస్మా'ఈల్(అ) అడిగారు, **'నీకు ఆయన ఏదైనా సలహా ఇచ్చారా?'.**

'ఔను, మీకు సలామ్ అందజేయమని మరియు మీ ఇంటి గడప మార్చమని ఆయన నాకు చెప్పారు' అని ఆమె సమాధాన మిచ్చారు,

**'ఆయన నా తండ్రిగారు మరియు నీకు విడాకులివ్వమని ఆయన నన్ను ఆదేశించారు. మీ ఇంటికి వెళ్ళిపో'.**

ఆ విధంగా ఇస్మాయీల్(అ) ఆమెకు విడాకులిచ్చి, వారిలోని (అంటే జుర్‌హుమ్ తెగలోని) మరో స్త్రీని వివాహం చేసుకున్నారు. కొంత కాలానికి తన వారిని చూడాలని ఇబ్రాహీమ్(అ)వారు మరలా వచ్చారు.

కాని ఈసారి కూడా ఇస్మా'ఈల్(అ)వారు ఆయనకు కనిపించ లేదు. ఇస్మా'ఈల్(అ)వారి భార్య మాత్రమే ఉన్నారు. ఇస్మా'ఈల్(అ) వారి గురించి ఆమెను అడిగారు.

ఆమె చెప్పారు, **'మాకు ఉపాధి కొరకు ఆయన బయటికి వెళ్ళారు'.** ఇబ్రాహీమ్(అ) ఆమెను అడిగారు, **'మీకు ఎలా గడుస్తుంది?'** వారి జీవన స్థితిగతుల గురించి అడిగారు.

**ఆమె సమాధాన మిచ్చారు, "మేము బాగున్నాము మరియు లోటు లేదు". తరువాత ఆమె అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెప్పు కున్నారు.**

వచ్చినవారు తన మావయ్యగారని ఆమెకు తెలియదు. అయినప్పటికీ, 'మీరు కాస్త ఉంటారా ఏదైనా కొంత ఆహారం తీసుకోవడానికి మరియు త్రాగడానికి?' అని ఇబ్రాహీమ్(అ) వారికి ఆతిథ్యం ఇవ్వాలనే సంకల్పంతో ఆయనను గౌరవంగా కోరారు.

ఇబ్రాహీమ్(అ) అడిగారు, **'ఏ రకమైన ఆహారాన్ని మీరు తింటున్నారు?'** ఆమె చెప్పారు, **'మాంసం'.** ఆయన అడిగారు, **'మీరు ఏమిటి త్రాగుతున్నారు?'.** ఆమె చెప్పారు, **'నీరు'.**

ఆయన ఇలా దు'ఆ చేశారు : **'ఓ అల్లాహ్! వారి మాంసం మరియు నీళ్ళలో శుభాలను కలుగజేయండి'.**

ఈ సందర్భంగా ముహమ్మద్(స)వారు చెప్పారు, **"ఆ సమయానికి వారి దగ్గర ధాన్యాలు లేవు. మరియు వారు ధాన్యాలను కలిగి ఉండి ఉంటే, వాటిలో శుభాలను కల్గించమని ఆయన అల్లాహ్‌ను ప్రార్థించి ఉండేవారు".** ప్రవక్త(స)వారు చెప్పారు, "ఎవరైనా తాను బ్రతకడం కొరకు ఈ రెండు వస్తువులను (అంటే మాంసం మరియు నీరు) మాత్రమే కలిగి ఉంటే, అతని ఆరోగ్యం మరియు విధానంపై చెడు ప్రభావం కలుగుతుంది, అతను మక్కాలో నివశిస్తే తప్ప'. (అంటే మక్కాలో తప్ప ఇతర ప్రాంతాలలో కేవలం మాంసం, నీరుతో ఆరోగ్యంగా జీవించలేరు.)

**'నీ భర్త వచ్చినప్పుడు, నా సలాము అందజేయి మరియు అతనికి చెప్పు తన గడపను స్థిరంగా ఉంచమన్నానని'** ఇస్మా'ఈల్(అ)వారి భార్యతో ఆయన చెప్పారు.

ఇస్మా'ఈల్(అ) ఇంటికి తిరిగి వచ్చినప్పుడు, **'నీ దగ్గరకు ఎవరైనా వచ్చారా?'** అని తన భార్యను అడిగారు.

ఆమె సమాధాన మిచ్చారు, **'అవును, మంచిగా కనిపించే ఓ పెద్దాయన నా దగ్గరకు వచ్చారు, ఆ విధంగా ఆయనను గౌరవంగా వర్ణిస్తూ చెప్పారు, ఆయన మీ గురించి అడిగారు మరియు నేను తెలియజేశాను. మన జీవనాధారం గురించి ఆయన అడిగారు. మనం మంచి స్థితిలో ఉన్నామని ఆయనకు నేను చెప్పాను.' 'ఆయన నీకేదైనా సలహా ఇచ్చారా?'** ఆమెను అడిగారు. 'అవును, మీకు తన సలామ్ అందజేయమని మరియు నీ గడపను స్థిరంగా ఉంచుకోవాలని ఆదేశించారు' అని ఆమె బదులిచ్చారు.

అప్పుడు ఇస్మా'ఈల్(అ) చెప్పారు, **'ఆయన నా తండ్రిగారు మరియు నీవే ఆ గడపవి. నిన్ను నాతో పాటే ఉంచుకోమని ఆయన నన్ను ఆదేశించారు'.**

**భర్త సంపాదనతో తృప్తి పడే విశ్వాస స్త్రీ ఇన్షా అల్లాహ్ గౌరవించ బడుతుంది. ముహమ్మద్(స)వారి కాలంలోని ఎందరో విశ్వాస స్త్రీలు గౌరవప్రదం గానే జీవించారు.**

**ఈమె ఉన్నదానితో తృప్తి పడ్డారు. భర్త జీవనోపాధిని తక్కువ చేసి మాట్లాడలేదు. అంతేకాకుండా తమకు ప్రసాదించిన ఉపాధి విషయంలో అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.**

ముందుగా చెప్పుకున్న అస్మా(రజి)వారి విషయమే తీసుకోండి. ఆమె తండ్రి ఐశ్వర్యవంతుడే. కాని ఆయన తన కుమార్తెను ఐశ్వర్యవంతుల ఇంటికి కోడలుగా పంపలేదు. పేదవాడైనా సరే ధర్మపరాయణుడైన అల్లుడినే ఎన్నుకున్నారు. అస్మా(రజి)వారు ఇంటి బాధ్యతలను నెరవేర్చేవారు. **అలవాటు లేని పనులు భర్త కోసం చేశారు.** ఆమె శ్రమించారు. భర్త ఆత్మాభిమానానికి విలువ ఇచ్చారుగాని నిష్ఠూరమాడలేదు.

ఇప్పటి మన స్థితిగతులలో చాలా వ్యత్యాసం ఉంది. మన చుట్టు పక్కల ఖరీదైన భవంతులుంటాయి. ఖరీదైన కార్లలో, విలువైన బంగారు ఆభరణాలు ధరించి ఎందరో స్త్రీలు వెళుతుండటం కనిపిస్తుంది. దగ్గరి బంధువులలో కూడా అటువంటి ధనవంతులు ఉంటారు. **ఇది నేటి విశ్వాస స్త్రీకి కఠిన పరీక్ష అనే చెప్పాలి.** వారితో తనను పోల్చుకుని తన భర్తను తక్కువగా పరిగణించే ఆలోచనను షైతాన్ కలిగించవచ్చు. లేదా ఆ ఐశ్వర్యవంతులే తమతో పోల్చుకుని చులకన చేయవచ్చు. వారు తమ ప్రదర్శనా బుద్ధిని చూపవచ్చు.

కాని వీటిని పట్టించుకోకుండా తన భర్త ఆత్మగౌరవాన్ని కాపాడు కుంటూ, ఉన్నదానితో తృప్తిపడుతూ అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెప్పుకునే విశ్వాస స్త్రీయే **అసలైన భాగ్యవంతురాలు.** ఆమెకు ఇహలోకంలోనూ మరియు పరలోకంలోనూ ప్రశాంతతే లభిస్తుంది, ఇన్షా అల్లాహ్!

**అంతేకాకుండా తన భర్తకు ప్రశాంతతను కలుగజేస్తుంది.**

పేదరికం మరియు ఐశ్వర్యం అనేవి అల్లాహ్ నిర్ణయం మేరకే సంభవిస్తాయి. పేదవారికి ఒక రకమైన పరీక్ష ఉంటుంది. ధనవంతులకు మరో రకమైన పరీక్ష ఉంటుంది. **ఎవరి పరీక్ష వారిదే!** మన పరీక్షలో మనం విజయం సాధించాలి. ధనవంతుల కంటే పేదవారు 70 సంవత్సరాలు ముందుగానే స్వర్గంలో ప్రవేశిస్తారు.

**(మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...)**




**ప్రతీ స్త్రీ లేదా పురుషునికి తొలి బడి అమ్మ ఒడి. గొప్ప గొప్ప జ్ఞానులు, మేధావుల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంటుంది. తొలి గురువులు తల్లిదండ్రులే. ఆ తరువాతనే, పాఠశాలలో చేరిన దగ్గరనుండి, మిగిలిన గురువులు పరిచయమౌతారు. వీరందరినీ మీరు గౌరవించాలి. అయితే వీరందరికీ జ్ఞానాన్ని ఇచ్చిన సృష్టికర్తే విశ్వమంతటికీ గురువు - ఆయనే 'అల్లాహ్'. ఏ గురువు చెప్పినా అర్థం కాకపోయినా లేక మరేదైనా చెప్పుకోలేని సమస్య మీకొస్తే డైరెక్టుగా అల్లాహ్‌నే అడగండి. ఆయన వింటాడు. మీకు జవాబు కూడా వస్తుంది. ఆరాధ్యుడిని అర్థం చేసుకుంటే మీరే టాప్ ర్యాంకర్స్.**

**అల్లాహ్ యొక్క ప్రవక్త**
**లూత్(అ)**

గత కొన్ని సంచికల నుండి ఒక్కొక్కరిగా అల్లాహ్ పంపిన ప్రవక్తల జీవితచరిత్రను అందిస్తున్నాము.

(గత సంచిక తరువాయి భాగం)

క్రిందటి సంచికలో లూత్(అ)వారి జాతి నాశనానికి సంబంధించి సాధారణ పుస్తకాలలో లభించని అరుదైన విషయాలను అందించడం జరిగింది.

**మరియు వాస్తవానికి, మీరిప్పుడు వారి ప్రాంతాల మీదుగా ఉదయపు వేళల్లో ప్రయాణిస్తూ ఉంటారు మరియు రాత్రులలో కూడా! అయినా మీరు అర్థం చేసుకోలేరా?** (ఖుర్'ఆన్ 37:137-138)

మక్కాలోని సత్య తిరస్కారులు వ్యాపార నిమిత్తం ప్రతీ సంవత్సరం సిరియా వెళుతూ ఉంటారు. వీరు సిరియాకు వెళ్ళే రహదారి నాశనమైన ఆ పట్టణాల పక్కనుండే వెళుతుంది. కాబట్టి వీరు ఆ సూచన చూసి (అంటే అల్లాహ్ శిక్షను చూసి) కూడా అర్థం చేసుకోరా అని హితబోధ చేస్తుంది పై ఆయత్.

**ఆ సూచన(లు) ఏమిటి?**

మృత సముద్రాన్ని (Dead Sea) ఆ సూచనగా చాలామంది చెబుతారు. క్రింది ఆయత్‌లో చెప్పబడిన సూచన అదేనా?

**మరియు బాధాకరమైన శిక్షకు భయపడేవారి కొరకు మేము అక్కడ ఒక సూచనను వదిలిపెట్టాము. (ఖుర్'ఆన్ 51:37)**

క్రింది ఆయత్‌ను బట్టి మరియు గత సంచికలో 44-45 పేజీలలో ఇచ్చిన ఓ ఉల్లేఖనాన్ని బట్టి అది ఆయన ఇల్లు అని స్పష్టమౌతుంది.

**మేము అందులో ఒక్క గృహం తప్ప, మరే ముస్లిముల గృహాన్ని చూడలేదు** (ఖుర్'ఆన్ 51:36)

క్రిందటి సంచికలో తెలిపిన ఉల్లేఖనంలోని భాగం

తరువాయి రోజు సూర్యుడు ఉదయించగానే అల్లాహ్ ఆదేశించారు: "ఓ జిబ్రీల్! లూత్ జాతి యొక్క గతి ముగించ బడింది. కాబట్టి నేలను తవ్వు 7వ పొర వరకూ మరియు మధ్య భాగాన్ని ఆకాశం వైపు లేపు, తరువాత అల్లాహుతాలా ఆదేశం కొరకు వేచి ఉండు. ఆ నగరాన్ని తలక్రిందులుగా చేయడానికి మరియు **లూత్ ఇంటిని ఓ సూచనగా స్పష్టం కావడానికి ఆ పట్టణం పక్కగా వెళ్ళేవారికి సూచనగా దానిని వదలడానికి."** జిబ్రీల్(అ) చెప్పారు, "నేను అన్యాయపరుల వైపు వెళ్ళాను మరియు నా కుడిరెక్కతో ఆ నగరం యొక్క తూర్పుభాగాన్ని కొట్టాను మరియు నా ఎడమ రెక్కతో పడమర భాగాన్ని మరియు భూమిని తవ్వాను దాని 7వ పొర వరకూ. **లూత్(అ)వారి ఇంటిని మాత్రమే వదలడం జరిగింది. రాబోవు తరాలకు సూచనగా."**

నిశ్చయంగా, ఇందులో దూరదృష్టి గలవారికి ఎన్నో **సూచనలున్నాయి.** మరియు వాస్తవానికి ఆ ప్రాంతం ఒక రహదారి పైననే ఉన్నది. (ఖుర్'ఆన్ 15:75-76)

పై ఆయత్‌లను బట్టి ఒకటి కంటే ఎక్కువ సూచనలున్నట్లు అర్థమౌతుంది.

మృత సముద్రంలో నీటి సాంద్రత చాలా ఎక్కువ. కాబట్టి దానిలో మనుషులు మునిగిపోరు. తేలుతూ ఉంటారు. అందులో చేపలు గాని, మరే జీవిగాని బ్రతకలేదు. కాబట్టే దానిని మృతసముద్రం అంటారు. లూత్ సరస్సు అని కూడా దీనిని పిలుస్తారు. దీని పొడవు

55 కి.మీ. మరియు వెడల్పు 18 కి.మీ. దీని మధ్య భాగంలో లోతు 306 మీటర్లు. ఈ భూభాగం సముద్ర మట్టం కంటే 427 మీటర్లు దిగువున ఉంటుంది. అంటే 1400 అడుగులు దిగువున ఉన్న ఈ ప్రాంతమే ప్రపంచంలో బాగా దిగువున్న ఉన్న ప్రాంతం.

ఈ మృత సముద్రం ఏర్పడటానికి కారణం భూకంపం మరియు అగ్ని పర్వతం బ్రద్దలై దాని కీలలు వీరిపై పడినట్లు పురావస్తు శాఖవారు భావిస్తున్నారు. కాని ఇది మనం చెప్పుకున్న సమాచారంతో సరిపోవడం లేదు.

Perished Nations అనే హారున్ యహ్యాగారు వ్రాసిన పుస్తకంలో కొన్ని ఫొటోలు ఉన్నాయి. మృత సముద్రం ఒడ్డున ఒక ఇంటి శిథిలాలు ఉన్నాయి. అయితే అది లూత్(అ)వారి ఇల్లు అవునా? కాదా? అనేది స్పష్టంగా తెలియడం లేదు. ప్రక్క కాలమ్‌లో ఇచ్చిన ఫొటో చూడండి.

క్రీ.శ. 2వ శతాబ్దంలో లూత్ జాతి కంటే ఘోరంగా, అత్యంత నీచంగా బ్రతికిన పాంపై పట్టణవాసులు Vesuvius అగ్నిపర్వతం బద్దలు కావడంతో సర్వనాశనం అయిపోయారు. ఆ నగరం పురావస్తు త్రవ్వకాలలో బయటపడింది. విలాసవంతమైన భవనాలు మరియు చెక్కు చెదరని ఎన్నో వస్తువులు మరియు పెయింటింగ్స్ బయట పడ్డాయి. వాటి ద్వారా ఎంత విలాసవంతంగా గడిపినా సరే, వారు ఎంత నీచంగా జీవించారో స్పష్టమౌతుంది. **ఈ పట్టణానికి సంబంధించిన కొన్ని విషయాలు ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో చెప్పుకుందాం.**



మృతసముద్రం ఒడ్డున ఇంటి శిథిలాలు

హైస్కూల్ విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకోవాలి

## ఆధునిక సైన్స్ ఆవిర్భవంలోనూ మరియు దాని అభివృద్ధిలోనూ ముస్లిమ్ శాస్త్రవేత్తలు చేసిన కృషి

సైన్స్ అండ్ టెక్నాలజీలో ఇంత అభివృద్ధి సాధించినప్పటికీ, ఇస్లామ్‌ను అపార్థం చేసుకున్నవారే ఎక్కువగా ఉన్నారు. ఇల్మ్ (సైన్స్) ప్రాధాన్యతను ఇస్లామ్ చాలా స్పష్టంగా వివరించింది. ముస్లిములే దీనిని గ్రహించ లేకపోవడం ఒక విధంగా మన దౌర్భాగ్యంగా చెప్పవచ్చు.

మనిషి పుట్టిందే ఓ పరీక్షలో విజయం సాధించడానికి. కాబట్టి మనిషికి మొట్టమొదట కావలిసింది 'జ్ఞానం'. ఆ జ్ఞానం అతనిలో తఖ్వా పెంచుతుంది. తఖ్వా గలవాడు ఆ పరీక్షలో అల్లాహ్ కారుణ్యంతో విజయం సాధిస్తాడు.

మతపరమైన జ్ఞానాన్నే ముస్లిములు జ్ఞానం అనుకుంటారనే అపోహ ప్రజలలో ఉంది. హదీస్ గ్రంథాలలో న్యాయం (Law) గురించి, జడ్జి గురించి, జడ్జ్‌మెంట్ గురించి చాలా స్పష్టమైన జ్ఞానం ఉంది. వ్యవసాయం మరియు వ్యాపార లావాదేవీలు ఎలా చేయలో ఎంతో స్పష్టంగా వివరించడం జరిగింది. ఇవి గనుక అనుసరిస్తే, వ్యాపారం ఒక్కసారిగా కూలిపోవడం లేదా ఒక్కసారిగా పైకిలేవడం జరగదు.

సోషల్ అండ్ మోరల్ సైన్స్ గురించి చాలా చక్కగా వివరించడం జరిగింది. సహనం, నిజాయితీ, కష్టపడి పనిచేయడం మరియు తాను చేసే పనుల పట్ల క్షుణ్ణంగా ఆలోచించడం గురించి ప్రోత్సహిస్తూ చెప్పే పాఠాలెన్నో హదీస్ గ్రంథాలలో ఉన్నాయి. **ఒక సైంటిస్ట్‌లో ఉండవలసిన ప్రాథమిక అంశాలు ఇవే!**

ముహమ్మద్(స)వారు మక్కాలో ఉన్నప్పుడు, హింసలకు దౌర్జన్యాలకు గురి అవుతున్న సమయంలో కూడా, ఆయన(స) తన అనుచరులను జ్ఞానం నేర్చుకోవడానికి ప్రోత్సహించారు. ఆనాడు అరబ్బులలో చదవడం, వ్రాయడం తెలిసిన వారిని వేళ్ళపై లెక్క బెట్టవచ్చు. అంత తక్కువ సంఖ్యలో ఉండేవారు. మదీనాలో బద్ర్ యుద్ధం తరువాత, యుద్ధఖైదీలుగా చిక్కిన వారిలో పరిహారం చెల్లించి విముక్తి పొందలేని పేదవారికి ముహమ్మద్(స)వారు ఒక అవకాశం ఇచ్చారు. అదేమిటంటే ప్రతీ ఖైదీ కొంతమంది ముస్లిమ్ బాల బాలికలకు చదవడం, వ్రాయడం నేర్పాలి. స్త్రీలు విద్య నేర్చుకుంటే ఆ విద్య సమాజం అంతా వ్యాపిస్తుందని బోధించి ముహమ్మద్(స) వారు స్త్రీలను జ్ఞానార్జనకై ఎంతగానో ప్రోత్సహించారు.

ఇస్లామ్‌ను అర్థంచేసుకున్న నాటి ముస్లిములు చదువుకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. **రాజు కొడుకైనా సరే, రైతుకొడుకైనా సరే, ప్రతీ ఒక్కరికి ప్రాథమిక విద్య తప్పనిసరి.** ఎడ్యుకేషన్ కూడా ఉచితమే! మస్‌జిద్‌లు విజ్ఞాన కేంద్రాలు అయ్యాయి. సైన్స్, మేథమెటిక్స్, మెడిసిన్ మస్‌జిద్‌లలోనే నేర్పేవారు. చుట్టుపక్కల దేశాల నుండి జ్ఞానం కోసం వేల సంఖ్యలో విద్యార్థులు ముస్లిమ్ మదరసాలకు వచ్చేవారు.

ఆధునిక సైన్స్‌కి పునాదులు వేసింది ముస్లిమ్ శాస్త్రవేత్తలే. వీరికి ఖుర్‌ఆన్ మరియు హదీస్ జ్ఞానంపై మంచి పట్టు ఉండేది. ఆధునిక సైన్స్‌ను వీరు ఎలా అభివృద్ధి చేశారో, ఆనాటి మదరసాల విద్య ఎలా ఉండేదో ఇది వరకు చాలా సార్లు శాంతిబాటలో తెలియజేయడం జరిగింది.

బుఖారీ(ర)వారు అందించిన హదీస్ గ్రంథాన్ని 97 కితాబ్ (పుస్తకా)లుగా మరియు ప్రతీ కితాబ్‌ని ఎన్నో బాబ్ (అధ్యాయా)లుగా విభజించి, ప్రతీ బాబ్‌కు ఆయన పెట్టిన టైటిల్ మరియు ప్రతీ కితాబ్ లేదా బాబ్‌ను ప్రారంభించడానికి ఆయన ఎంచుకున్న హదీస్‌ను అధ్యయనం చేస్తే లేక చిన్న తనంలోనే ఆ జ్ఞానాన్ని ఎవరైనా గ్రహించగలిగితే, ఏ రంగంలో నైనా పరిశోధన చేసి మంచి థీసిస్ వ్రాసి డాక్టరేట్ డిగ్రీ చాలా సులభంగా సాధించవచ్చు. ఇది అనుభవంతో

చెబుతున్న విషయం.

**నేటి మదరసాల ఎడ్యుకేషన్ చూసి, ఇస్లామ్‌ని అపార్థం చేసుకోవడం సరికాదు.** 7వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం వరకూ ప్రపంచం అంధకారంలో ఉన్న సమయంలో, ఆధునిక సైన్స్‌ని అభివృద్ధి చేసిన ముస్లిముల స్వర్ణయుగం (golden age) గురించి చరిత్రలో వివరాలు లేవు. అయితే చీకటి పొరలలో కప్పబడిన ఆ నిజాలను వెలికితీయడం జరిగింది. ఇంకా జరుగుతూ ఉంది. ఆధునిక విజ్ఞాన శాస్త్రం అందించిన ఎన్నో ఫలాలను నేడు ప్రపంచ ప్రజలు అనుభవిస్తున్నారు. ఒక ప్రాంతం, ఒక జాతి అని కాకుండా ప్రపంచ వ్యాప్తంగా శాస్త్ర పరిశోధనలు జరుగుతున్నాయి. **మనం చదువుకున్న పాఠ్య పుస్తకాలలో చోటుదొరకని ఎన్నో సత్యాలను ఈ శీర్షికలో తెలుసుకుందాం!**

వివిధ తరగతులలో విద్య నభ్యసిస్తున్న ముస్లిమ్ విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకొని తమ తోటి విద్యార్థులకు తెలియ జేయవలసిన ముఖ్యమైన విషయాలెన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని ఇంతకు పూర్వం అందించినప్పటికీ, వాటిని మరికాస్త వివరంగా అందించాలని సంకల్పించాము.

## Optics (ఆప్టిక్స్) - కాంతి విజ్ఞాన శాస్త్రం

## ఇల్ముల్ బసరియ్యాత్ عِلۡمُ البَصرِيَّات

విజ్ఞాన శాస్త్రం (Science)లో ఒక శాఖ - భౌతికశాస్త్రం. ఈ ఫిజిక్స్ శాఖకు ఎన్నో ఉపశాఖలు ఉన్నాయి. ఉదాహరణకు జియో ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, స్పేస్ ఫిజిక్స్ మొ॥వి. ఫిజిక్స్ అభివృద్ధి కాకపోయి ఉంటే ఓ రాకెట్ అంతరిక్షంలోకి వెళ్ళగలిగేది కాదు. కేవలం ఫిజిక్స్ ఒక్కటే కాదు, దానితో పాటు సైన్స్‌లోని ఇతర శాఖలు కూడా ఓ రాకెట్‌ను పంపడానికి అవసరం. ఈ ఫిజిక్స్‌లోని ఒక భాగం ఆప్టిక్స్.

కెమెరా లెన్స్‌ల నుండి మనం ధరించే కళ్ళజోళ్ళ వరకూ, కారు లైట్ల నుండి ఫ్లడ్ లైట్స్ వరకూ ప్రతీది ఆప్టిక్స్‌పై ఆధారపడిందే.

ఎన్నో లక్షల మంది ఈ శాస్త్రాన్ని అభివృద్ధి చేశారు.

1వ తరగతి నుండి 10వ తరగతి వరకూ అందరికీ ఒకటే సిలబస్. ఆ తరువాత ఎవరి ఇష్టం ప్రకారం వారు తమ రంగాన్ని ఎంచు కుంటారు. ఈ 1వ తరగతి నుండి 10వ తరగతి వరకూ ప్రతీ శాస్త్రానికి సంబంధించి ప్రాథమిక సమాచారాన్ని తెలుసుకో గలుగుతాము.

కాని పాఠపుస్తకాల(Text Books) ద్వారా మనం నేర్చుకునే ప్రాథమిక సమాచారం అసంపూర్ణంగా ఉండటంతో చాలా మందికి కొన్ని సత్యాలు తెలియడం లేదు. తమ రంగంలో బాగా ప్రావీణ్యం సంపాదించిన తరువాత కూడా, ఆ రంగానికి సంబంధించిన కొన్ని సత్యాలు తెలుసుకోలేని పరిస్థితి నేడు నెలకొని ఉంది.

ఈ **"కాంతి విజ్ఞాన శాస్త్రం"** (optics)కి పునాది ఎవరు వేశారు?

పై ప్రశ్నకు 'ఐజాక్ న్యూటన్' అని వెంటనే సమాధానం వినిపిస్తుంది. ఆయన సైన్స్‌కి అపారమైన సేవలు అందించారు. అందులో సందేహం లేదు. **కాని ఆప్టిక్స్‌కి పితామహుడు ఆయన కాదు.** న్యూటన్ 17వ శతాబ్దంలో కటకాలు (లెన్సెస్), కాంతి మరియు పట్టకాలు (ప్రిజ్మ్)పై అధ్యయనం చేశారు.

వాస్తవానికి ఈ విజ్ఞాన శాస్త్రం **11వ శతాబ్దంలోనే** అభివృద్ధి చేయబడింది. ఆప్టిక్స్ అభివృద్ధిలో న్యూటన్ చేసిన ప్రతీది కూడా శతాబ్దాలకు పూర్వమే **ముస్లిమ్ శాస్త్రవేత్త ఇబ్నె అల్-హైతమ్ ప్రయోగాత్మకంగా నిర్ధారించారు.** అసంఖ్యాక నిపుణులు 'అల్-హైతమ్'ని **కాంతి విజ్ఞానశాస్త్ర వ్యవస్థాపకుడిగా** పేర్కొన్నారు. అల్-హైతమ్ యొక్క ప్రభావం తరువాత కాలంలో వచ్చిన ఎందరో శాస్త్రవేత్తలపై పడింది.

## ప్రపంచపు తొలి సైంటిస్ట్

అల్-హైతమ్ మధ్యయుగ కాలానికి సంబంధించి ఎక్కువగా ఉదాహరించబడిన భౌతికశాస్త్రవేత్త. అత్యధిక సంఖ్యలో యూరప్ శాస్త్రవేత్తలు అల్-హైతమ్ యొక్క పరిశోధనలను ఉపయోగించు కోవడం మరియు ఉదాహరించడం జరిగింది.

న్యూటన్‌ను ఉదాహరించారు మరియు గెలీలియోను కూడా ఉదాహరించారు. అయితే వీరిద్దరిని ఉదాహరించిన సంఖ్య కంటే, అల్-హైతమ్‌ని ఉదాహరించిన సంఖ్యే చాలా ఎక్కువ.

"దృష్టి" (vision) గురించి సైంటిఫిక్‌గా వివరించిన తొలి వ్యక్తి ఈయన. ఈయన పూర్తి పేరు **అబూ అల్-హసన్ బిన్ అల్-హైతమ్** (965 - 1040 CE). యూరోపియన్లకు ఈయన **అల్-హేజన్** (**Alhazen**) గా తెలుసు.

ఈయనను ప్రపంచపు తొలి సైంటిస్ట్ అని అంటారు. ఎందుకంటే సైంటిఫిక్ మెథడ్‌ని మొట్టమొదట పరిచయం చేసినవారు ఇబ్నె అల్-హైతమ్.

ఈయనకి ఖుర్ఆన్ మరియు హదీస్‌లపై, ఫిఖ్‌పై కూడా మంచి అవగాహన ఉంది. చంద్రునిపై మచ్చల గురించి మరియు ఒక దృశ్యాన్ని మనం చూసినప్పుడు అది మన కంటిలోని రెటీనాపై ఆ దృశ్యం ఏ విధంగా పడుతుందో ఆనాడే ఖచ్చితంగా చెప్పారాయన. ఈయన గురించి చెప్పడానికి ఎన్నో ఆసక్తి కలిగించే విషయాలు ఉన్నాయి. శాంతిబాట ఫిబ్రవరి, 2010 మరియు మార్చి, 2010 సంచికలు చూడండి. ఈయన 200 పుస్తకాలు వ్రాసారు. వాటిలో 50 మాత్రమే మిగిలాయి. ఆయన వ్రాసిన ఒక పుస్తకాన్ని **THE BOOK OF OPTICS** గా అనువదించారు.

> **"He, Ibn al-Haitham, was the greatest Muslim Physicist and student of optics of all times. Whether it be in England or far away Persia, all drank from the same fountain. He exerted a great influence on European thought from Bacon to Keplar"** - *George Sarton (1927)*
>
> [Introduction to the **History of Science**. Three Volumes, The Carnegie Institution, Washington]

# ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువుదాం - 34

**Prepositions that come with the verb & may change the meanings**

فِعْل + صِلَةُ الْفِعْل — క్రియా పదాలతో వచ్చే విభక్తులు అర్థాలను మార్చవచ్చు — حرف جر جو فعل کے ساتھ آئے

| Arabic | Urdu | Meaning |
|---|---|---|
| أَتَى | آیا | వచ్చాడు<br>came |
| أَتَى بِ | لایا | తెచ్చాడు<br>brought |
| بَغَى | ظلم وزیادتی کی، زنا کیا | కోరాడు<br>sought |
| بَغَى عَلَى | زیادتی یا سرکشی کی | అన్యాయం చేశాడు<br>oppressed; was unjust |
| تَابَ، تَابَ اِلَى | توبہ کی | పశ్చాత్తాపంతో (అల్లాహ్ వైపు) మరలాడు<br>repented |
| تَابَ عَلَى | توبہ قبول کی | పశ్చాత్తాపం స్వీకరించాడు<br>accepted the repentence |
| جَاءَ | آیا | వచ్చాడు<br>came, arrived |
| جَاءَ بِ | لایا | తెచ్చాడు<br>brought |
| ذَهَبَ | گیا | వెళ్ళాడు<br>went |
| ذَهَبَ بِ | لے گیا | తీసుకెళ్ళాడు<br>took away |
| ذَهَبَ عَنْ | دور گیا | దూరం చేసాడు/దూరంగా వెళ్ళాడు<br>went away |
| رَضِيَ | مان لیا، پسند کیا | ఇష్టపడ్డాడు, ఒప్పుకున్నాడు<br>was contented |
| رَضِيَ عَنْ | خوش ہوا (کسی سے) | ప్రసన్నుడయ్యాడు (ఎవరితోనైనా)<br>pleased with |
| ضَرَبَ | مارا | కొట్టాడు<br>stroke |
| ضَرَبَ فِي | زمین میں گھوما، پھرا | భూమి మీద సంచరించాడు, లేక తిరిగాడు<br>went forth; strove |
| ضَرَبَ لِ | زمین میں گھوما، پھرا | ప్రసంగించాడు<br>mentioned |
| ضَرَبَ عَلَى | لازم کیا، لگادیا | స్థిరంగా ఉంచాడు<br>Struck upon; overshadowed |
| ضَرَبَ مَثَلًا | مثال دی | ఉదాహరణ నిచ్చాడు<br>gave example |
| عَفَا | بڑھا، زیادہ ہوا | పెరగడం, ఎక్కువ అయింది<br>abound |
| عَفَا عَنْ | معاف کیا | క్షమించాడు<br>forgave |
| قَضَى | حکم سنایا، پورا کیا | ఆజ్ఞాపించాడు, పూర్తి చేసాడు<br>decreed; fulfilled |
| قَضَى بَيْنَ | فیصلہ کیا، معاملہ طے کیا | తీర్పు చేసాడు<br>judged |
| قَضَى عَلَى | ختم کیا، کام تمام کیا | చంపాడు/పని పూర్తి చేసాడు<br>killed |
| وَضَعَ | رکھا | ఉంచాడు/దించాడు<br>put; laid down |
| وَضَعَ عَنْ | اتارا | తొలగించాడు<br>removed |
| وَلَّى | منہ پھیرا | ముఖం తిప్పుకున్నాడు<br>turned; caused to turn |
| وَلَّى اِلَى | رُخ کیا | వైపు తిరిగాడు<br>turned to |
| وَلَّى عَنْ | اعراض کیا، منہ پھیرا | నుండి దూరంగా మరలాడు<br>turned away from |

*source: www.emuslim.com*

దాదాపు అన్ని భాషలలో ఒక పదానికి ఒకటి కంటే ఎక్కువ అర్థాలు ఉంటాయి. అదే విధంగా అరబీ భాషలో కూడా ఒక్కొక్క పదానికి ఎన్నో అర్థాలున్నాయి. కొన్ని పదాల విషయంలో ఆ అర్థాలు ఒక దాని కొకటి సంబంధం లేకుండా కనిపిస్తాయి. కాని లోతుగా అధ్యయనం చేస్తే వాటి మధ్య కూడా సంబంధం ఉంటుంది. ప్రతీ భాషలో బాగా ప్రాముఖ్యమైనది "క్రియ". ఒకరు చేసే పనిని ఇది తెలుపుతుందని మనకందరికి తెలిసిన విషయమే!

సాధారణంగా క్రియను భూతకాలం, వర్తమాన కాలం, భవిష్యత్ కాలం అనే మూడు కాలాలలో చెబుతారు. కాని అరబీలో క్రియకు 3 కాలాలు మాత్రమే కాకుండా, 15 రూపాలు కూడా ఉన్నాయి. అంటే ఒకే ఒక్క క్రియా పదానికి సంబంధించి మూడు కాలాలకు కలిసి (3 x 15 =) 45 పదాలు ఉత్పన్నమవుతాయి. అయితే 11 నుండి 15 వరకూ ఉండే క్రియా రూపాలు సాధారణ వాడుక భాషలో ఉపయోగించరు.

ఒక క్రియాపదానికి ఇన్ని రూపాలు ఉండటంతో, అరబీ భాషలో భావాన్ని ఎంతో వివరంగా వ్యక్తం చేయవచ్చు. క్రియ యొక్క 10 రూపాల గురించి గత కొన్ని వ్యాసాలలో ఆయా పదాలను కలిగి ఉన్న ఖుర్'ఆన్ ఆయత్‌లను ఉదాహరిస్తూ వివరించాము.

ప్రారంభంలో ఈ శీర్షిక ద్వారా ఖుర్'ఆన్ కలిగి ఉండే దాదాపు 77,800 పదాలలో 80 శాతం పదాలు అందిస్తామని చెప్పాము. **అల్లాహ్ అనుగ్రహం వలన గత పాఠం పూర్తయ్యేసరికి 82.7 శాతం పదాలు అందించ గలిగాము.**

ఒక వాక్యంలో క్రియా పదానికి ముందూ లేక వెనుక వచ్చే ఇతర పదాల వలన కూడా, ఒకొక్కసారి ఆ పదం యొక్క అర్థం ఆధారపడి ఉంటుంది. ఈ విషయం 'హదీస్ విజ్ఞానం' శీర్షికలో బుఖారీ(ర)వారు తన శిష్యునికి ఇచ్చిన సలహాలో కూడా ప్రస్తావించడం జరిగింది.

ఈ అంశం కూడా చాలా ముఖ్యమైనది కావడం వలన క్లుప్తంగా కొన్ని ఉదాహరణలతో వివరిస్తున్నాము. **'సలాత్'** అంటే ప్రార్థన (నమాజ్) అని అర్థం. అయితే ఈ పదం తరువాత **మిన్ అల్లాహ్** అనే రెండు పదాలు వస్తే, అప్పుడు ఆ సలాత్ అనే పదం ఆశీర్వాదం, అనుగ్రహం, శుభం ... అనే అర్థాలనిస్తుంది.

ఖుర్'ఆన్ వాక్యాలను వక్రీకరించే దుష్ప్రచారకులు, ఇటువంటి పదాలనే ఎత్తి చూపుతూ, (అల్లాహ్ క్షమించుగాక!) 'అల్లాహ్ కూడా ప్రార్థించాడు' అని ఖుర్'ఆన్‌లో ఉందని చెబుతూ ముస్లిములను మోసంతో నమ్మించాలని ప్రయత్నం చేస్తున్నారు. డిక్షనరీలో కూడా చూపిస్తా మంటున్నారు. అటువంటి ఓ అవివేకుని మాటలను ఖండిస్తూ, డిక్షనరీలో ఆ పదాలు కలిగిన పేజీని స్కాన్ చేసి, *"ముహమ్మద్(స) వారిపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న దుష్ప్రచారం"* పుస్తకంలో 124 మరియు 125 పేజీలలో ప్రచురించడం జరిగింది.

కేవలం పదాల అర్థాలు తెలుసు కోవడంతోనే భాషలో ప్రావీణ్యం రాదు. వాటిని ఉపయోగించే విధానం తెలుసుకోవాలి. అంటే మరో విధంగా చెప్పాలంటే గ్రామర్ (వ్యాకరణం) చాలా ముఖ్యం. అరబీ భాషను నేర్చుకోవాలని అనుకునేవారికి ఈ శీర్షిక ఒక గైడెన్స్‌గా ఉపయోగపడి ఉంటుందని మేము బావిస్తున్నాము.

ఈ 34వ పాఠంలో 28 అరబీ పదాలు (అంటే 11 సెట్లు) మరియు వాటి తెలుగు, ఇంగ్లీష్ మరియు ఉర్దూ భాషానువాద పదాలు ఇవ్వడం జరిగింది. స్థలాభావం వలన వాటి నుండి ఒక సెట్ పదాలను మాత్రమే తీసుకుని, వాటిని కలిగియున్న ఖుర్'ఆన్ ఆయత్‌లను ఉదాహరణలుగా దిగువన అందించాము. قَضَى (ఖదా) అనే పదానికి ఎన్నో అర్థాలున్నాయి. వాటిలో కొన్ని : **ఆజ్ఞాపించాడు, నెరవేర్చాడు, అమలుపరిచాడు, పూర్తిచేసాడు, నిర్ణయించాడు, తీర్పు ఇచ్చాడు** మొదలైనవి. అయితే ఈ పదం తరువాత عَلَى అనే విభక్త్య పదం వచ్చినప్పుడు (قَضَى عَلَى ఖదా అలా), దాని అర్థం **"చంపాడు"** అవుతుంది. ముందరి అర్థాలతో ఈ అర్థాన్ని పోలిస్తే చాలా తేడాగా కనిపించవచ్చు. కాని వాటితో సంబంధం ఉంది. ఈ అర్థాలను జాగ్రత్తగా అధ్యయనం చేస్తే, ఆ విషయం బోధపడుతుంది. క్రింది ఖుర్'ఆన్ ఆయత్‌లలో ఆ పదాలు ఉన్నాయి.

మరియు నీ ప్రభువు తనను తప్ప ఇతరులను ఆరాధించకూడదనీ మరియు తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహరించాలని **ఆజ్ఞాపించాడు**. ... (ఖుర్'ఆన్ 17:23)

మరియు ఆయనే మీ ఆత్మలను తీసుకుంటాడు రాత్రివేళ (నిద్రపోయినప్పుడు) మరియు పగటివేళ మీరు చేసేదంతా ఆయనకు తెలుసు. తరువాత ఆయన మిమ్మల్ని తిరిగి లేపుతాడు. ఒక నియమిత గడువు **నెరవేర్చ బడుతుంది**. తరువాత ఆయన వైపునకే మీ మరలింపు ఉంది. అప్పుడు ఆయన మీరు చేస్తూ ఉన్న కర్మలన్నీ మీకు తెలుపుతాడు. (ఖుర్'ఆన్ 6:60)

విశ్వాసులలో అల్లాహ్‌కు తాము చేసిన ఒప్పందం నిజం చేసి చూపిన వారు కూడా ఉన్నారు. వారిలో కొందరు తమ శపథాన్ని **అమలు పరచిన** వారున్నారు. మరి కొందరు దానిని పూర్తి చేసుకోవటానికి నిరీక్షిస్తున్నారు. మరియు వారు తమ వైఖరిని ఏమాత్రం మార్చుకోలేదు. (ఖుర్'ఆన్ 33:23)

అల్లాహ్ మహోన్నతుడు, సార్వభౌముడు, పరమ సత్యం. తొందర పడకు ఖుర్'ఆన్ అవతరణ నీపై **పూర్తి చేయబడే**వరకూ. మరియు ఇలా చెప్పు (ప్రార్థించు) : "ఓ నా ప్రభూ! నా జ్ఞానాన్ని వృద్ధిపరచు!" (ఖుర్'ఆన్ 20:114)

మరియు మూసా గడువును **పూర్తిచేసిన**ప్పుడు మరియు తన కుటుంబంతో ప్రయాణం చేస్తున్నప్పుడు తూర్ పర్వతపు దిక్కులో ఒక మంటను చూశాడు. (ఖుర్'ఆన్ 28:29)

... మూసా అతనిని ఒక గుద్దు గుద్దాడు. మరియు (అనుకోకుండా) అతనిని **చంపాడు**. అతను (మూసా) అన్నాడు, ఇది షైతాన్ పనే! నిశ్చయంగా అతడు శత్రువు మరియు స్పష్టంగా దారి తప్పించేవాడు. (ఖుర్'ఆన్ 28:15)

మరియు అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు, ఒక విషయంలో **నిర్ణయం తీసుకున్న**ప్పుడు, విశ్వసించిన పురుషునికి గానీ లేక విశ్వసించిన స్త్రీకి గానీ ఆ విషయంలో మరొక నిర్ణయం తీసుకునే హక్కులేదు. ... (ఖుర్'ఆన్ 33:36)

**సంవత్సర చందా వివరాలు :**

**రూ. 240/-**

**పోస్టల్ మనియార్డర్ (M.O.) ద్వారా**
**క్రింది ఎడ్రస్‌కు పంపవలెను.**

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్, సామర్లకోట-533440
**మనియార్డర్ చేయగానే 9491103017కి ఫోన్ చేసి**
**తెలియజేయవలసిందిగా కోరుతున్నాము**

**చందా క్రింది ఎకౌంట్‌లో డిపాజిట్ చేయవచ్చు.**

State Bank of India (SBI) A/c No. 10428633092
A.U. Campus Branch, Waltair, Visakhapatnam-530003
Contact : Dr. N. Srinivasa Rao, Cell:9491103017
velugubaata@gmail.com

మీ కవర్‌పై ఉండే ఎడ్రస్ స్లిప్‌పై మీ ఫోన్ నంబర్ లేకపోయినా లేక మీ నంబర్ మారినా ఆ నంబర్‌ను వెంటనే మాకు తెలియజేయండి.

గవర్నమెంట్ పోస్ట్ ద్వారా పంపిన పత్రికలు
ఏదైనా కారణంచే వెనక్కి తిప్పి పంపబడితే
వాటిని తిరిగి పంపిస్తాము, ఇన్షా అల్లాహ్!

కాని పోస్ట్‌లో అందకపోతే,
మరో కాపీ మేము పంపించలేము.

DTDC లేదా ANL కొరియర్ ద్వారా
కాపీని పొందగోరువారు
సంవత్సర చందా రూ. 240/- కు
అదనంగా మరో రూ. 150/- చెల్లిస్తే,
పత్రికను కొరియర్ ద్వారా పంపిన వెంటనే
కన్‌సైన్‌మెంట్ నంబర్ SMS చేస్తాము,
ఇన్షా అల్లాహ్!

బుక్ పోస్ట్‌లో పంపబడిన గత సంచిక కొందరు పాఠకులకు చాలా ఆలస్యంగా అంటే పోస్ట్ చేసిన 20 రోజుల తరువాత అందినట్లు తెలిపారు. ఈ విషయాన్ని పోస్టల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాము. ఆలస్యానికి చింతిస్తున్నాము.

**ముఖ్య ప్రకటన**

మా సొసైటీల పేర్లు చెప్పి మేము ప్రచురించిన పుస్తకాలు చూపి, సభ్యులమని చెప్పుకుని ఎవరైనా మస్జిద్‌ల కోసం గాని, మదరసాల కోసం గాని లేక ఇతరత్రా విరాళాల కోసం వస్తే, వారు మా సభ్యులు కాదని తెలుసుకోండి. మేము విరాళాల కోసం ఎవరినీ కోరలేదు. ఇన్షా అల్లాహ్ ఎవరినుండి సహాయం కోరము అల్లాహ్ నుండి తప్ప - శాంతిబాట టీమ్

**మన రాష్ట్రంలోగాని ఇతరచోట్లగాని శాంతిబాటకు అనుబంధ సంస్థలు ఏమీ లేవు.**

**ఏ జమాత్‌కు ఇది అనుకూలం గాని లేదా వ్యతిరేకం గాని కాదు.**

ఒకవేళ ఎవరైనా ఆ విధంగా ప్రచారం చేస్తే, అటువంటి ప్రచారానికి మాకూ ఎటువంటి సంబంధం లేదు. కేవలం ఖుర్'ఆన్ మరియు సున్నత్‌పైనే ఆధారపడి స్వచ్ఛందంగా కొందరు ముస్లిమ్ సోదరులు నడుపుతున్న పత్రిక ఇది. మరియు ఇది ముస్లిమ్ ఉమ్మత్‌కి సంబంధించినది. సత్యాన్ని నిర్భయంగా ఏ ఒత్తిడి లేకుండా ప్రజలకు తెలియజేయాలని మేము ఎవరి దగ్గర నుండి ఆర్థిక సహకారాన్ని కోరలేదు. అరుదైన గ్రంథాల నుండి ఎంతో విలువైన ఇస్లామీయ సమాచారాన్ని ప్రామాణిక ఆధారాలతో శాంతిబాటలో అందిస్తున్నాము కేవలం అల్లాహ్‌పై నున్న భరోసాతో మాత్రమే.


మీ అభిప్రాయాలను, విమర్శలను కార్డుపై వ్రాసి 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా velugubaata@gmail.com కు పంపండి.

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** Saanthibaata Publishing House, 19-1-447, Hanuman Statue Center, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650

# శాంతిబాట ప్రచురణ

జకాత్ (ఇంగ్లీష్ మరియు తెలుగు) పుస్తకాలు మా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. www.saanthibaata.net/zakat

జకాత్ (ఉర్దూ) ముద్రణలో ఉంది.




For some strong reasons, it is not permitted to post any of our pdf files (whether partial or full) in other websites. Instead a link may be provided.
For individual purpose only.
Not for sale.
Not for printing (for sale)







శాంతిబాటలో ప్రచురించబడిన వ్యాసాలు గాని, మా ఇతర ప్రచురణలు గాని ముద్రించు కోవడానికి లేదా జెరాక్స్ చేసి పంచడానికిగాని ఏ పబ్లిషర్స్‌కుగాని, వ్యక్తులకు గాని ఎటువంటి అనుమతి నివ్వలేదు. దీనికి భిన్నంగా ఎవరైనా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోబడతాయి.



## 4 సంవత్సరాలుగా శాంతిబాటను ఆదరిస్తున్న మా చందాదారులకు కృతజ్ఞతలు


**సంవత్సర చందా రూ. 240/-**

మీ బంధువులు మరియు స్నేహితులచే శాంతిబాట చదివించండి

గవర్నమెంట్ పోస్ట్ ద్వారా కాపీలు ఆలస్యంగా అందుకునే వారు కోరితే డిటిడిసి కొరియర్‌లో పంపించ గలము. అదనంగా రూ.150/- చెల్లించ వలసి ఉంటుంది.

తోటివారికి అందించేందుకు వీలుగా శాంతిబాటలో ప్రచురితమైన 'జకాత్' వ్యాసాన్ని 80 పేజిలతో 1/8 డెమీ సైజులో ప్రత్యేక పుస్తకంగా విడుదల చేశాము. పుస్తకం కోసం ఆర్డర్లు ఆలస్యంగా అందాయి. అప్పటికే ముద్రణ పూర్తి కావడంతో పుస్తకాలు అందరికీ సరిపోలేదు. ఇన్షా అల్లాహ్ మరలా ముద్రిస్తాము. (వెల రూ. 25/-)

## క్రింది రెండు పరిశోధనాత్మక పుస్తకాలు స్టాకులో లేవు. కొన్ని మార్పులతో వీటి రెండవ ముద్రణ తెలుగు,ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో ముద్రించబడుతుంది ఇన్షా అల్లాహ్!




శాంతిబాట ప్రారంభానికి ముందు ప్రచురించబడింది




శాంతిబాట పాఠకులకు తొలి సంవత్సరం ఉచితంగా అందజేయబడింది

**SAANTHIBAATA MONTHLY September, 2013** Samalkot-533440 (East Godavari Dist.)
**Registered with Registrar of News Papers for India RNI Reg. No. APTEL/2009/29650**
**Postal Concessional Registration No. AP/KD/140/2011-2013**

స్పష్టమైన ఉపదేశాలను పొందిన తరువాత
కూడా ఎవరైతే చీలిపోయారో మరియు
విబేధాలకు గురి అయ్యారో, వారి మాదిరిగా మీరు కావద్దు,
మరియు అలాంటి వారికి ఘోరశిక్ష ఉంటుంది.
(ఖుర్'ఆన్ 3:105)

వాస్తవానికి విశ్వాసులు ఒకొరికొకరు సహోదరులు.
కావున మీ సహోదరుల మధ్య
సంధి చేయించండి. మరియు మీరు కరుణించ
బడాలంటే అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి.
(ఖుర్'ఆన్ 49:10)

---

మరియు వాస్తవానికి మీ కొరకు ఈ గ్రంథంలో అవతరింపజేశాడు:
"ఒకవేళ మీరు అల్లాహ్ యొక్క ఆయత్‌లను గురించి తిరస్కారాన్ని మరియు
పరిహాసాన్ని వింటే, అలా చేసేవారు ఇతర సంభాషణ ప్రారంభించ నంత
వరకు మీరు వారితో కలిసి కూర్చోకండి!" అలా చేస్తే నిశ్చయంగా,
మీరు కూడా అలాంటి వారే! నిశ్చయంగా అల్లాహ్ కపట విశ్వాసులను
మరియు సత్య తిరస్కారుల నందరినీ నరకంలో జమచేస్తాడు.
(ఖుర్'ఆన్ 4:140)

---

ఓ విశ్వసించిన ప్రజలారా! గ్రంథమివ్వబడిన వారిలోని ఓ వర్గాన్ని
(వారి మాటలు విని) మీరు అనుసరిస్తే, వారు మిమ్మల్ని
విశ్వసించిన తరువాత కూడా సత్య తిరస్కారులుగా
మార్చి వేస్తారు (ఖుర్'ఆన్ 3:100)

Visit
www.saanthibaata.net

23 దేశాలలోని తెలుగు పాఠకులచే వీక్షించబడుతున్న
తెలుగు ఇస్లామీయ వెబ్‌సైట్